భండారు అచ్చమాంబ

# తొలి తెలుగు కథలు

సంపాదకుడు
సంగిశెట్టి శ్రీనివాస్

కవిలె
తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్

# భండారు అచ్చమాంబ
# తొలి తెలుగు కథలు

సంపాదకులు : సంగిశెట్టి శ్రీనివాస్
ముఖచిత్రం : భరత్‌భూషణ్
వెల : 95/-
కవిలె ప్రచురణ సంఖ్య : 4
ప్రతులకు:
కవిలె, తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్,
13-6-434/బి/38, హిమగిరి ఎవెన్యూ,
ఫ్లాట్ నెం. 305, ఓంనగర్,
మెహిదీపట్నం రింగ్‌రోడ్, హైదరాబాద్-8.
ఫోన్ : 98492 20321

Bhandaru Atchamamba's
The First Short stories in Telugu

Editor : **Sangisetti Srinivas**
First published : 2009
Price : Rs. 95/-
Kavile, Publication No. 4
For copies : Kavile, Telangana Research & Referral Centre,
13-6-434/B/38, Himagiri Avenue, Flat No. 305,
Omnagar, Mehdipatnam Ringroad,
Hyderabad, 500 008 Mobile: 98492 20321

and
All leading Shops
Printed at :

# కథా క్రమం


| | |
|---|---|
| గుణవతియగు స్త్రీ | 36 |
| లలితాశారదలు | 39 |
| జానకమ్మ | 44 |
| దంపతుల ప్రథమకలహం | 49 |
| సత్పాత్రదానము | 56 |
| స్త్రీవిద్య | 61 |
| ధనత్రయోదశి | 68 |
| భార్యభర్తల సంవాదం | 81 |
| అద్దమును సత్యవతియును | 85 |
| బీదకుటుంబము | 89 |

పుస్తకం ఈ రూపం తీసుకోవడానికి
హార్ధికంగా, ఆర్థికంగా వెన్నంటి
ఉండి నడిపించిన

ముదిగంటి సుజాతారెడ్డిని
మదిన తలుసుకుంటూ........

తొలి తెలుగు కథకులు భండారు అచ్చమాంబ (1874-1905) ఈమె కృష్ణజిల్లాలో పుట్టినప్పటికీ పెరిగింది, చది- ందీ, పెళ్లయిందీ తెలంగాణలోనే. అచ్చమాంబ - వాం పెద్దన్న కొమర్రాజు శంకరరావు ఇంట్లో మేనమామ మాధవరావుతో దేవరకొండలో జరిగింది. 1903లో వెలువడ్డ అబలా సచ్చరిత్ర రత్నమాలలో రుద్రమదే- , గణపాంబల జీ- త చిత్రణ చేసి ఆధునిక కాలంలో తెలంగాణ మళకు సముచిత స్థాన- ఎచ్చిన రచయిత్రి అచ్చమాంబ. ఈమె కథల్లో మొదటిదిగా 1902లో ందూసుందరిలో వెలువడ్డ స్త్రీ- ద్య□□ భార్గ- రావు సంకలనం చేసిన నూరేళ్ళపంట (2002)లో చోటు చేసుకుంది. అయితే అచ్చమాంబ అంతకు ముందే ఎన్నో కథలు వెలువరించారు. రాయసం వెంకటశివుడు వెలువరించిన □జనానా□ పత్రిక 1898 జూలై సంచికలో □ప్రేమపరీక్షణ□ అనే కథను వెలువరించారు. అలాగే సెప్టెంబరు సంచికలో □□ఎఱువు సొమ్ము పరువు చేటు□ అనే బుళ ప్రచారం పొందిన కథను రాశారు. - టితోబాటుగా లలితాశారదులు (1901, జనానా), మహారాష్ట్రీయస్త్రీలు సంబరంగా జరుపుకొనే పండగ □ధనత్రయోదశి□. అదే పేరుతో నవంబరు, 1902 ందూసుందరి పత్రికలో ఒక కథను, బీదకుటుంబం (1904, నవంబరు, ందూసుందరి) కథను వెలువరించారు. అరడజనుపైగా వెలువడ్డ ఈమె కథల్ని చిన్న సంకలనంగా వెలువరించినట్లయితే అలనాటి తెలుగు కథల స్వరూప, స్వభావాలు, - షయ - శేషాలు - వరంగా తెలుసుకోడానికి - లవుతుంది. అచ్చమంబా సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు □యేబదివేల బేరము□ పేరిట ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1910లో ఒక కథను రాశాడు. ఈయన ఇంకాకొన్ని కథలు రాసినప్పటికీ వాటిగురించి పూర్తి - వరాలు తెలియడం లేదు. నిడదవోలు వెంకటరావు 1976లో రాసిన కొమర్రాజు లక్ష్మణరావు జీ- త చరిత్ర పుస్తకం ప్రచురించేందుకు 30 ఏండ్ల తర్వాత ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# తెలుగు కథకు పునాది భండారు అచ్చమాంబ

ఒక జాతి జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, మెరుగైన జీవితం కోసం చేసినపోరాటాలు– వాటి ద్వారా సాధించిన ఫలితాలు సాహిత్యంలో ప్రతిఫలించిన నాడే వాటికి శాశ్వతత్వం ఏర్పడుతుంది. తెలుగు వారి జీవితాల్ని సాంస్కృతిక పునర్వికాస వెలుగులో కథా సాహిత్యంలో రికార్డు చేసిన వారిలో అగ్రగణ్యులు, ఆద్యులు భండారు అచ్చమాంబ. తెలంగాణ–ఆంధ్ర–విదర్భ–ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లోని జీవితాలతో లోతైన సంబంధాలు కలిగిన అచ్చమాంబ 19వ శతాబ్దంలోనే తాను చూసిన జీవితాలను, వాటిలో రావాల్సిన మార్పుల్ని కథా సాహిత్యంలో రికార్డు చేశారు.

ఆధునిక కథానిక ప్రక్రియకు అక్షరార్పణ చేసింది, పునాది వేసింది భండారు అచ్చమాంబే. ఆమె కన్నా ముందు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ పోషణలోని పండితుడు తాతాచార్యులు, కందుకూరి వీరేశలింగంలు రాసినవే తొలి కథలని 'తెలుగు కథకు వందేళ్ళు' సందర్భంగా పండితులు కొత్త వాదనలు ముందుకు తీసుకు వస్తున్నారు. ఆధునిక కథకు ఉండాల్సిన కథ, కథనం, శైలి, శిల్పం, సారం, జీవితం లాంటి అంశాలు ఏవీ లేకుండా తాతా చార్యులు రాసిన 'పరమానందయ్య శిష్యుల' లాంటి ఉబుసుపోక కబుర్లని కథలుగా చెప్పడానికి వీలులేదు. సి.పి.బ్రౌన్, ఆయన పోషణలోని పండిత వర్గాన్ని రంజింప చేయడానికి చెప్పిన కబుర్లలో అక్కడక్కడ సమకాలీన అంశాలు కూడా చోటు చేసుకోవచ్చు అంతమాత్రాన వాటిని ఆధునిక కథలుగా అంగీకరించడానికి వీల్లేదు. వాటిని కథలగా కన్నా తెలుగు నేర్చుకునే ఇంగ్లీషువారికి పనికొచ్చే సంభాషణల కూర్పుగా చెప్పుకుంటే బాగుంటుంది. ఉబుసు పోకకు, బ్రౌన్– ఆయన పండితుల మెప్పుకోసం చెప్పిన కబుర్లని 'ఆధునిక కథలు'గా చిత్రించడమంటే నిజమైన కథలకు, కథకులకు అన్యాయం చేయడమే. స్వయంగా సిపి బ్రౌన్ 'యూస్‌లెస్' అని పేర్కొన్న వాటిని కథలుగా చెప్పడం విడ్డూరంగా ఉంది.

ఇక రెండో వ్యక్తి కందుకూరి వీరేశలింగం. దాదాపు తాతాచార్యుల కథల్ని 1974లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం బ్రౌన్ ప్రాజెక్టులో భాగంగా అచ్చేసిన (రీప్రింట్) కాలంలోనే కందుకూరి వీరేశలింగం సాహిత్యంపై సమగ్ర పరిశోధన చేసిన అక్కిరాజు రమాపతిరావు ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వ్యాసం రాస్తూ తెలుగు కథానికకు ఆద్యుడు– కందుకూరి అని పేర్కొన్నాడు. ఒక వేళ నిజంగా ఆయనే ఆద్యుడైనట్లయితే 35 యేండ్ల కింద తాను 'కందుకూరి వీరేశలింగంపై సమగ్ర పరిశోధన' చేసిన సమయంలో ఈ విషయం ఎక్కడా పేర్కొనలేదు. అప్పుడు 'ప్రహసనాలు'గా పేర్కొన్న అంశాలు ఇప్పుడు కథానిక (కథ)లుగా ఎలా మార్పు చెందాయో అర్థం కావడం లేదు. పరిశోధనలోనూ, పాండిత్యంలోనూ, కథానికల రచనల్లోనూ అపార అనుభవమున్న అక్కిరాజు రమాపతి ఏ ఒక్క ఆధారము చూపకుండా కందుకూరిని గుడ్డిగా తొలి కథకుడిగా ప్రతిష్టించేందుకు ప్రయత్నించారు. కందుకూరి వీరేశలింగం తాను రాసిన వాటిలో దేనికి ఆద్యుడైతే ఆ విషయాన్ని విస్పష్టంగా చెప్పుకున్నాడు. అంతే గాకుండా భండారు అచ్చమాంబకు కందుకూరికి సన్నిహిత సాహిత్య సంబంధముండేది. అచ్చమాంబ కథల్ని కందుకూరి చదివి సలహాలు ఇచ్చినవాడే. ఆనాడు కందుకూరి ఎక్కడా చెప్పుకోని 'తొలి కథకుడు' గుర్తింపుని అక్కిరాజు గారు అయాచితంగా ఆయనకు ఆపాదింప చూడడం నిజాల్ని పూర్తిగా గుర్తించ

నిరాకరించడమే. స్వయంగా కథకుడైన రమాపతిరావు కథానికకుండాల్సిన లక్షణాల్లో ఎన్నింటిని కందుకూరి రచనల్లో, దేనిలో చూసిండో చెబితే బాగుండేది.

పై విషయాల్ని దృష్టిలో పెట్టుకున్నట్లయితే తెలుగులో మొట్టమొదటి సారిగా ఆధునిక పద్ధతిలో కథలు రాసిన వారిలో భండారు అచ్చమాంబ ఆద్యులు. ఆవిడ రచనలు ఆనాటి ప్రజల జీవితాల్ని అధ్యయనం చేసి వాటిలో మెరుగైన మార్పులు తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో పాత్రలను సృష్టించి వాటి ద్వారా కథని నడిపించిన తీరు ఆధునికతకు అద్దం పట్టింది.

19వ శతాబ్దిలో సాహిత్య దృష్టితో పత్రికలని నడిపించిన వారిలో కొక్కొండ వెంకటరత్నం పంతులు, కందుకూరి వీరేశలింగం పంతులు, రాయసం వెంకట శివుడు తదితరులు ముఖ్యులు. అయితే వీరంతా సాహిత్య విమర్శ పరిశోధన, ప్రాచీన సాహిత్యానికి, ప్రక్రియలకు ప్రాధాన్య మివ్వగా పులుగుర్త లక్ష్మీనరసమాంబ, మొసలికంటి రామాబాయమ్మల సంపాదకత్వంలో నడిచిన పత్రికలు స్త్రీల సమస్యలకు, ఆధునిక ప్రక్రియలకు ప్రాధాన్య మిచ్చాయి. భండారు అచ్చమాంబ మొట్టమొదటి కథ రాయసం వెంకటశివుడు సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జూలైలో 'ప్రేమ పరీక్షణము', 1898 సెప్టెంబరులో 'ఎఱువు సొమ్ము పరువు చేటు' పేరిట అచ్చయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా వెంకటశివుడు 1945లో హైదరాబాద్ నుంచి వెలువడ్డ 'తెలుగు తల్లి' కొమర్రాజు లక్ష్మణరావు స్మారక సంచికలో రాసిండు. అయితే ఇప్పటికీ 'తెలుగు జనానా' పత్రిక సంచికలు పూర్తిగా అందుబాటులో లేనందున ఇదే పత్రికలో 'మే'లో అచ్చయిన 'గుణవతి యగు స్త్రీ' మొట్టమొదటి కథగా స్వీకరించాల్సి ఉంటుంది. భండారు అచ్చమాంబ రాశారని తెలుస్తున్న మొత్తం 12 కథల్లో పది కథలతో ఈ పుస్తకం వెలువడుతోంది. ఇందులో 1. గుణవతియగు స్త్రీ, 2. లలితా శారదలు, 3. జానకమ్మ, 4. దంపతుల ప్రథమ కలహం, 5. సత్పాత్ర దానము, 6. స్త్రీవిద్య, 7. ధనత్రయోదశి, 8. భార్యభర్తల సంవాదం, 9. అద్దమును సత్యవతియును, 10. బీద కుటుంబము. ఇందులో స్త్రీ విద్య, ధనత్రయోదశి రెండు కథలు మాత్రమే ఇంతవరకు తెలుగు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.

మొసలికంటి రామాబాయమ్మ సంపాదకత్వంలో వెలువడ్డ 'హిందూ సుందరి' పత్రికలోనూ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలోని 'సావిత్రి' పత్రికల్లో అచ్చమాంబ రచనలు చాలా అచ్చయ్యాయి. ఇందులో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' దేశ విదేశాల్లోని వీర, ధీర వనితల ఉదాత్త చరిత్రల వ్యాస సమాహారం. ఆనాటి మహిళల్లో స్ఫూర్తి, రచనా ప్రేరణను కలిగించిదంటే అతిశయోక్తి కాదు. క్రోషా అల్లికలు మొదలు, వంటల వరకు అనేక విషయాలపై ఆయా పత్రికల్లో ఆమె రాసిన వ్యాసాలు ఇప్పటికీ అచ్చుకు నోచుకోలేదంటే తెలుగునాట మహిళల రచనలపై వెలుగు ప్రసరిస్తున్న తీరు తెలుస్తుంది.

తెలుగునాట పదుల కొలదిగా గల విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద పరిశోధన సంస్థలు, మహిళాభివృద్ధి సంస్థలు, స్త్రీల కోసం పనిచేస్తున్న ఎన్జీవోలు భండారు అచ్చమాంబ కథలపై దృష్టి కేంద్రీకరించక పోవడం దురదృష్టకరం. తెలుగునాట పునర్వికాసోద్యమానికి 20వ శతాబ్ది ఆరంభం నుండి విస్తృతంగా పనిచేసిన అచ్చమాంబ ఆంధ్రదేశంలో మొట్టమొదటి సారిగా 1901 బృందావనీ స్త్రీ సమాజాన్ని మచిలీపట్నంలో నెలకొలిపారు. ఆ మరుసటి సంవత్సరం అక్కడే కృష్ణాపత్రిక స్థాపించబడింది. ఇదే సమయంలో తెలంగాణలో పునర్వికాసోద్యమానికి పునాదులు పడ్డాయి. అచ్చమాంబ తమ్ముడు కొమర్రాజు లక్ష్మణరావు పూనిక మేరకు హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించబడింది. హైదరాబాద్ నుంచి నాగపూర్, మద్రాసు,

బొంబాయిలకు రైలు సదుపాయాలు విస్తృతం కావడంతో ఈ ప్రాంతాలకు రాకపోకలు తరచుగా జరిగాయి. వీటివల్ల అచ్చమాంబ, తెలంగాణ, తెలుగు సాహిత్యం, పునర్వికాసోద్యమాలు లబ్ధిపొందాయి.

అచ్చమాంబ రాసిన కథలన్నీ ఆధునిక భావాలతో పాత్రల సంభాషణలతో, సమాజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాసినవే. స్త్రీల చదువే సర్వ సమస్యలకు పరిష్కార మార్గమని నేటి 'పాపులేషన్ సిద్ధాంత' కర్తలు చెబుతున్న విషయాన్ని వందేళ్ళ క్రితమే ఆచరణకు ప్రయత్నించిన సాహసి అచ్చమాంబ. అటు బొంబాయి, ఇటు బిలాస్ పూర్, నాగపూర్, హైదరాబాద్, మచిలీపట్నం, రాజమండ్రి, వారణాసి ఇలా చాలా ప్రదేశాలు తిరిగి తమ భావాల్ని ఉపన్యాసాలు, రచనలు, ఉత్తరాలు, పుస్తకాలు, ప్రయివేట్ టాక్స్ ద్వారా బహుళ ప్రచారంలోకి తెచ్చిన ఆమె చైతన్యం ఆచరణ నేటికీ స్ఫూర్తి దాయకం.

అచ్చమాంబ కథలన్నీ ఆధునిక భావాలకు వేదికలు. ప్రతి కథలోనూ సమాజోద్ధరణ, మహిళాభ్యున్నతి, మెరుగైన సమాజం కోసం తహతహ ప్రతి అక్షరంలో ప్రత్యక్షమయ్యేవి. గుణవతియగు స్త్రీ కథలో పురాణ కథను తీసుకొని ఆధునికతను ఆపాదించి పొదుపు ద్వారా సంసారాన్ని స్వర్గంగా ఎలా మార్చుకోవచ్చో చెప్పింది. మూడు పేజీల ఈ చిన్న కథలో అన్ని వృత్తుల్లో అభినివేషం ఉన్నట్లయితే లోకాన్ని ఎలా జయించగలమో చెప్పింది. స్త్రీ సహజ సహనం గురించి ఆమెచెప్పిన తీరు బాగుంది. లలితాశారదలు అనే పిల్లల కథలో క్షమాగుణం ఎంతటి ఉదాత్తమైందో వివరించింది. అపకారికి సైతం ఉపకారం చేయడం, నైతిక విలువలకు సంబంధించిన గుణపాఠాలు ఇందులో ఉన్నాయి. ఈర్ష్య, గర్వం ఉన్న మిత్రురాలిలో మార్పు తీసుకొచ్చిన తీరు ఆదర్శనీయం. ఇక జానకమ్మ కథలో అమ్మాయిలకు చదువు చెప్పించాలనే నినాదాన్నిచ్చింది. చదువుకోవడం వల్ల మంచి జీవితమే గాదు, మంచి వరుడు గూడా వస్తాడని ఆనాటి తలిదండ్రుల్లో చైతన్యాన్ని ఈ కథ ద్వారా కలిగించింది. చదువుంటే కట్నకానుకలు అవసరం లేదని 'స్త్రీవిద్య' ప్రాధాన్యతని వివరించింది. చిన్నచిన్న పొరపొచ్చాలు నిండు జీవితాలను ఎలా ఛిద్ర పరుస్తాయో తెలుపుతూ దాన్ని ఎలా అధిగమించాలో తెలిపే కథ 'దంపతుల ప్రథమ కలహం', హైద్రాబాదు జీవితాన్ని కూడా ప్రస్తావించి నిజంగా అవసరమున్న వానికే దానం చేయాలని తన 'సత్పాత్రదానం' కథ ద్వార చెప్పింది.

సంవాద రూపంలో ఉన్న 'స్త్రీవిద్య' కథలో భిన్న కోణాల్లో స్త్రీల చదువు ప్రాధాన్యతను వివరించింది. స్త్రీలు అజ్ఞానాంధకారంలో ఉన్నట్లయితే కుటుంబం ఉన్నతికి రాదనే భావనను ఈకథలో చెప్పింది. ఇక ధనత్రయోదశి కథలో బొంబాయికి వలసవెళ్లిన బతికి చెడ్డ బిడ్డ మానసిక సంఘర్షణ, నిజాయితీ, నైతికత ఎన్నటికైనా మేలు చేకూరుస్తుందని చెప్పింది. దారిద్ర్యంలో ఉన్నప్పటికీ ఉన్నత గుణాలను విడువకూడదని కథ ద్వారా చెప్పింది. భార్యభర్తల సంవాదం కథలో స్త్రీలకు బంగారు అభరణాలకన్నా సద్గుణాలే మిన్న అనే భావనను బలంగా చిత్రీకరించింది. నిజంగా జరిగిన వృత్తాంతాన్ని తీసుకొని బీదకుటుంబం కథ ద్వారా స్త్రీ ద్వారానే కుటుంబంయొక్క పరువు మర్యాదలు నిలబడతాయని చెప్పింది. గౌరవం కూడా ఆమె వల్లనే దక్కుతాయనే విషయాన్ని ఇందులో వివరించింది. 20వ శతాబ్ది ఆరంభంలో తన కథల ద్వారా తెలుగు సమాజంలో ముఖ్యంగా మహిళల్లో ఆమె చెదరని ముద్ర వేశారు. ఆనాడు చదువుకున్న ప్రతి స్త్రీ ఏప్రాంతం వారైనా ఆమె ప్రభావానికి గురయ్యారంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆమె కార్యాచరణ, వాక్చాతుర్యం వీటికి తోడు భిన్న ప్రదేశాల్లో వివిధ సభలు సమావేశాల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఒకరిగా కలిసి పోయారు.

వీటన్నింటితో పాటు పట్టించుకోవాల్సిన మరో ప్రధాన విషయం అచ్చమాంబ ప్రాంతం. అచ్చమాంబను

ఏ ఒక్క ప్రాంతానికి పరిమితం చేయలేము. ఎందుకంటే ఇప్పటి నల్లగొండ జిల్లాలోని, ఒకప్పటి కృష్ణాజిల్లాలోని మునగాల పరగణా మేనేజరు కొమర్రాజు వెంకటప్పయ్య-గంగమ్మల సంతానంగా ఆమె పుట్టింది. అయితే ఆమె ఎక్కువ భాగం జీవితం గడిపింది తెలంగాణలో. రాజా నాయని వెంకటరంగారావు ప్రభావం ఆమెపై ఎక్కువగానే ఉండింది. వీటన్నింటి దృష్టిలో పెట్టుకున్నట్లయితే ఆవిడపై మిగతా ఏప్రాంతంతో పోల్చుకున్నా తెలంగాణ వారికే ఎక్కువ హక్కుంది. అచ్చమాంబ మూలాలు మాత్రం ఆంధ్రప్రాంతంలోనే ఉన్నాయి. 1874లో అచ్చమాంబ తాత (తల్లి-తండ్రి) వ్యాపారలావాదేవీల కారణంగా నందిగామలో ఉండిపోయారు. వీరితో పాటు గంగమ్మ కూడా అక్కడే ఉండడంతో అచ్చమాంబ నందిగామలో జన్మించింది. అయితే అచ్చమాంబ ఆరేండ్ల వయసులోనే తండ్రి చనిపోవడంతో వారి మకాం సవతి తల్లి కొడుకు కొమర్రాజు శంకరరావు దగ్గరికి మారింది. అప్పుడాయన ఉద్యోగ రీత్యా నల్లగొండ జిల్లా దేవరకొండలో ఉండేవారు. దీంతో ఈసారి పూర్తిగా ఆమె నల్లగొండ వాసిగా మారారు. ఇక్కడున్న సమయంలోనే ఓనమాలు నేర్చుకున్నారు. మేనమామ భండారు మాధవరావుతో వివాహం కూడా ఇక్కడే 1884 జరిగింది.

వివాహం తర్వాత ఆమె మకాం విదర్భకు మారింది. అక్కడ తమ్ముడితో పాటు నాగపూర్, బిలాస్‌పూర్‌లలో విద్యాభ్యాసం జరిగింది. ఇక్కడున్న కాలంలోనే గుజరాతీ, మరాఠీ, తెలుగు, హిందీ భాషలు నేర్చుకుంది. ఆయా భాషల్లోని అపారమైన సాహిత్యాన్ని తమ్ముని తోడ్పాటుతో చదవడానికి వీలయింది. భర్తతో పాటుగా ప్రతి సంవత్సరం తెలుగు ప్రాంతమంతా పర్యటించి ఉపన్యాసాలు, సభలు, సమావేశాలు నిర్వహించేంది. బొంబాయి లాంటి ప్రాంతాల్లో జరిగే అఖిలభారత కాంగ్రెస్ సమావేశాల్లో కూడా పాల్గొని విషయాల్ని తెలుసుకునేది. ఒకవైపు సోదరుడు మునగాల జమిందారీలో ఉద్యోగం చేస్తూ ఆంధ్ర-తెలంగాణ-మద్రాసు ప్రాంతాల్లో సమానంగా సాహిత్య ప్రచారాన్ని, సాంస్కృతిక పునర్వికాసానికి పునాదులు వేయగా, మరోవైపు అచ్చమాంబ మహిళా లోకంలో తిరుగులేని మార్పుల్ని తీసుకువచ్చింది.

తన కథల ద్వారా సమాజంలో మార్పులు తీసుకురావడానికి విశేషమైన కృషి చేసిన భండారు అచ్చమాంబ గురించి ఈనాడు ఏ పాఠ్యపుస్తకంలోనూ ఆమె గురించి లేదు. కేవలం కథలే గాకుండా అబలా సచ్చరిత్ర రత్నమాల పేరిట తెలుగులో మొట్టమొదటి సారిగా మహిళల జీవిత చరిత్రల్ని రాసింది. క్రోషా అల్లిక, వంటలు, కుట్లు వంటి మహిళలకు సంబంధించిన విషయాల్ని పట్టించుకొని వాటి ప్రచారానికోసం తన జీవితాన్ని వెచ్చించారు. కేవలం రాతలకే పరిమితం గాకుండా ఆచరణలో అనాథ పిల్లల్ని ఆదుకున్నారు. తనకు పుట్టిన పిల్లలు దక్కలేదు. దాంతో ఆవిడ ఆనాథ పిల్లల్లోనే తన పిల్లల్ని చూసుకుంటూ వారి బాగోగుల్ని పట్టించుకునేవారు. 1904 చివర్లో బిలాస్‌పూర్‌లో ప్లేగు వ్యాధి వచ్చిన సందర్భంలో ఆనాథ పిల్లల్ని చేరదీసి వారి ఆలన పాలన చూశారు. పిల్లల నుంచి ఆ వ్యాధి ఆమెకు సోకి వారి సేవలోనే 1905 జనవరి 19న అచ్చమాంబ మరణించారు. కేవలం 30 ఏండ్ల జీవితంలోనే కొన్ని వందల సంవత్సరాలకు సరిపడా కృషిని, ఆచరణను మనందరికి అందించిన అచ్చమాంబ ఆశయాలను అమలు పరచడమే ఆవిడకు నిజమైన నివాళి.

- సంగిశెట్టి శ్రీనివాస్.
- 'కవిలె' తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్& తెలంగాణ హిస్టరీ సొసైటీ, హైదరాబాద్.

## తెలంగాణ అందించిన

## తెలుగు 'తొలి కథలు'

భండారు అచ్చమాంబ రచించిన కథలు పన్నెండు వరకు వుండవచ్చునని సంగిశెట్టి శ్రీనివాస్ సమాచారం సేకరించాడు. ఇప్పటివరకు "ధనత్రయోదశి", "స్త్రీవిద్య" అనే ఆమె రెండు కథలు పాఠకులకు అందుబాటులో వున్నాయి. ఇప్పుడు అదనంగా సంగిశెట్టి పది కథలు సేకరించి "భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు" పేరుతో అచ్చు వేస్తున్నాడు. అచ్చమాంబ 1898లో రచించిన "ప్రేమ పరీక్షణము", "ఎరువు సొమ్ము పఱువు చేటు" కథలు రాయసం వెంకటశివుడు నిర్వహించిన తెలుగు జనానా పత్రికలో జూలై, సెప్టెంబరు సంచికల్లో అచ్చయ్యాయి. ఆ కథల కోసం సంగిశెట్టి చాలా శోధించాడు. కాని దొరకలేదు. ఆఖరికి నిరాశచెంది దొరికన పది కథలనే పుస్తకంగా తీసుకు వస్తున్నాడు.

భండారు అచ్చమాంబ ప్రసిద్ధ పరిశోధకుడు, తెలంగాణ వైతాళికుల్లో అగ్రేసరుడైన కొమర్రాజు వేంకట లక్ష్మణరావు అక్క. అచ్చమాంబ, లక్ష్మణరావులు ఆరేండ్లు, నాలుగేండ్ల వయస్సులోనే తండ్రి మరణించాడు. తల్లి గంగమ్మ తన పిల్లలతో సవతికొడుకు దగ్గరికి తెలంగాణలోని నల్లగొండ జిల్లా దేవరకొండకు వచ్చింది. గంగమ్మ సోదరుడగు భండారు మాధవరావు ఇప్పటి మధ్యప్రదేశ్ లోని నాగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గంగమ్మ ఎనిమిదేండ్ల అచ్చమాంబను అతనికిచ్చి

వివాహం చేసి అక్కడికి పిల్లలతో వెళ్ళిపోయింది. లక్ష్మణరావు ప్రారంభ విద్యాభ్యాసం దేవరకొండలో ఆ తర్వాత నాగపూర్‌లో జరిగింది. పదవ యేట వరకు అచ్చమాంబకు అక్షర జ్ఞానమే లేదు. లక్ష్మణరావుకు ఉ పాధ్యాయడు వచ్చి పాఠాలు చెప్తున్నప్పుడు పక్కనే చేరి అచ్చమాంబ శ్రద్ధగా విని వ్రాయటం చదవటం నేర్చుకుంది. చురుకైన అచ్చమాంబ ఆ విధంగా తెలుగు, సంస్కృతం, మరాఠి, హిందీ, గుజరాతీ భాషలను నేర్చుకుంది. నాగపూరు హిందీ, మరాఠీల భాషలు మాట్లాడేవాళ్ళు వుండే ప్రదేశం. అక్కడ వుంటూ అచ్చమాంబ మంచి తెలుగు వ్రాయటం నేర్చుకొని తెలుగులోనే రచనలు చేసిందంటె మెచ్చుకొనవలసిన విషయమే. నాగపూరులో ఆమె స్త్రీలను తన ఇంట్లో చేరదీసి మరాఠీలో భక్తుల కథలను చెప్పేదిట. అట్లా చుట్టూ మరాఠీ హిందీ భాషల వాతావరణంలో ఆమె మాతృభాషాభిమానంతో తెలుగులో చక్కని వచనం వ్రాయటం నేర్చుకుంది.

అచ్చమాంబ భర్త మాధవరావు చాల సంప్రదాయాభిప్రాయాలు కలవాడు. చదువుకున్నట్లయితే స్త్రీలు చెడిపోతారని విశ్వసించేవాడు. అచ్చమాంబ చదువుకోవటాన్ని చూసి అభ్యంతరం వ్యక్తం చేసాడు. అచ్చమాంబ మృధుస్వభావం కలది. భర్తను నొప్పించటం ఇష్టంలేక ఆయన క్యాంపులకు పోయినప్పుడు గ్రంథాలు చదివేది. ఆయనతో పాటు ఆమె క్యాంపులకు పోయి అతినికి కావలసినయి తానే చూసుకునేది. ఆ విధంగా అచ్చమాంబ సహనం సద్గుణాలతో భర్తను మెప్పించ వలసి వచ్చేది. వీరేశలింగం పంతులు

సంఘసంస్కరణోద్యమంలో భాగంగా స్రీలకు విద్య అవసరమని స్త్రీ విజ్ఞానవంతురాలయితే కుటుంబం దేశం పురోగతి జరుగుతుందని చాలా మంది గుర్తించారు. కుటుంబంలో తండ్రులు సోదరులు స్త్రీలను చదువుకొమ్మని రచనలు చేయమని ప్రోత్సహించారు. అయినా అప్పటికీ కొందరు ఛాందస భావాలతో స్త్రీలు చదువుకుంటె చెడిపోతారని తప్పు తోవ పడ్తారని విశ్వసించి కఠినంగా ప్రవర్తించేవారు. స్త్రీలు చదువుకున్నా పురుషులతో మాట్లాడరాదని నలుగురి మధ్యనే పురుషులతో కలవాలని మాట్లాడాలని అనేవారు. స్త్రీలు గడపదాటి బయట అడుగు పెట్టటానికి చాలా ఆంక్షలుండేయి. అందుకే వీరేశలింగం కాలంలో స్త్రీలు విద్యావతులయి సతీధర్మాలను పతివ్రతల వృత్తాంతాలను చెప్పే ఇతి వృత్తాలనే తీసుకొని రచనలు చేసి తమ కట్టుబాట్లు నియమాల్లోనే వుండవలసి వచ్చింది. అటువంటి యుగంలో పుట్టిన అచ్చమాంబ "అటు ప్రాచీనమైన సతీధర్మములను ఇటు నవీనమైన పాశ్చాత్య విద్యా సంస్కారమును నీ రెండింటిని అత్యద్భుతముగా అనుపమానముగా ప్రదర్శించి ఆదర్శ మహిళ అయినది" అని ఆమె జీవిత చరిత్రమును వ్రాస్తూ పులుగుర్త లక్ష్మీనరసమాంబ అన్నది. అచ్చమాంబ వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమం చేత ప్రభావితురాలయింది. వీరేశలింగం వ్రాసిన స్త్రీలకుపయోగపడు రచనలను చదివింది. ఆమె భర్త ఛాందసుడయినా తన ప్రవర్తన చేత అతని మనస్సును కొంతవరకు మార్చ గలిగింది. ప్రతి యేడు నెలరోజులు సెలవు దినాల్లో భర్తతో ఆంధ్ర ప్రాంతానికి పోయినప్పుడు బందరులో ఆమె "బృందావనీ స్త్రీ

సమాజము" పేరుతో స్త్రీల సమాజాన్ని ఆరంభించింది. స్త్రీ సమాజ స్థాపన సమయంలో కొద్దిమంది స్త్రీలే వచ్చినా అటువంటి స్త్రీ సమాజం అవసరమెంతైనా వుందని తీర్మానించారు. తర్వాత అచ్చమాంబ కాకినాడలోనూ ఒక స్త్రీ సమాజాన్ని స్థాపించింది. ఆ విధంగా అచ్చమాంబ స్త్రీలల్లో చైతన్యం తీసుకు రావటానికి కృషి చేసింది. 1902లో కృష్ణా పత్రికనారంభించిన ముట్నూరి కృష్ణారావు, కొండా వెంకటప్పయ్యలు అచ్చమాంబ చేసిన కృషికి ప్రశంసించారు. అచ్చమాంబ తన సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావుతో కలిసి బొంబాయిలో జరిగే జాతీయ మహాసభలకు వెళ్ళేది. నాగపూరులోనూ భర్త క్యాంపులకు పోయినప్పుడు ఆ గ్రామాల్లోనూ అచ్చమాంబ సమాజసేవ చేసేది. స్త్రీలను పిల్లలను ఎన్నో విధాలుగా ఆదుకునేది. అట్లా సమాజసేవ చేస్తూనే ఆమె ఒక ప్లేగువ్యాధిగ్రస్తురాలయిన స్త్రీని ఆమె కన్న శిశువును సంరంక్షిస్తూ తాను ప్లేగుకు గురయి ముప్పయి సంవత్సరాల వయస్సులోనే మరణించింది. అంత చిన్న వయస్సులోనే ఆమె ఎంతో సమాజ సేవ చేసింది. "అబలా సచ్చరిత్ర రత్నమాల" (1901) అనే గ్రంథాన్ని ప్రసిద్ధ స్త్రీల చరిత్రలను కూరుస్తూ రచించింది. పది వరకు కథలు వ్రాసింది. ఆమె రచనలు, కథలు రాయసం వెంకటశివుడు నడిపే "తెలుగు జనానా", మొసలికంటి రామాబాయమ్మ నిర్వహిస్తున్న "హిందూ సుందరి" పత్రికల్లో ప్రచురింపబడినాయి. ఎక్కడో నాగపూరులో వుంటూ తెలుగులో వ్రాస్తూ స్త్రీజనాభ్యుదయాన్ని కోరుకున్న అభ్యుదయ శీలి అచ్చమాంబ. ఆమె కట్టుబొట్టులో దేశీయతను పాటించడమే కాక

ఆమె దేశీయాభిమానం కూడా చెప్పుకోదగింది. వీరేశలింగం పంతులు లేడీ జాన్‌గ్రే అనే ఆంగ్ల స్త్రీల చరిత్రను వచనంలో వ్రాయగా ఆయన శిష్యురాలు కొటికెలపూడి సీతమ్మ పద్యకావ్యంగా వ్రాసింది. దానికి అచ్చమాంబ స్పందించి మన దేశంలో ఎంతో మంది స్త్రీలున్నారు. వాళ్ళ చరిత్ర వ్రాయకుండా ఒక పాశ్చాత్య స్త్రీ చరిత్ర వ్రాయటం ఏమి బాగా లేదనీ నిర్మొహమాటంగా అన్నది.

అచ్చమాంబ 1898 నుంచి 1904 వరకు పన్నెండు కథలు రచించింది. ఆమె జనవరి 1905లో మరణించింది. ఆమె ఇంకా బతికి వుంటె మరిన్ని మంచి కథలు వ్రాసి వుండేదనిపిస్తుంది. ఇప్పుడు లభించిన సంగిశెట్టి సంపాదీకరించి ప్రచురించిన పది కథల్లో 'గుణవతియగు స్త్రీ' తెలుగు జనానా పత్రిక, 1901, మే సంచికలో అచ్చయింది. దశకుమార చరిత్రలో వున్న ఒక కథను తీసుకొని అచ్చమాంబ దీన్ని రచించింది. దీనిలో సంసారాన్ని ఎట్లా పొదుపుగా చేయవచ్చునో వర్ణింపబడింది. రెండో కథ 1901లోనే "తెలుగు జనానా" పత్రికలో ప్రచురింపబడింది. 'లలితా శారదలు' అనే ఈ కథలో ఈర్ష్య గర్వం దురభిమానం గల లలితలో శారద యెట్లా మార్పు తీసుక వచ్చిందన్న ఇతివృత్తం వుంది. మూడో కథ జానకమ్మ 1902లో తెలుగు జనానా పత్రికలో అచ్చయింది. ఈ కథలో రంగరాజు గోదావరి నదీ తీరంలో వున్న కాటవరం గ్రామ కరణం. ఐశ్వర్యవంతుడు కాదు. సంతృప్తితో జీవిస్తున్నాడు. రంగరాజుకు ఇద్దరు కొడుకుల తర్వాత జానకమ్మ పుట్టింది. కూతురే పుట్టాలని కోరుకున్నాడు రంగరాజు. ఆ

విధంగా పుట్టిన జానకమ్మ అంటె రంగరాజుకు చాల ప్రేమ. ఆడ పిల్లలను బడికి పంపటమంటె ఏమిటో తెలియని ఆ కాలంలో రంగరాజు కూతురును తన ఇద్దరు కొడుకులతో సమానంగా బడికి పంపించాడు. లోకుల అభిప్రాయాలను పట్టించుకోకుండ కూతురుకు చదువు చెప్పించాడు. జానకమ్మ కూడా బుద్ధిగా చదువుకుంది. రంగరాజు కూడా కూతురుకు నీతి కథలు చెప్పి నీతి పద్యాలను నేర్పుతూ సంతోషించేవాడు. లోకంలో మూర్ఖపు తలిదండ్రులవలె కొట్టక తిట్టక కోపగించుకోకుండ జానకమ్మను పెంచారు. జానకికి పెండ్లియీడు వచ్చింది. మంచి సంబంధం కావాలంటె కట్నం కానుకలు కావాలి. రంగరాజు ఇచ్చే స్థితిలో లేడు. రంగరాజు కూతురు పెండ్లి గురించి ఆరాట పడుతుండగా కట్నం లేకనే చేసుకుంటామని మంచి సంబంధం వస్తుంది. అంత మంచి కుటుంబం వాళ్ళు జానకమ్మను చేసుకుంటామని వాళ్ళే ముందుకు వచ్చినందుకు అందరూ సంతోషిస్తారు. జానకమ్మ పెండ్లి ఎంతో వైభవంగా జరుగుతుంది. రంగరాజు మనస్థిమితమౌతుంది.

అచ్చమాంబ ఈ కథలో స్త్రీ విద్య ఎంత అవసరమో చెప్పింది. చదువుకున్న గుణవంతురాలయిన జానకిని పెండ్లి చేసుకుంటామని వరుని కుటుంబమే ముందుకు వస్తుంది. అంటె విద్యావతి అయిన సుగుణవతి అయిన స్త్రీకి వివాహం ఒక సమస్య కాదని కట్నం కానుకలు లేకుండానే మంచి వరుడు లభిస్తాడని కోరి పెండ్లి చేసుకుంటాడని అచ్చమాంబ ఈ కథలో చెప్పి స్త్రీకి విద్య ఎంత అవసరమో తలిదండ్రులు కూతురును ఒక బరువు బాధ్యతగా కాకుండా పెంచాలన్న విషయాలను

ధ్వనింపజేసింది. ఒక "ముచ్చెట"లాగా కథ నడిచింది.

నాలుగో కథ 'దంపతుల ప్రథమ కలహం' 1902లో 'హిందూసుందరి'లో ప్రచురంపబడింది. కథ సంభాషణలతో నడిచింది. "నేను పెండ్లాడిన భార్యను గాని దాసిని గాను" అన్న లలిత మాటలతో కథ ప్రారంభమైంది. ఆమాటల్లోనే అచ్చమాంబ స్త్రీ గౌరవాన్ని ప్రకటించింది. స్త్రీకి భర్త మాటను గౌరవించే సహనముండాలని బోధించింది. లలిత అమ్మమ్మ పార్వతమ్మ భర్త మాట పట్టింపుతో ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోయి మళ్ళా తిరిగి రాలేదు. "అట్లా నీ జీవితం కాకూడదని" అమ్మమ్మ లలితకు చెప్తుంది. దాంతో లలిత భర్తను క్షమాపణ వేడుకుంటుంది. ఆ విధంగా వాళ్ళ ప్రథమ కలహమే అంత్య కలహమౌతుంది. ఈ కథలో స్త్రీ స్వేచ్ఛ స్వాతంత్ర్యం భర్త మాటను గౌరవించ లేనంతగా వుండ కూడదని భార్యా భర్తలు ఎదుటి వాళ్ళ స్వేచ్ఛను కూడా అర్థం చేసుకునేలా వుండాలన్న హితబోధ వుంది.

ఐదో కథ " సత్పాత్రదానము" కథ "హిందూ సుందరి" పత్రికలో 1902లో అచ్చయింది. ఈ కథ జరిగిన చోటు హైద్రాబాదుగా చెప్పబడింది. గుడ్డివాని పాత్రలో కొంత తెలంగాణ యాస కన్పిస్తుంది. గుడ్డివాని కొడుకులు పొలము కౌలుకు తీసుకొని పంట పండిస్తుంటారు. కౌలుకు తీసుకునే పద్ధతి నైజాంలోనే వుంది. కేశవుడనే బాలుడు గుడ్డివానికి పావలా దానం చేయాలని తల్లిని కోరుతాడు. తల్లి గుడ్డివానికి అన్నం పెట్టి వాని స్థితిగతులడిగి తెలుసుకుంటుంది. పూర్తిగా ఏమి లేని వానికి దానం చేయాలి గాని అపాత్ర దానం చేయకూడదని తల్లి

కొడుకుకు చెప్తుంది. "ఆ గుడ్డివాని పుత్రులిరువురు హైద్రాబాదు వంటి పట్నమునకరిగి కూలి పనిచేసినను వారు వారి కుటుంబములను రక్షించుకొనగలరు" అంటుంది. అట్లా స్వయంకృషి మీద ఆధార పడిన వాళ్ళకు దానం చేసినట్లయితే సోమరిపోతులవుతారని అచ్చమాంబ భావించినట్లు ఈ కథ వల్ల తెలుస్తుంది.

ఆరో కథ "స్త్రీ విద్య" 1902లో "హిందూ సుందరి" పత్రికలో అచ్చయింది. భార్యాభర్తల మధ్య జరిగే సంవాదరూపంలో వుంది ఈ కథ. భార్యగా, తల్లిగా స్త్రీకి విద్య ఎంత అవసరమో చెప్పబడింది. శాస్త్రాలల్లో స్త్రీలు చదువుకోకూడదని వున్నదన్న మాటను ఖండిస్తూ భర్త స్త్రీలు అజ్ఞానాంధకారంలో వున్నట్లయితే మూఢత్వంలో వుండి పోతారని అంటాడు. అట్లా స్త్రీలకు విద్య అవసరమన్న విషయాన్ని అచ్చమాంబ అనేక కోణాల నుంచి భార్యాభర్తల సంవాద రూపంగా సరసంగా చర్చించింది. ఈ కథలో సంఘటన లేదుగాని రెండు పాత్రల మధ్య సంభాషణ రూపంగా కథనం నడిచింది.

ఏడో కథ ప్రసిద్ధమైన "ధనత్రయోదశి" కథ. ఇది 1902లో హిందూసుందరిలో అచ్చయింది. కొంచెం పెద్దగా వున్న కథ. పాత్రలు సంఘటనలు సన్నివేశాలు సంభాషణల రూపంగా కథలో కథనం సాగింది. కథ జరిగిన చోటు బొంబాయి నగరం. ధనత్రయోదశి పండుగ ఉత్తర హిందుస్థానంలో ప్రచురంగా వుంది. నరక చతుర్దశి ముందు రోజు జరుపుకునే పండుగ. వెంకటరత్నముకు వెంకటసెట్టి అతని ముసలి గుమాస్తా పరీక్ష పెట్టారు. నూరు రూపాయల నోటు తీసి ముసలి గుమాస్తా

సెట్టికి ఎరుక లేకుండ తీసుకొమ్మని పండుగ ఖర్చులకు వస్తుందని జేబులో పెడ్తారు. కాని వెంకటరత్నము అంతరాత్మ కొంతసేపు తడబాటు పడ్డా అతని భార్య విజయలక్ష్మి మాత్రం ఆ నూరు రూపాయలు న్యాయంగా సంపాదించినయి కావు దొంగసొమ్ము నేనూ పిల్లలం తినలేము అని కోపగిస్తుంది. భార్య కోపం ఆవేదన చూసి వెంకటరత్నము నూరు రూపాయల నోటును ముసలి గుమాస్తా ముందు విసిరి వేస్తాడు. వేంకట సెట్టి అక్కడికి వచ్చి వేంకటరత్నమును పరీక్షలో నెగ్గావు అని మెచ్చుకొని జీతము పెంచుతాడు. విజయలక్ష్మిని తన కూతురుగా చూసుకుంటాడు. ఈ కథలో అత్యాశ లేని స్వయంకృషి మీద విశ్వాసం కలవారుగా వేంకటరత్నము, విజయలక్ష్మి పాత్రలు చిత్రింపబడినాయి. వాళ్ళు దారిద్ర్యంలో వున్నా ఉదాత్త గుణాలను విడువలేదని రచయిత్రి చిత్రించింది.

ఎనిమిదో కథ "భార్యా భర్తల సంవాదము" 1903లో 'హిందూసుందరి'లో అచ్చయింది. నగల కన్నా స్త్రీకి సద్గుణాలు అలంకారాలని స్త్రీలు మాయా నగల కోసం ఆరాట పడవద్దని రచయిత్రి ఈ కథలో చెప్పింది. ఈ కథలో స్త్రీవిద్యలో లాగానే భార్యాభర్తల సంవాదరూపంగా కథనం నడిచింది. ఆ కథలో లాగానే దీనిలో భార్యాభర్తల పాత్రల చిత్రణ బాగా జరిగింది.

తొమ్మిదో కథ "అద్దమును సత్యవతియును" చాలా చిన్నది. గల్పిక అనవచ్చును. 1903లో హిందూసుందరిలో అచ్చయింది. మూడేండ్ల సత్యవతి పాత్రను రచయిత్రి చాలా చలాకీ పిల్లగా చిత్రించింది.

కథనం సంభాషణలు ఈ కథలో సరసంగా వున్నాయి. ఈ జగత్తు అంతా అద్దమని దాన్ని సంతోషంగా చూస్తే సంతోషంగా కోపంగా చూస్తే కోపంగా ప్రతిబింబిస్తుందన్న జీవిత సత్యాన్ని అచ్చమాంబ చాల చిన్న సంఘటనను చిత్రించి బోధించింది. ఈ కథలోని సంఘటన అచ్చమాంబ జీవితంలో బాల్యంలో జరిగిన సంఘటనయేమోనన్నంత సజీవంగా చిత్రణ జరిగింది.

పదో కథ "బీద కుటుంబం". ఇది 1904లో 'సావిత్రి' పత్రికలో అచ్చయింది. కథ ఆరంభంలోనే రచయిత్రి ఇది నిజంగా జరిగిన వృత్తాంతం అని తన స్నేహితురాలు శ్యామలాంబ తను ఎరిగిన వృత్తాంతాన్ని తనకు చెప్పిందని పేర్కొన్నది. తన స్నేహితురాలు చెప్పిన సత్య సంఘటనలనే అచ్చమాంబ కథగా రచించిదేమో. ఆరుగురు పిల్లలతో ఒక వితంతువు వెంకమ్మ దారిద్ర్యంలో జీవిస్తుంటుంది. ధాన్య విసిరితే వచ్చే సంపాదనతో ఆమె గుట్టుగా సంసారం నడుపుతుంటుంది. పిల్లలు బుద్ధిమంతులై చక్కగా చదువుకుంటారు. బట్టలు పాతవైనా ముతకవైనా చక్కగా ఉతుక్కొని పరిశుభ్రంగా వుంటారు. దారిద్ర్యంలో కూడా దైన్యం లేకుండా ఎట్లా బతుకవచ్చునో అచ్చమాంబ చాలా బాగా చిత్రించింది. అపరిశుభ్రంగా వుంటె దారిద్ర్యం భయంకరంగా కన్పిస్తుంది. అదే పరిశుభ్రంగా వుంటె దారిద్ర్యం దారిద్ర్యంగా కన్పించదు. ఆ సత్యాన్ని అచ్చమాంబ గుర్తించి ఇక్కడ చెప్పటం బాగుంది. విద్యలో బుద్ధిలో మిన్న అయిన పిల్లలు ఉద్యోగంలో చేరుతారు. వెంకమ్మ కూతురు సౌశీల్యాన్ని చూసి "మాపిల్ల వానికి చేసుకున్నా"మని ఉత్తమ పురుషలో

చేప్పే కథకురాలు అంటుంది. స్వయంకృషితో సద్గుణాలతో దారిద్ర్యాన్ని ఎట్లా జయించవచ్చునో రచయిత్రి చాలా చక్కగా బోధించింది. కథనం ఉత్తమ పురుషలో చాలా బాగా నడిచింది.

అచ్చమాంబ కథలో గ్రాంథిక శైలిని ప్రయోగించింది. కాని ఎక్కడా దీర్ఘ సమాసాలు అర్థం కాని జటిల పద ప్రయోగాలు లేకుండా కథనంలో శైలి సరళంగా వుంది. సంభాషణలు సరళంగా కథల్లో అచ్చమాంబ వర్ణనలను చేయలేదు. ఒక్క "జానకమ్మ" కథలో మాత్రం గోదావరి ప్రాంతాన్ని సరళమైన పదాలతో రమ్యంగా కథలో ఇమిడిపోయే విధంగా ఆహ్లాదంగా వర్ణించింది. ఆ ఒక్క వర్ణన తప్ప ఆమె కథల్లో మరెక్కడా వర్ణనలు లేవు. పాత్రలు, సంభాషణలు, సన్నివేశాలు ఆధునిక కథలో వుండవలసిన విధంగానే వున్నాయి. స్త్రీకి విద్య అవసరమనో సద్గుణాలు అవసరమనో దారిద్ర్యాన్ని స్వయంకృషితో జయించాలి కాని అన్యాయం దైన్యంతో కాదనో ఏదో ఒక చక్కని విషయాన్ని బోధిస్తూ, ధ్వనింపజేస్తూ కథలు నడిచాయి. అచ్చమాంబ చెప్పిన నీతి బోధలన్నీ వ్యక్తిత్వ నిర్మాణానికి, జీవిత నిర్వహణకు పనికి వచ్చే విషయాలుగానే ఆధునిక కాలానికి కూడా పనికి వచ్చే విధంగానే వున్నాయి. అచ్చమాంబ భావాల్లో ఎక్కడా కాలదోషం లేదు. ఇప్పటికీ జీవితాన్ని జీవిత సత్యాలను బోధించేయిగా వున్నాయి. కాబట్టి ఆమె కథలు సార్వకాలికతతో ఇప్పటికీ చదువదగినయిగానే వున్నాయి. కానీ ఎక్కడా            అని అనిపించవు. శైలి గ్రాంథికంలో వుంది (అదీ సరళ గ్రాంథికమే) కాబట్టి యువతకు చదివేందుకు కష్టము కావచ్చును. అట్లా అయితే వ్యావహారికమనబడే

“కన్యాశుల్కము”లోని శైలి భాష కూడా ఇప్పుడు అందరికీ అర్థమయ్యేటట్లుగా వున్నదని చెప్పలేము. తర్వాత కాలంలో 1930 దశకంలో విశ్వనాథ వంటి వాళ్ళు కథల్లో గ్రాంథిక భాషనే ప్రయోగించారు. అయినా వాళ్ళను కథారచయితలుగానే పరిగణిస్తూనే వున్నాము. ఆ విధంగా చూస్తే అచ్చమాంబ కథలు ఆధునిక ప్రక్రియకు చెందిన కథలుగానే కన్పిస్తాయి. గురజాడకు పూర్వమే ప్రయోజనం గల సామాజిక ఇతివృత్తంతో వున్న అన్ని కాలాలకు అవసరమయ్యే సందేశాలను అందించే అచ్చమాంబ కథలు తెలుగులో “తొలి కథలు”! తెలుగులో 1898–1904 కాలంలో గురజాడకు పూర్వమే సంఘ సంస్కరణ భావాలతో రచించిన అచ్చమాంబయే తొలి కథకురాలని చెప్పాలి. కొందరు ‘ధనత్రయోదశి’ (1902) ‘స్త్రీవిద్య’ (1902) తెలుగులో ఆమె వ్రాసిన మొదటి కథలుగా పేర్కొన్నారు. కాని దొరికిన కథల్లో 1901లో ఆమె రచించిన ‘గుణవతియగు స్త్రీ’ తెలగులో మొదటి కథ అని గుర్తించాలి.

కొందరు 1903, 1904లో ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ రచించిన ‘కల్పలత’ పత్రికలో అచ్చయిన “లలిత”, “విశాఖ”, “అపూర్వోపన్యాసము” కథలు తెలుగులో మొదటి కథలుగా గుర్తింపబడాలని అన్నారు. కాని ఈ కథలు కఠినమైన గ్రాంథిక శైలిలో వుండటమే కాక ఆధునిక కథకు చెప్పబడని ప్రబంధరీతిలో నడిచిన వర్ణనలతో వున్నాయి. తర్వాత ఈ కథల్లో ఎటువంటి సద్బోధనలు లేవు. సంఘసంస్కరణ భావాలు లేవు. పైగా ఒక కథలో కావలి సేనలతో

నిండిన చంద్రవర్మ నాయకుడు కాగా మరో కథలో నాయకుడు కళానిధి ఇద్దరు స్త్రీలను వివాహమాడినట్లుగా చిత్రింపబడినది. "అత్తయ్యా! లలితకనురాగ విద్యనుపదేశించి వ్రాత సదువులు నేర్పి పుస్తకమును పట్టించితిని..." అనే చందవ్రర్మ మాటలు "మనోహరా! మీరూరికి పోయి వేగముగా మరలి వచ్చి యనురాగ విద్యా రహస్యములను సొంతముగా నేర్పుడు" అని లలిత వంటి ముగ్ధరాలు అనే మాటలు మింగుడు పడకుండా వున్నాయి. అశ్లీలంగా అనిపించే సంభాషణలు "లలిత" కథలో కన్పిస్తాయి. అదే విధంగా ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ వ్రాసిన "అపూర్వోపన్యాసము" (1903) తెలుగులో మొదటి కథగా చెప్పబడింది. దానిలోనూ ఎటువంటి సందేశం గాని సంఘసంస్కరణ భావాలు గాని లేవు. "కొంచెం మదన కామేశ్వర లేహ్యమును సేవించుమని చెప్పెను" వంటి చవకబారు సంభాషణలు ఆ కథలో ఉన్నాయి. అంతేగాక విధవా వివాహం వంటి సంఘసంస్కరణ విషయాన్ని రచయిత హేళణ చేసినట్లుగా వుంది కథ. ఏ నీతిగాని సంఘసంస్కార దృష్టిగాని సామాజిక ప్రయోజనంగాని లేని ఈ మూడు కథలు ఆధునిక కథ అనటానికి ఏ ఒక్క లక్షణం కన్పించటం లేదు. ఆ కథల కన్న భండారు అచ్చమాంబ 1901-1904 సంవత్సరాల్లో రచించిన కథలు మంచి సందేశంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసేయిగా సంఘసంస్కరణ భావాలను చిత్రిస్తూ గొప్పగా వున్నాయి. కాబట్టి అచ్చమాంబ కథలనే తెలుగులో "తొలి కథలు"గా చెప్పటం అన్ని విధాల సమర్ధనీయంగా వున్నది.

భండారు అచ్చమాంబ తండ్రి మునగాల సంస్థానంలో దీవానుగా పనిచేసాడు. అచ్చమాంబ, కొమర్రాజు లక్ష్మణరావు అక్కడే పుట్టారు. మునగాల సంస్థానం నైజాంకు సరిహద్దుల్లోనే వుంది. ఒకప్పుడాప్రాంతం నైజాంలోనే వుండేది. తర్వాత దాన్ని నిజాం ప్రభువు బ్రిటీషు వాళ్ళకిచ్చి వేసారు. అది బ్రిటిషు పాలనలో వున్నా ఆ సంస్థానంలో చేరిన నలభై గ్రామాలు నైజాం రాజ్యంలోనే వుండేయి. కాబట్టి మునగాలకు నైజాంతో సంబంధముండేది. అచ్చమాంబ, లక్ష్మణరావులు తండ్రి మరణానంతరం కొన్నేండ్లు దేవరకొండలో తర్వాత మేనమామ దగ్గర నాగపూరులో వున్నారు. వాళ్ళ విద్యాభ్యాసం అక్కడే జరిగింది. ఇటు వీరేశలింగం సంఘసంస్కరణోద్యమం అటు మహారాష్ట్రలోని జనజాగరణ్ దేశీయతా భావజాలం చేత అచ్చమాంబ ప్రభావితురాలయింది. ప్రతిభ కలది కాబట్టి తన భావాలను రచనల రూపంలో పెట్టింది. లక్ష్మణరావు మునగాల సంస్థానంలో దీవానుగా చేరాడు. అప్పుడు అతని కార్యక్షేత్రం హైద్రాబాదు నగరం, తెలంగాణయే. ఆంధ్రదేశ చరిత్ర వ్రాయాలంటె తెలంగాణ గని వంటిదని కొమర్రాజు అభిప్రాయ పడినారు. నైజాంలో ఆరోజుల్లో (20వ శతాబ్దం ఆరంభంలో) ఎటువంటి రాజకీయ పరమైన పనులకు అవకాశం అనుమతి లేదు. కాబట్టి పరభాష పరాయి సంస్కృతిలో కూరుకు పోయిన తెలంగాణలో విజ్ఞాన వ్యాప్తి మూలంగానే చైతన్యం తీసుకరావచ్చునని విశ్వసించిన లక్ష్మణరావు గ్రంథాలయోద్యమానికి పూనుకున్నారు. “శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము”ను (1901) స్థాపించినారు. ఆ తర్వాత ప్రతి జిల్లా

తాలూకాల్లో గ్రంథాలయాలు వెలిసాయి. తెలుగు భాష విజ్ఞానం ప్రజల దగ్గరకి చేర్చాలనే లక్ష్యంతో లక్ష్మణరావు "విజ్ఞాన చంద్రికా గ్రంథమాల" పేరుతో పుస్తక ప్రచురణలను ప్రారంభించాడు. ఆ విధంగా కొమర్రాజు లక్ష్మణరావు కార్యక్షేత్రం తెలంగాణ అయింది. నేను సంగిశెట్టి శ్రీనివాస్ తెలంగాణ తొలితరం కథలు రెండోభాగం "తొలినాటి కథలు" ప్రచురిస్తూ కొమర్రాజు లక్ష్మణరావు వ్రాసిన "యేబదివేల బేరము" (1910) కథను ఆయనను తెలంగాణ రచయితగానే భావించి ప్రచురించినాము. అచ్చమాంబ మీద కూడా తెలంగాణా ప్రభావం కన్పిస్తున్నది. ఆమె 'సత్పాత్రదానము' కథ హైద్రాబాదు నగరంలో జరిగినట్లుగా వర్ణించింది. గుడ్డివాని పాత్రలో తెలంగాణ యాసను ప్రయోగించింది. అచ్చమాంబ కథల్లో అక్కడక్కడ తెలంగాణ పదాల ప్రయోగం కన్పిస్తున్నది. అక్కడ అనటానికి ఆమె "ఆడ" (పేజి 57), అని 'సత్పాత్రదానము' కథలో ప్రయోగించింది. ఈ కథలోనే "కొలు" అనే పద ప్రయోగముంది. 'కడుపు నింపుకొనెదరు' అనటానికి "పొట్ట నింపుకొనదరు" అని ఆమె వాడింది. (పేజి 57), "పొట్ట" అనటం తెలంగాణ పదమే. 'దంపతుల ప్రధమ కలహము' కథలో 'పూర్వము నీవంటి యొక కచ్చెపిల్ల యుండెను" (పేజి 52) అన్న వాక్యంలో "కచ్చె" అన్నది తెలంగాణ పదమే. 'కచ్చె' అంటి "మొండి" అని అర్థం. అదే విధంగా "మీ యబ్బ సొమ్మా" (పేజి 40) అన్నది తెలంగాణ ప్రయోగమే. ఇంకా "ఈ తేప" (పేజి 81) "ఉత్త తెల్ల చీర" (పేజి 81) లోని "తేప, ఉత్త" పదాలు అచ్చమైన తెలంగాణలో వాడే పదాలే. 'మంచిది' అని వాడటం కూడా తెలంగాణ

భాషలోనే కన్పిస్తుంది. అచ్చమాంబ " మంచిది కాని నేను పంపిన పుస్తకములు నీకు ముట్టినయి గదా!" (పేజి 81) అని "మంచిది మొట్టమొదట నీవు వెక్కిరించి.." అని "మంచిది" అనే పదాన్ని ప్రయోగించింది. అదే విధంగా 'ఒకసారి' అనటానికి ఆమె "ఒక పారి" (పేజి 76) అని వాడింది. "పారి" పదం తెలంగాణలో వ్యాప్తిలో వున్న పదం. ఉర్దూ హిందీలో "బార్, బారీ" నుంచి "పారి" అనే పదం వచ్చింది. తర్వాత అచ్చమాంబ "వెళ్ళుట" అనే పదానికి బదులుగా అన్ని చోట్ల "పోవుట" అని తెలంగాణలో వున్న పదాన్నే ప్రయోగించింది. "పోయెను, పోవుచుండెను, దగ్గరికి పోయి, అచటికి పోయిన పిమ్మట, పనికి పోవుచుండెను, పోవుచుండగా" అని అంతటా ఆమె "వెళ్ళుట" ప్రయోగించకుండా "పోవుట"నే ప్రయోగించింది. అచ్చమాంబ బాల్యంలో తెలంగాణలో నివసించి అక్షరాభ్యాసమారంభించింది. కాబట్టి తెలంగాణ తీర్చి దిద్దిన అడబడుచుగా ఆమెను చెప్పుకోవచ్చును. తెలంగాణలో పుట్టి నాగపూరులో వికసించిన పుష్పం భండారు అచ్చమాంబ. కాబట్టి అచ్చమాంబ కథలు తెలంగాణ ఆడబడుచు వ్రాసిన కథలు! తెలంగాణ అందించిన తెలుగులో "తొలి కథలు" అని చెప్పవచ్చును.

రోహణమ్ ముదిగంటి సుజాతారెడ్డి

20-12-2008

## కథా క్రమం


| | |
|---|---|
| గుణవతియగు స్త్రీ | 36 |
| లలితాశారదలు | 39 |
| జానకమ్మ | 44 |
| దంపతుల ప్రథమకలహం | 49 |
| సత్పాత్రదానము | 56 |
| స్త్రీవిద్య | 61 |
| ధనత్రయోదశి | 68 |
| భార్యభర్తల సంవాదం | 81 |
| అద్దమును సత్యవతియును | 85 |
| బీదకుటుంబము | 89 |

# గుణవతియగు స్త్రీ

భర్త ధనవంతుడైనచో, సంసారమును జక్కఁగా నడుపుట యంత వింతకాదు. కాని యతడు దరిద్రుడైనచో, నిత్యము నతనిని బాధింపక యింటఁగలదానితో నెటులనో గడపి భర్తనానందింప జేయుట మిగుల దుస్తరము. ఇట్లు సంసారము పొదుపుగాఁజేయ నేర్చిన పతియే గుణవతి యనంబరగు. ఈ సంగతిని బోధించు దశకుమార చరితమునందలి యొక కథ నీక్రింద వ్రాసెదను.

పూర్వ కాలమున ద్రవిడ దేశమునందలి కాంచీ నగరములోఁ గోటీశ్వరుడగు నొక వర్తకునకు, శక్తి కుమారుడను గుమారుడుండెను. విద్యాసంపన్నుడగు నా బాలుడు పదునెనిమిది సంవత్సరముల వాడైన పిదప నతనికి సంసారము పొదుపుగా జేయగల కన్యకను వివాహ మాడవలయునని యిచ్చ గలిగెను. అతడు ధనికుడయినందుననేకులు తమ పిల్లల నతనికీయ నెంచిరి. కాని యా పిల్లలలో నెవర్వరి యందును బూర్ణమైన సుగుణ సంపదయు సంస్కారమునందలి నేర్పును నాతనికిఁ గనుపించనందువలన నతఁడట్టి భార్యను వెదుకుటకై జ్యోతిష్కుని వేషము వేసుకొని, తవ్వెడు వడ్లను చెంగునఁగట్టుకొని, సకల దేశములును దిరుగుచుండెను. సాముద్రిక శాస్త్రజ్ఞుఁడయినందున నతడే గ్రామమునకు బోయినను జనులాతని యొద్దికి దమతమ బిడ్డలను దెచ్చిచూపి, వారి గ్రహపాటుల నడిగి తెలిసికొనుచుండిరి. వారిలో సులక్షణ వతియగు తమ జాతి కన్యక యగుపడినచో, శక్తికుమారుడా పిల్లతో "ఇతర పదార్థము లేవియు నడుగక నీవీ తవ్వెడు వడ్ల బియ్యముతోఁజక్కఁగా నన్నము వండి నాకు వడ్డించగలవా?" యని యడుగు చుండెను. అందుకు గొందఱు బాలికలు నవ్వుచు, మఱికొందరాతనిని నిందింపుచు, నీ వడ్లతో నెట్లు చక్కని యన్నము వండుదురని యనుచు నరుగు చుండిరి. ఇట్లరుగుచుండ నతడు కావేరికి దక్షిణ తీరమునందున్న శిబి దేశమునకుఁ బోయెను. అచట నొక గ్రామమునందీ వణిజునకు నొక దాది సులక్షణ సంపన్నయగు బాలికను జూపెను. ఆ పిల్ల యొక్క తల్లి దండ్రులిరువురు దాని చిన్న తనముననే చనిపోయిరి. అది మిగుల ధనవంతురాలుగాదు. అతడా చిన్నదాని నుపలక్షించి తన మనస్సులో " ఈపిల్ల సౌందర్యము, అవయవ పటుత్వము,

హస్తపాదాదికముల యందలి రేఖలును, శుభలక్షణములచే యొఱుక వఱచుచున్నవి. దీనియునికి జూచిన నిది మిగుల సద్గుణవతియు, జాతుర్యవతియూనని తోఁచుచున్నది. దీని ముఖమర్ధ చంద్రునిఁబోలి యెంతో మనోహరముగా నున్నది. ఇదియే నాకు తగిన యిల్లాలని తోచుచున్నది. కాన దీని బరీక్షించి వివాహమయ్యెదనని "నిశ్చయించి యా బాలికతో " నాకీ తవ్వెడు వడ్లతో బాగుగా వంట జేసి పెట్టగలవా?" యని యడిగెను. అందుపై నా పిల్ల సాభిప్రాయంబుగా దన దాది మొగంబు చూచి , దాని సమ్మతిని బొంది, యాతని చేతి వడ్లమూట నందికొని, యతనికిఁబాద ప్రక్షాళనంబునకు జలంబొసంగి, యలికి ముగ్గిడిన పాకలో నతడు విశ్రమించుటకు నొక చాపను బరచెను. అంతనాకుమారిక యా వడ్లను జక్కగా జెరగి, యేరి, వానిని స్వచ్ఛమగు నేలపై బోసి చేతితో రాచి ఊకలేనిదే బియ్యము చేసెను. ఆ చాతుర్యవతి యవి చెరగగా వచ్చిన యూకను బోగుచేసి, దానిని దన యువమాతకిచ్చి " యమ్మా, దీనిని గొనిపోయి కంసాలి వానికి విక్రయింపుము. ఇది కంసాలి వారికెంతో యుపయోగకరము. దీని నమ్మగా వచ్చిన వెలతో గట్టివగు నెండుకట్టె రెండు మూడును, నొక యన్నపు చట్టియు, రెండు మూకుళ్ళను దెమ్ము" అని చెప్పి యవి తెప్పించిన పిదప నాచే బియ్యము నొక మిట్టరోటబోసి, మెల్లగా దంచి చెరగి తవుడును వేరు చేసెను. తదుపరి యామె, యా ధౌత తుండులములను నాలుగైదు పర్యాయములు నీళ్లతో గడిగి, సలసల మసులు నెసరులో నా బియ్యమును బోసి సగముడుకగానే గంజి వార్చిఇ యన్నపు చట్టిని సన్నపుసెగపై నుంచి, యొకగడియయైన పిదప నొక మెతుకును ముట్టి చూచి యన్నము బాగుగా నుడికినందున, దానిని దింపెను. తదనంతరమామె, కట్టెలను జల్లార్చి, యా బొగ్గులను బియ్యపు తవుడును నమ్మించి దానికి వచ్చెన వెలతో పెరుగు కూర చింతపడండు, పచ్చిమిరపకాయలు, ఉప్పును తెప్పించి వానితో నొక కూరయు రెండు పచ్చళ్ళను జేసి, వార్చిన గంజిని పొడి యిసుకపై బరచిన బట్టలో బోసి చల్లార్చి యా గంజినొక మూకుట నుంచి దానిలో గొంచెము పులుసు, కారము, ఉప్పును గలిపెను. ఇవన్నియు సిద్ధమయిన తోడనే, యా బాలయా మార్గస్థునికి స్నానము చేయుడని చెప్పెను. వెంటనే యతడు స్నానము చేసి మడికట్టుకొని, తనకొఱకు వేసిన పీటపై గూర్చుండెను. అప్పుడాచిన్నది పండబారిన యరటి యాకును నతని ముందర నుంచి ః, దాని పైనా రెండు మూకుళ్ల నుంచి, యొక మూకుట దాఁజేసి యుంచిన గంజినిఁబోసెను. దానిఁద్రావి యతడు కొంత చల్లబడిన పిదప నామె యాకుపైన బచ్చళ్లు కూరయు, నామూకుటనన్నమును,

వడ్డించెను. అతడా యన్నము నెంతో రుచిగా దినన పిదప, నామె మరల యన్నము వడ్డించి యాయన్నముపై పెరుగును బోయఁగా నతడా యన్నము తిని తృప్తి జెందెను. అనంతరమా లేమ, పుష్పముల వలన సువాసన జెందిన నీరు నాతనికి ద్రాగుట కొసంగెను. అతడు చెయిగడుగుకొని వచ్చునంతలో నామె దాదికిఁజెప్పి యాతని యెంగిలి విస్తరి నెత్తించి యచట నలికించి యతనికొఱకొక పక్క వేయించెను.

ఇట్లు పరీక్షించి యా పిల్ల యొక్క సంసార కృత్యనిర్వాహక చాతుర్యమునకు నుల్లసిల్లి, యా వణిజుండు, దానిని వివాహమాడెను. వివాహానంతర మతడామెను దన నదగరమునకు గొనిపోయి యా సద్గుణవతి నింకను బరీక్షింప నెంచి యామెతోఁ దానెప్పుడును సంతోషముగా నుండక, సదా క్రూరత్వమే వహింపుచుండెను. ఇంతియ కాక, యా వర్తకుడు నింటియందే యొక వేశ్యను సహితముంచెను. కాని యా కాంత యెంత మాత్రము పతియందసూయపడక, యతనిని దైవతుల్యునిగా భావించి పూజింపుచు నా వేశ్యనుదోఁబుట్టువుగా నెంచి దానితోఁగలసి మెలసి యుండిన నేర్పు వలన సంసారము నెంతో గుట్టుగా జేయుచుండెను. ఆమె కరుణామయత్వమువలన నింటి సేవకులామె యాజ్ఞ నెంత మాత్రము నుల్లంఘింపక శిరసావహింపు చుండిరి. దీని నంతను గనియామె పతి మిగుల ప్రసన్నుడై సంసారభారమునంతను దన సతిపై నుంచి ధర్మార్థ కామములను సంపూర్ణముగా ననుభవించెను.

# లలితా శారదలు

(బాలికలకొఱ కొక కథ)

మొదటి ప్రకరణము

అన్ని కాలములలోను బాలికలకు ప్రాతఃకాల మధికోల్లాసముగా నుండును. దినమంతయు నాటలతోను, పనిచేతను, పాఠశాల కరిగి విద్యాభ్యాసము చేయుట వలనను వారు చాల నలసి యుందురు. అందుపై వారికి రాత్రి నిద్రవలన సంపూర్ణ విశ్రాంతి కలిగి తెల్లవారునంతకు వారి శరీరములును, మనస్సులును గ్రొత్తలయి వారి నాటలకు నత్యుత్సాహముతోఁబురి కొల్పుచుండును. ఇట్టి యానందకరమగు నొక ప్రాతఃకాలమునందొక గ్రామమునందలి యుద్యానమునందు పెక్కండ్రు బాలికలు వినోదకరముగా నాటలాడు చుండిరి. వారిలో గొందఱు పువ్వులు కోయుచుఁ గొందఱాపువ్వుల నేఱుచు గొందఱింక ననేక విధములు గ్రీడింపుచుండిరి. ఉద్యానమునందలి వృక్షములు తీగెలు మొదలైన వన్నియు సుందరములయిన నూతన వికసిత పుష్పములచే నలంకరింపబడి తమ్ముదాకి పోవు వాయువునకు శీతమును సువాసనను గలుగఁజేయుచుండెను. అచటి భూమిపైని సూర్యకరిణములు పడగా నొకవిధమైన తళుకుఁ గలిగింప నచట నాడు బాలికలు వానిఁజూచి సంతసించి యవి పచ్చలనియు, ముత్యములనియు, నొకరితో నొక రనుకొనుచు క్రీడించుచుండిరి.

అప్పుడొక పొగడ చెట్టు క్రింద రుక్మిణీ సీతలను నిరువురు బాలికలుల్లాసముగా పొగడపూవలు నేఱుచుండిరి. అప్పుడా పొగడచెట్టు వారిపై ననుగ్రహించినటుల పుష్పవర్షము కురియుచుండెను.! ఆ ముగ్ధ లిరువురును బంతములు వేసికొని యొకరికంటె నొకరు పూవు లధికముగా నేఱుచు నడుమ నడుమ నొకరియొడి నొకరు చూచుచు, నొక పువ్వేరగా మఱియొక పువ్వు కాలిక్రిందపడి నలిగిపోవ పరికిణి బాగుగా దోపఁజాలనందున నొడినుండి పువ్వులు రాలునది కానక వారత్యానందముతో ముచ్చట లాడుచు బువ్వు లేఱుచుండిరి! అప్పుడు రుక్మిణి కొంచెము తలయెత్తి చూడగా, దూరమునుండి వచ్చుచున్న లలిత దాని కగపడెను. అంత నది భయముచే వడకుచు ‘ వో సీతా! లలిత వచ్చుచున్నది. కాన మనము పాఱిపోదము.

నా గుండె లదురుచున్నవి' అని పలికెను. ఈ మాటలు విని సీత తలయెత్తి చూచునప్పటికి, లలిత పరుగెత్తి వారిని సమీపించెను. అప్పుడా బాలిక లిరువురు భయముచే బారిపోవుటకైనను దోచక యొడిలోని పూవులు పడిపోవ నూరక నలిచి యుండిరి.

లలిత ఆ యూరి తహసీల్దారుని కూతురు. అధికారి పుత్రిక యగుటవలన లలిత నెవ్వరును నాజ్ఞాపింప జాలకుండిరి. ఇంటియందన్నో ధనవంతులుగాన తల్లిదండ్రులామె నతిగారాబముగాఁ బెంచుచు, నామె యితరుల కెన్ని యుపద్రవములు చేసినను గోపపడక, "పెద్దదయినచో నిట్లు చేయ వీలు లేదు గదా! చిన్నతనపు చేష్టలను మనమేల మాన్పవలె" నని యూరకుండిరి. అందువలన లలిత గర్విష్ఠియై, తానితరుల పిల్లల నేమి చేసినను తనను శాసించువారు లేరుగదా యని యూరి బాలికల నందఱిని నిష్కారణముగాఁ గొట్టుచు బాధ పెట్టుచు నుండెను. అందువలన నామె యనిన నొకపులి యని పిల్లలందఱు మిక్కిలి భయపడుచుండిరి.

వచ్చిన వెంటనే లలిత సీతయొక్క చేతులను గట్టిగాఁబట్టుకొని దానిని నాలుగు దెబ్బలు వేసెను. ఆమె రుక్మినిని సీతను విశేషముగా దిట్టి " ఈ వఱ కెన్నిసారులో మీరీ చెట్టుపూవుల నేఱవలదని నేను నివారించితిని, అయినను మీరు నామాట వినక పూవుల నేఱుచున్నారు. ఇది మీ యబ్బ సొమ్మా? మరల మిమ్ము నీ చెట్టు క్రింద చూచినచోఁ బ్రాణముతో బోవిడువను" అని కోపముతో పలికెను. ఆ సమయమున లలిత రుక్మిణిని సహితము నాలుగు దెబ్బలు కొట్టెను. ఆ పిల్లలంతలోఁ దప్పించుకొని పారిపోయిరి. నలుదిక్కులను నెగజల్లి యితర బాలికలకడ కేగెను. ఒక చోట గొందఱు బాలికలు బొమ్మలాట లాడుచుండగా లలిత వారికడకేగి, వారితో 'నన్నాడ నిచ్చెదరా?" యని యడిగెను. వారు లలిత స్వభావము నెఱిగినవారు కాన నేమియు ననక యాట చాలించి యొకరి ముఖమొకరు చూచుచుండిరి. అందువలన లలిత మిక్కిలి కోపముతో "నన్నాడనీయరా?" యని వారి బొమ్మలను బలవంతముగా లాగుకొని, వానిని బగులఁగొట్టి పారవేసెను! ఆ తోటలో నొక గులాబి చెట్టుకడ శారదయను పదునాల్గు సంవత్సరముల బాలిక నిలిచి యుండెను. ఈమె తను నితరులు బాధించినను, దుర్భాషలాడినను వారిపైఁ గోపింపక కనికరించి సమయము తటస్థించినప్పుడు వారికి సద్బోధ యొనర్చి, వారిని మంచి మార్గమునకు ఁద్రిప్పుచుండును. శారద యా సమయమునఁ జేత నొక గులాబి మొగ్గను బట్టుకొని, దాని సౌందర్యమును నచ్చెరువొందుచు, నామొగ్గనుద్దేశించి "నీ సౌందర్యమెంత

మనోహరము! నీ కీ సౌందర్యముతోఁ గూడ ముండ్లు కలుగుటకు నీవేమి పాపము చేసితివి?" అని దానినే చూచుచుండెను. అప్పుడామె వైపున వచ్చుచున్న లలిత, యామె చేతనున్న మొగ్గను దూరమునుండి చూచి కోపముచేఁ గన్ను లెఱ్ఱ చేసెను. ఆ తోట లోకులది యైనను, లలిత కది తనదే యనితోఁచి, దాని యందలి పుష్పములుగాని పల్లవములను గాని యెవ్వరైనను నంటినచో నామె వారిమీద మిక్కిలి కోపపడుచుండును. ఆమె గులాబి మొగ్గపై నేక చిత్తముగా నున్న శారదను సమీపించి, రెండు చేతులతో శారద వీపును బాదెను. అంతతో నూరకుండక, యా దుష్ట బాలిక, మరల శారదను గొట్టుటకై రెండు చేతు లెత్తెను. కాని దైవానుగ్రహము వలన నామె చేతులు శారదపై బడక, యచట నున్న గులాబి చెట్టు మీద బడెను. అందువలన నామె చేతుల నిండను ముళ్ళు గ్రుచ్చికొని రక్తము గార జొచ్చెను. అప్పుడా వేదనకు దాళ జాలక, లలిత పెద్దగా నేడువసాగెను.

లలిత రోదన ధ్వని విని పిల్లలందరఅచటికిఁ బరుగెత్తి వచ్చిరి. ఆమె కైన శిక్ష, యామెకు దగినదియే యనియు, నట్లగుటయే యుత్తమ మనియు గొందఱు బాలికలు మనస్సులయందు సంతసించిరి. కాని వారెవ్వరునూ దమ సంతోషమును వెలిపుచ్చరైరి. లలితకుఁ దటస్థమైన విపత్తునకు శారద జాలిపడి, సమీపమున నున్న నీళ్ళ గుండముకడ కామెను దీసికొనిపోయి, తన ఛెఱుగుఁ దడిపి, యా చేతి రక్తమును గడిగి, యాతడి చెఱుగు నామె వేదన తగ్గుట కామ చేతిపయి నుంచి, మంచి మాటలతో నామె దుఃఖమును దగ్గింపుచుండెను.

అప్పుడు లలితకు దాను శారదకు జేయ దలచిన యపకారమును వెంటనే శారదకుఁ జేయ ఁదలచిన యపకారమును, వెంటనే శారద తనకు జేసిన యుపకారమును, దలంపునకు వచ్చి మిగుల పశ్చాత్తాపమును, సిగ్గును గలిగెను. అంత నామె మిగుల కృతజ్ఞతా పూర్వక మగు బుద్ధితో "శారదా! నీ యుపకారబుద్ధిని, క్షమానుశీలతను నెట్లు గొనియాడను? నీవు చేసిన యీ యుపకారమునే నెన్నటికిని మఱవను. నీవు నేడు నాకు దగిన యుపదేశము జేసితివి. నీవు చెప్పినటుల నేటి నుండియు నడచెదను" అని చెప్పి లలిత నాటి నుండియు శారదకుఁ బ్రాణ సఖియై యామె యుపదేశము వలన ననేక సద్గుణములను నేర్చి, యూరి వారికిని, తోడి బాలికలకును నత్యంత ప్రేమాస్పదమయ్యెను. తదనంతరము లలిత, దయాశాంతాది గుణములవలన మిక్కిలి ప్రఖ్యాతి గాంచి పరోపకారమునకై యనేక కష్టములు వచ్చినను ఆనందముతో సహించు చుండెను.

రెండవ ప్రకరణము

ఈ సంగతి జరిగి బహు సంవత్సరములు గడచెను. లలితకు వివాహమై యామె యత్తింటికరిగి యచట గొన్ని సంవత్సరములుండి యొక కొడుకును, గూతును గని మరల పుట్టినింటికి వచ్చెను. లలిత రాక విని యూరియందలి యామె స్నేహితురాండ్రందఱునాఁ డామెను జూచుటకు వచ్చిరి. కాని శారద రాలేదు. ఆమె భర్తృ గృహమునందున్నదని వనిఇ లలిత యామెను జూడకుండుట కెంతయు విచారపడెను.

మఱునాడుదయమున లలిత, తాను బాల్యమునందాడు చుండిన యుద్యాన వనమునకు నొంటరిగా బోయెను. అప్పుడామెకు పొగడ చెట్టు, బొమ్మలాట స్థలము, మొదలైనవన్నియు నగుపడగా, దాను బాల్యమునందు చేసిన దుగుకు చేష్టలన్నియు నామెకు గున్నలుఁ గట్టినట్టయ్యెను. అది యంతయు జూచుచు జిన్నతనపు మాటలను జ్ఞప్తికిం దెచ్చుకొనుచు, నామె గుండము సమీపముననున్న గులాబి చెట్టును సమీపించెను. అచటికిఁ బోయిన వెంటనే, యామె శారద నాడు తనకుఁ జేసిన యుపదేశమును, నాటి నుండియు దాను దుర్గుణములను వదలుట మొదలైన సంగతులను దలచికొని, శారదను జూడకయే తా నత్తవారి యింటికి బోవలయునేమో యని యనుకొని మిగుల చింతించి శారద సద్గుణముల నెన్నుచుండెను. ఇంతలో నాకస్మికముగా నెవరో వచ్చి, "సఖీ క్షేమమార్షు" యని లలిత భుజముపై c జేయి వేసిరి. లలిత తిరిగి చూచునప్పటికి, శారద యామె కన్నులపండువుగా నగు మొగముతో నిలిచి "యక్కా! బహు వత్సరములకు నిన్నుఁ జూడఁగంటిని. నేను నేడే పుట్టింటికి వచ్చితిని. నీరాక విని నిన్ను c జూచు తలంపున నిటకు వచ్చి నీ వెనుక నుండి, నీసంగతి గనిపెట్టు చుంటిని" అనెను. అది విని లలిత సంతసించి "చెలీ! నీకిపుడు సంతానమే"మని యడిగెను. "నాకిపుడు ముగ్గురు కూఁతలు, నొక కొడుకును గలరు. నీకును నొక కొడుకును నొక పుత్రికయుఁ గలరు గదా. మనమిక మనసంతానము నెట్లు సుగుణ సంపన్నముగా జేయవలయునో చెప్పుమా" అని శారద పలికెను. ఆ మాటకు లలిత నవ్వి. యామె నాలింగనము చేసికొని " నీయంతటి దానవు మనసంతానమును సుగుణ సంపన్నముగా నెట్లు చేయగలమని నన్ను విచారింపనేల" నీవే యా విధము నాకుపదేశింపజాలవా; అయినను నన్నుఁ బరీక్షింప నెంచి యడిగితివి కాబోలును. అటులయిన నా యనుభవమువలన నాకు దెలిసినది చెప్పెదను. మన పిల్లలలకు మనచిన్నతనపు సంగతిని బాగుగాఁ దెలిపి యా ముద్దుల కుఱ్ఱలారా!

మా యీ కతను మీరెప్పుడును మఱవకుడు. మనుష్యులు తెలిసియుఁ దెలియకయు ననేక పర్యాయము లనేకాపరాధములను చేయుచుందురు. అయినను నితరుల యపరాధములను క్షమించి వారిపై గోపగింపకుండుటయే మంచి వారనిపించుకొనుటకు లక్షణము. ఇతరులయందు దయ కలిగి యుండుట నేర్చి కొనినచో క్షమించుట సులభముగా తటస్థించును. శత్రువులనైనను క్షమింపవలెను. శత్రువులు చేసిన యపకారమునకు బదులు మనము వారికి నుపకారమే చేయవలయును. అట్లయినచో శత్రువులు సయితము మిత్రులగుదురు. అని బోధించుటయే మన పిల్లల బాగు చేసికొను నుపాయము" అని పలికెను.

**–జనానా పత్రిక, సెప్టెంబరు, 1901**

# జానకమ్మ

1వ ప్రకరణము

సుఖైశ్వర్యములకు నెప్పుడు సంబంధము లేదుకదా! జానకమ్మ తండ్రిగారి యిల్లు పూరి యిల్లైననేమి, జానకమ్మ తండ్రి స్వల్ప వేతనము గల యుద్యోగమువలన జీవించు వాడైన నేమి యా కుటుంబమువారు సదా పంచభక్ష్య పరమాన్నములతోఁ గాకున్న సాధారణముగనే భుజించియు బంగరు మేడలు, హంసతూలికా తల్పములు లేకున్నను పూరి యిండ్లలోనే శయనించియు, భాగ్యశాలుల కుండు దురాశాదులచేఁ బీడింపబడక, యెంతకంతకే సంతృప్తినొంది సుఖజీవనమును గడిపి కాలము వెళ్ళఁ బుచ్చుచు వచ్చిరి.

జానకమ్మ పుట్టి నింటివారి కాపురస్థలము కాటవర గ్రామము. జానకమ్మ తండ్రి రంగరాజుగారిపుడు గ్రామకరణమైయున్నను పూర్వ మీయన కుటుంబము వారు రెడ్ల కాలములో నా రాజుల యాస్థానములను నిరంకుశపండితులుగను, గొప్పయుద్యోగీయులుగను ఉండి, యలంకరించి పేరు ప్రతిష్ఠలను సంపాదించిన సద్బ్రాహ్మణులు ఇపుడు జానకమ్మ తండ్రిగారి యింటిలో నటుకపైని వ్రేలాడఁ గట్టఁబడిన యమితములగు తాళపత్రగ్రంథములను బట్టియే రంగరాజుగారి పూర్వికుల పాండిత్య ప్రకర్షణమును దెలిసికొనవచ్చును. రంగరాజుగారికి, తమ పూర్వీకులకుఁగల యాంధ్రభాషా గౌరవ మణుమాత్రము తగ్గలేదు. తామిపుడు నిర్వర్తించుచున్న నుద్యోగపు పనులను బట్టి యాయన యింటనున్న గ్రంథములను సనాకల్యముగాఁ జదివి పాండిత్యము సంపాదింప తీరిక లేకయున్నను కరిణీకపు పనులు మానినప్పుడేవో గ్రంథములను జదువుచునే యుండును.

రంగరాజుగారి కుటుంబము చుట్టుపట్లనున్న గ్రామములలో వన్నెకెక్కి యుండుటకుఁ గారణ మా కుటుంబము పండితకుటుంబమై యుండుటయేగాదు; మరి యొక హేతువు గూడఁ గలదు. మార్గస్థులకును ఇతర స్థలములనుండి యాయూరికిఁబోవు నుద్యోగీయులకును తగు భోజన సదుపాయము వీరి యింటనే

గాని మరి యొకరి యింట జరుగుచుండుటలేదు. మరియు బంగారమునకు వెలిగారము తోడైన యట్లు రంగరాజు గారి యౌదార్యమునకు నాయన భార్య యోపికయు సుస్వభావమును మెఱుగు దెచ్చుచు నీ భార్య భర్తల యతిథి సత్కారమును గూర్చి యా సమీప గ్రామవాసులందరు సదా చెప్పుకొనుచుండునటులఁ జేసెను.

కాటవరము గోదావరి నదిలోపల నున్నతమగు లంకమీదఁ గట్టబడిన నొక చిన్నగ్రామము. మిడివేసవిలోఁదప్ప తక్కిన కాలములందు నదిలో నీరు బాహాటముగా నా గ్రామము చుట్టు మూడుప్రక్కలను బ్రవహించుచుండును. నీటివరకును బంగారు వర్ణమగు నిసుక తిన్నెలు వ్యాపించి యుండును. అందు రెల్లుదట్టముగాఁ బెరిగి యొక్కొక్క కాలమునఁ జన్కగఁబూసి యొక వింత యందమును గొల్పుచుండును; మఱియు మందవాయువులు సెలఁగుచు తదంతికాసీమల దేహముల చెమ్మటల నార్చుచు వారి కమిత సంతోషమును గలుగఁజేయుచుండును. అనుదినము ప్రాతఃకాలమున నా గ్రామజనులు గుంపులుగుంపులుగాఁబోయి నిర్మల నదీజలములందు మజ్జనము లాడుచు చూపరులకుఁ దీర్థయాత్ర సేవించుచున్నటులఁ గనిపించుచుందురు. నది యొడ్డున నిలువఁబడి పశ్చిమోత్తరముగాఁజూచిన సదా నల్లని పొగమంచుతోఁ గప్పబడి యాకాశమంటువరకు వ్యాపించియున్న పర్వతములును అందుపైని సేతువర్ణమయమై కాఱుమేఘములలోని మెఱుపు దీగవలె తళ్కు తళ్కుమను దేవాలయమును, పర్వతములను చీల్చుకొని వచ్చుచున్నటుల గోచరించు గౌతమియు కన్నుల పండువు సేయుచుండును. ఊరి వెలుపలి లంకలోఁ బెరుగు పైరుపచ్చలును, మామిడితోపులును నిత్తె పెండ్లి పందిళ్ల యొక్కయు, తోరణముల యొక్కయు సంతోషమును సమకూర్చుచుండును.

జానకమ్మ జనన మొందిన దినమునకు బూర్వపురాత్రి, తనకు సకలైశ్వర్య సంపదలతోను, విద్యా నిలయములగు కుమారరత్నములతోను, భూలోక స్వర్గమనుభవించు పుత్రికామణి కలుగునని కలగన్న కారణముచేత నా సంగతి యెన్నడు మఱవక మఱలమఱల జ్ఞప్తికిఁ దెచ్చుకొనుచుఁ దండ్రి కుమార్తెను పసితనము నుండియుఁ బ్రేమాతిశయముచేతఁ బెంచుచుండెను. జానకమ్మ, తండ్రికే కాక తల్లికిని తన మంచితనముచే నాకర్షింపఁబడు చుండెను. జానకి తండ్రి జానకమ్మను విద్యావతిని జేయవలెనను కుతూహలముతో, బాలికలనుఁ బాఠశాలలకుఁ బంపుటయేమో యెఱుఁగక మీఁదు మిక్కిలి యట్టి పని వింత తప్పుగా భావింపఁబడు నా కాలమున కూతును తన యిరువురు కుమారులతోఁ గూడ బడికిఁ బంపనారంభించెను. జానకమ్మ

తండ్రి లోకుల యభిప్రాయములకు వెఱచు వాడు కాదు. తన కెంతయుచితమని దోఁచిన నంతతప్పక చేసి తీరును. జానకియుఁ దండ్రి ప్రోత్సాహముచే ననుదినము బడికిఁబోవుచు నన్నదమ్ములకంటె ముందుగ నక్షరమాల, వర్ణక్రమాదులను నేర్చి పుస్తకముఁ జదువ నారంభించెను. ఇందుమూలమునఁ దండ్రికి సంతోషము హెచ్చుటయే గాక, తాను కన్నకల తప్పక సత్యమగుననెడి ధైర్యమాయానకుఁ బొడమెను. మనుజుల కోర్కుల కనుసరిణీయముగఁ గొంత తటస్థించిన, కోరికలెల్ల సఫలమగునట్లే మనోనిశ్చయ మొకటి గలుగుట యెల్లరకుఁ ననుభవ సిద్ధము. ముందెపుడో కొమార్తె యున్నత పదవినందునన్న నిపుడే యట్టిపదవి నందనట్లు సంతోషించుచు జానకి తండ్రి తన ముద్దులకొమార్తె నెల్లపుడు తన యొద్దనే గూర్చుండ బెట్టుకొని నీతి కథలను నీతి పద్యములను జెప్పుచు చిత్తము రంజింపఁ జేయుచుండును. జానకమ్మ యొక్క సుందరాకారము చెక్కుటద్దములు సోగకన్నులు నిండు అమాయికత్వమును చూచించు చూపులును, పిత కమితానురాగమును గలిగించు చుండును. జానకియుఁ దల్లికి చిన్న చిన్న యింటిపనులయందుఁ దోడ్పడుచు నన్నదమ్ములతో గూడి విద్యనభ్యసించుచు, తానను దినము వినుచుండు చిన్న కథలను తండ్రి నోటనుండి వినుట కాయన రాకకై యెదురు చూచుచుండును.

జానకమ్మ తక్కిన యూరి బాలికలవలె వీధులందును, ఇండ్ల యందును గుజ్జన గూళ్లువండను బొమ్మల పెండ్లిండ్లు సలుపను ఉత్సహించునది గాదు. కొందరు బాలికలతోఁ గూడి నది సమీపమునకు బోయి యిసుకు తిన్నెలపైఁ గూర్చుండుచును, పరుగు లిడిచును, ఇసుకలో గూండ్లు కట్టుచునవి పడఁగొట్టుచును, రెల్లు పుష్పములఁ గోసికొనుచును, నదీ జలముల వైపునకును జూపుల నిగుడ్చుచును హృదయ ముప్పొంగనాడుచు పాడుచు నానదించుచుండును. మరియు నప్పుడప్పుడు జనని యాజ్ఞచే బంతి చేమంతి, గులాబి మున్నగు పూలమొక్కలకు నీరు పోయుచు పూచిన పుష్పముల నెవరినిఁ గోయనీయక తన చిన్న పూదోటను జూచి సంతసించుచుండును.

రంగరాజు గారాబముచే కొమార్తె చేతనే బిచ్చగాండ్రకు బిచ్చము వేయించుచు, తనకుఁ గావలసిన చిన్న చిన్న పనులను జేయించుకొనుచుండును. కొమార్తె యొక వేళఁ జేయగూడని దాని నెపుడైనఁ జేసినను తండ్రి మూర్ఖపు తలిదండ్రులవలెఁ దిట్టకయు, మోదకయు నీతి బోధనలచే మరల నట్టిపనులను జేయనీయకుండును. కొమార్తెపైఁ గోపముసేయుట యనుమాటయే యాయన యెఱుగడు. తానే కాక యింటిలోనివారెవ్వరును గూడ జానకిని గొట్టుటకుఁగాని

పరుషోక్తులాడుటకుఁ గాని యాయన యొప్పుడు. జానకి పాపము పేదవారలగు నిరుగు పొరుగువారలకు చిన్న చిన్న సమాయములను జేసి వారి వలన ననేక విధములఁ గొనియాడఁబడుచుండును. పసిపిల్లలకు బుద్ధిగఱపుటకు నిరర్థకమగు పరుషోక్తులును, తాడనములును ఆగ్రహములునుగాక నిర్మల ప్రేమమయఁ దియ్యని మాటలును మాత్రమే చాలియుండు ననుజ్ఞానము జానకి తండ్రివంటి వారికే దెలియును గాని తదితరులకుఁ దెలియదు.

ఇట్లు జానకి స్వకుటుంబమువారికిని, ఇతరులకును గూడ ముద్దులబిడ్డయై పిన్న వయస్సున నున్నను పెద్దగా నితరులచే జెప్పఁబడుచు తన చిన్నతనమును గడపెను. జానకమ్మ జన్మ గ్రామము మిగుల చిన్నదగుట చేత బడిలో నేర్చు విద్య మరి లేక తండ్రియొద్దనే పెద్ద పెద్ద పుస్తకములను జదివి జ్ఞానము సంపాదించి నానాట నధికముగా తల్లికి గృహకృత్యములందు దోడ్పడుచు నామె కెంతో తీరికను సుఖమును జేకూర్చుచుండును. మరియు తీరికగా నున్నమ సమయమున తల్లికిని, ఇరుగు పొరుగు స్త్రీలకును చిత్రగ్రంథములను జదివి సంతోషమును గలుగఁ జేయుచుండును.

## 2వ ప్రకరణము

కష్టములకంటె సుఖములే త్వరితముగా గడచిపోవునట్లు మనకు కష్టకాలములందుఁ గనిపించుచుండును. కొమార్తె తప్పటడుగులును వచ్చియు రాని మాటలును తండ్రికిఁ బూర్ణానందమును గలుగ జేయక పూర్వమే జానకి పెద్దదియై పుస్తకమును జదువ నేర్చెను. జానకి పుస్తకముఁ జదువ విను నానందము పూర్ణముగాఁ గలుకగక పూర్వమే యామెకుఁ బెండ్లి యీడు వచ్చెను. తండ్రికి కొమార్తె చేష్టలవలని సంతోషము ఇప్పుడామె వివాహవిషయమైన చింతగా బరిణమించెను. “మంచి సంబంధమున కెక్కడికి బోదను. అది యెందు సంప్రాప్తమగును” అని రంగరాజు గారు తలపోయుచు, తాను గన్నకల యెక్కడ నసత్యమగునో యని విచారించుచుండెను. మనో నిశ్చయ మెట్టిది యయ్యును దానికి నించుక భంగము కలుగఁబోయినను, మనస్థైర్యము సందేహ సూర్యరశ్మిచేతఁ గరగ నారంభించునుగదా! జానకి తండ్రి భాగ్యశాలి కానటుల నిదివరకే చెప్పబడినది. అట్లయిన భాగ్యవంతులతోడి సంబంధము గుదురు టెట్లు? జానకి భాగ్యవతియగు టెట్లు? అయినను సందేహముద్ర మొక్క పరి ముంచునది గాదు. అణుమాత్రముగ నాశఁదగిలినను మనసు డోలాయమానము గావలసినదే. సమీప గ్రామమున కొలది కాలము క్రిందటనే విద్యాభ్యాసము మాని

దొరతనము వారి కొలువులోఁ బ్రవేశమై కొంత వేతనము సంపాదించుచున్న యొకరికి జానకి నిచ్చి వివాహముఁ జేసిన బాగుండునని స్నేహితులు గొందరు రంగరాజు గారితోఁ జెప్పగా నాయన యందునకు సంతసించెనుగాని పెండ్లి కుమారుని వారి కుటుంబము భాగ్యపు కుటుంబమని తెలిసినపుడు వారు తనవంటి పేదవానితో సంబంధము చేయుదురాయని గొంతవరకు సందేహమును గొంతవరకు విచారమును బొందెను. అయినను పెండ్లి కుమారుని తండ్రి దొరతనము వారి కొలువులో నుద్యోగిగనుండి పలుమారు తమ గ్రామమునకు వచ్చి తమ గృహమందు సతిథి సత్కారమును గాంచిన తమ స్నేహితులేయని వినినపుడు గొంత యాశ మనసున సందడింప రంగరాజుగారు సంతసించ దొడఁగెను. జానకి తల్లివలన నీ సంగతులు విని యూరి అమ్మలక్కలెల్ల నప్పుడే “జానకమ్మ యదృష్టమేమి? ఎంత గొప్ప కుటుంబములోఁబడినది” అని చెప్పుకొనజొచ్చిరి. అయినను రంగరాజుగారికి మాత్రము కొమార్తె విషయమున చింతలును, అలజడులును మెండయ్యెను. మంచి సంబంధము గుదుర వలెనన్న కట్నములకు కానుకలకు నధికముగా వెచ్చింపవలయును. కుటుంబ స్థితి యట్టి పనిని భరింపలేదు. కొమార్తెయందలి ప్రేమయు, నామె కనుకూలమగు సంబంధము గుదుర్చి సుఖజీవనమును జేకూర్చవలెనను నపేక్షయు నరకలు వేయుచుండును! ఇట్లు రంగరాజుగారు పరితపించుచుండ పెండ్లి కుమారుని వారి యింటికిఁబోయిన బ్రాహ్మణుడు వచ్చి, పెండ్లి కుమారుని తల్లి మొదలగు వారు కట్నము లేక జానకమ్మను గోడలిగా నంగీకరింప నిచ్చయించకుండుటయు, పెండ్లి కుమారుని తండ్రి రంగరాజుగారి కుటుంబము యొక్క మర్యాదను, జానకి తెలివి తేటలును స్వయముగాఁ దెలిసినవాఁడగుట చేత నీ సంబంధమునకే యొడఁబడుటయు సవిస్తరముగాఁ జెప్పిన జానకి తలిదండ్రులకును, ఆ గ్రామవాసులకును గల్గిన సంతోషము చెప్ప నలవికాదు.

అంత జానకమ్మ వివాహ ముహూర్తము నిశ్చయమయ్యెను. అందునకుఁ గావలసిన పదార్థములు నన్నిటిని వేగమె రంగరాజుగారు సమకూర్చిరి. పెండ్లిపందిళ్ళును, అలంకరణములను సిద్ధమయ్యెను. జానకమ్మ వివాహమెంతో వైభవముతో జరగెను. రంగరాజుగారి కెంతయు మనస్థిమితము గల్గెను. తమ కోర్కులన్నియు సిద్ధించునట్లే, యాయన సంతసించ దొడగెను.

–తెలుగు జనానా పత్రిక, 1902, ఎ

# దంపతుల ప్రథమ కలహం

నేను పెండ్లాడిన భార్యను గాని దాసినిగాను వివాహమాడుట వలనను భర్తకు దాసినగుదునాయేమి?

లలితా! నీవు వెఱ్ఱిదానవాయేమి? ముసలిదానిని నామాటనించుక వినుము నీ విటువంటి మాటలనగూడదు.

అమ్మమ్మా! నేను నా భర్తకు విక్రయింపబడిన పరిచారికనేమో న్యాయముగా విచారించి నీవె చెప్పు?

నీవు నీ పతియొక్క పట్టపు దేవివే గృహలక్ష్మివే దాసివిగావు.

అయితే ఆయన నన్ను గృహ యజమానురాలిగానెంచి మన్నించి ప్రేమింపవలయును గదా! అట్లు చేయక యిచ్చవచ్చిన పనులన్నియు నన్ను సేయమనిన నేను జేయుదునా యేమి?

నీవిపుడు మాటలాడు దోరణి నించుక నీ పతి విన్నచో నాతనికి నీయందలి ప్రేమహెచ్చునా?

హెచ్చుగాకున్ననేమి? అమ్మమ్మఆ యిది మీ కాలము కాదు. ఇప్పటి కాలములో వివాహము కాగానే మేము గృహిణీ పదమున కర్హురాంద్రమగుదుమే కాని ధనమిచ్చి కొన్నఇ బానినలము కాము. మా వంటి పత్నులు పురుషులయహంభావము నెంత మాత్రము సహింపజాలరు?

లలితా! నీవిదివఱకేమో చాతుర్యవతివని యనుకొనుచుంటిని కాని యిట్లు వెఱ్ఱిబాగుల దానివని నేనెన్నడును అనుకొనలేదు. ఈ తెలివితక్కువ తనమునకు దగిన ప్రాయశ్చిత్తము ననుభవింపకపోవు ఇప్పటి తగువులోని తప్పంతయు నా మనుమనిదేనా? లేక నీదేమైనను న్నదా? నీకు నీ స్వాతంత్ర్యము దెలిసినంత చక్కగా నీ కర్తవ్యము తెలిసియుండిన నెంత చక్కగా నుండేది. కర్తవ్యము నిఱిగినవారిట్టి పలుకులెన్నడును బలుకరు. నీ పెనిమిటి కోప స్వభావుడయినను నీవు నీ శాంత స్వభావమువలన నాతని తాసమ వృత్తము మాన్ప బ్రయత్నించవలెను. నిన్న తఁడవమానించుట నాకును నసమ్మతమే కాని ప్రథమమున నీవేమయిన నాతనికి

కోపము తెప్పించునట్టి మాటలనకుండినచో నీ విట్లు కోపగించునంతటి తగువేకాక యుండును. ఇందవలన మొదటి యపరాధము నీదే యని తోచెడిది.

'నామాట విను ఈ దినమునందు నేను నీ దగ్గఱకు రా నిశ్చయించుటినిగదా దీనిని వినియూరకుండక నన్ను తనతో గూడి నాటక శాలకు రమ్మని యాయన బలవంతమేల చేయవలెను? నేనొకసారి నిశ్చయించిన కార్యము నీవలి సూర్యుడావల బొడచినను విడుచు దాననుగానను సంగతి నీకు దెలిసినదే?

సరేకాని నీ భర్త స్వభావము నీ స్వభావము వంటిదే యై యుండును. గాన నిట్టి సమయములందు మీరిరువురును మీ మీ స్వాతంత్ర్యములను హెచ్చింపుచుండినచో కలహము ముదిరి గృహమొక యరణ్యమువలె నుండి దుఃఖప్రదమగును. ఇందువలన మీలో నెవరైన నించుక మెత్తబడి రెండవవారి మాటనే సాగనిచ్చుచుండినచో వారును నొకప్పుడు మీ నిశ్చయమునకు విఘ్నము కలిగింపకుందురు. అట్లు లొంగవలసిన వారిలో నీవే మొదటి దానివైన నీకేమి లోపము?

నీవు నాదనవని నేనీమాటలను నీతో జెప్పకుంటిని అందుకు నీవు నాకు సమాధానము చెప్పి యోదార్చుటకు మారు నన్నే చీవాట్లు పెట్ట మొదలు పెట్టితివి. నాయదృష్టమే యిట్టిది. ఎవ్వరును నాకనుకూలముగా మాటలాడరు. అని లలిత యేడువ నారంభించెను.

నాటక గృహమున కరిగి యిచట నాటకమును జూచుచున్న నారాయణరావు మనస్సంతయు స్థిమితము లేకయుండెను. అచట జరుగుచుండిన నాకట మధిక మనోరంజకమయ్యు నాయన మనము నాకర్షింప జాలకుండెను. నారాయణరావు భార్యతో గలసి కాపురము చేయనారంభించి రెండు నెలలే యాయెను. ఆయన పట్ట పరీక్షయందు కృతార్థుడయిన పిదప రాజమహేంద్రవరమునందు నెలకు నూరు రూపాయల వేతనము గల యుద్యోగములో బ్రవేశించెను. ఆయన తండ్రిగారును గొప్పవాడయి విశేష ధనమును సంపాదించి యుంచినందున జీతము కాక వారికి వేఱుగా కొంత ధనము సంవత్సరమునకు వచ్చుచుండెను. నారాయణరావుగారి యింట నొక వంట బ్రాహ్మణుడును నొక పనివాడును నుండిరి. కాన లలితకే పనియును లేక సుఖము గానుండి యింట వ్యవస్థను జక్కబఱుచుట పతితో గలసి ముచ్చటించుట యేపనిగానుండెను. ఇంత సౌఖ్యము కలిగి యుండినను బ్రతితడవ తన మాట యేజరుగ వలెనని తలచు బాల స్వభావముగల లలిత వలన నామెకు గాని యామె భర్తయగు నారాయణరావునకు గాని యానందము కలుగకుండెను. ఆ నూతన

దంపతలిరువురును గలసి నాటకమును జూడవలెనని వారికనేక దినముల నుండి యిచ్చ యుండెను. ఈ సమయమునందొక నాటక సమాజము వారా గ్రామమునకు వచ్చి యుత్తమము లనబడు తమ నాటకములచే విశేష ధనము నార్జింపుచుండిరి. మిత్రుల యాలోచనల వలన నారాయణరావాదినమున నాటకము చూడ నిశ్చయించి తను భార్యసహితుడునై వచ్చెదనని, వారి వారి భార్యలను వారు కూడా తీసికొని వచ్చునటుల నేర్పాటు చేసిన వారలతో జెప్పిముందరి కుర్చీల టికట్లు రెండు తీసికొనియా సంగతి తానకస్మాత్తుగాఁజెప్పినచోఁ దన భార్య విశేష యానంద పరవశయగునని తలచి యుప్పొంగుచు నింటికి వచ్చెను. అట్లు వచ్చి నారాయణరావు నేడొక క్రొత్త నాటకమును జూడబోవలెను గానఁ ద్వరగా భోజన ప్రయత్నము చేయించుయు ఈ నాటకమునకు మనమిరువురము బోవలయునని సంతోషముగా భార్యకుఁ జెప్పెను.

లలిత(కోపముతో) నాటకము చూడ బోవలయునా? ఎవరు పోవలయును అని విసుగు కొనెను.

అంతలో నారాయణరావునకుఁ గల సంతసమంతయు నడుగంటి నతడొక విధమైన చిన్నదనముతోప మనమిద్దఱము పోవలయు నినియెను.

లలిత 'మీరొకరు చూడబొండు నేను రాను' అని విదిలించెను.

నారాయణరావు 'నీవు రావలెను రాక తప్పదు. నేడు మనకిరువురకై ధన వ్యయము చేసి టిక్కట్లు తెచ్చితిని.'

లలిత 'మీరొక్కరే చూడబొండు టిక్కట్లు కొనునప్పుడు నన్నడిగితిరా! నేడు నేను వచ్చుటకు వాలులేదు. వేఱొక స్థలమునకు బోవలెను.

నారాయణరావు నీవన్నది నిజమే కాని మిగుల నేను టిక్కట్లు తీసికొంటిని గాన నీవు తప్పక నాతో రావలెను. పోవలసిన స్థలమునకు రేపు పోవచ్చును.

లలిత 'నేను మీతో రాను నేననుకొనినచోటికే పోయెదను.

నారాయణరావు కోపముచే కన్నులెఱ్ఱబడ ఇదివట్టి మూర్ఖత యనెను.

లలిత మొగము చిట్లించుకొని నా యిష్టము.

నారాయణరావు మరల శాంతమునవలంభించి భార్యను చూచి నేను జేసిన యి పనిఁ జూచినీ వధిక సంతోషమును బొందెదవని తలచితిని నాటకము త్వరగా నాడ ప్రారంభింతురు నీవును త్వరగా భోజనము చేసి నాతో వచ్చుటకు సిద్ధమగుము నా స్నేహితులు సహితము భార్యలతో గలసి యచ్చటికి వచ్చెదరు. అనెను.

లలిత మీ యిష్టము నెరవేర్చుట నా చేతకాదు కేవలము మీ యిష్టప్రకారమే నడుచుటకు నేను మీ బానిసనుగాను.

భార్యయొక్క యీ మాటలను విన్నతోడనే నారాయణరావునకు బట్టజాలని కోపము వచ్చెను అంతనాతడు దిగ్గున లేచి దుస్తులను దొడగికొని యా నాటక గృహమువైపునకు నరిగెను. భర్త యిల్లు వెడలిన తోడనే లలితయు శాంతిహీనమగు మనముతో లేచి యా గ్రామమునందే యున్న తన ముత్తువ యింటికి నరిగెను. అచటనామె ముత్తువతోనాడిన సంభాషణ యీ కథకు బ్రారంభముననే వ్రాసితిని.

ముత్తువ తల్లి మాటల వలన లలితకుఁ గలిగిన దుఃఖావేశము కొంత తగ్గిన పిదప నామెను జూచి ముత్తువ యిట్లనియె లలితా! నేడు జరిగిన సంగతి నీకంత గొప్పదిగా గానబడకుండ వచ్చును. కాని యిదే నీకొక గొప్ప దుఃఖమునకుఁ గారణమగునేమో? ఎవరి యపరాధమయినను దత్పరిణామము వలన నిరువురి సుఖమునకును నాశనము కలుగుట ఇటువంటి యల్ప కారణము వలనఁ గొన్ని సంసారము లెటులగూలెనో నీ వెఱుఁగుదువా? సంసారములారి యమిత నష్టము గలిగెను సుమా.?

అని చెప్పునప్పటికా ముసలి పార్వతమ్మకు దుఃఖముచేఁ గన్నుల నీరు నిండెను వానిం దుడుచుకొని యామె.

"అమ్మా లలితా! పూర్వము నీ వంటి యొక కచ్చెపిల్లయుండెను. దాని పెనిమిటి సుగుణ సంపదయు దృఢ నిశ్చయమును గలవాడు. ఆ దంపతలిరువురును మొదట గొంత కాలమానందముగా నుండిరి. భార్య మాటయనినన నాతలడు అడుగు దాటక మిగుల గౌరవింపు చుండెను. కాని యామె మాత్రమాతండు చెప్పినదంతయుఁ జేయకుండుటయే తన గౌరవము హెచ్చుటకు మార్గమని తలంచి యట్లే వర్తింపగాఁదుదకు ... అని యా ముసలమ్మ దుఃఖము చేత నోటమాట రాక కొంత తడవుండి దుఃఖమునడచు కొని యిట్లనియె.

తుదకొకసారి యాతనికి నామె యవిధేయతలవలన విసుగు కలిగి కోపము వచ్చి దేశాంతరము పోయెను. వారిరువురికిని మరల నొకరికొకరు చూచు కొను భాగ్యమే కలుగకపోయెను.

తుది వాక్యము నుచ్చరించునపుడా ముసలమ్మ యధిక దుఃఖాతిరేకము వలన గద్గద కంఠయయ్యెను.

ఈ సంగతి వినినప్పటి నుండియు లలిత మనమునందుననేక విచార

తరంగములు రా నారంభించెను. అపుడామె పార్వతమ్మతో నా దంపతులాజన్మము నొండొరులను జూచుకోలేదా? అనెను. పార్వతమ్మ గంభీర ముద్రతో లేదు వారెన్నడూ నొకరినొకరు కనుగొనలేదు.

లలిత వారెందుకు జూచుకొనలేదు.

పార్వతమ్మ తగవు జరిగిన దినమునందాయన విరక్తి చేత నింట నిలువ కోపావేశముచేఁ బరదేశమున కేగ నెంచి బయలుదేరి కాశీకి బోయెను. అందుపై నాతని భార్యకు మిగుల పశ్చాత్తాపము గలిగెను. గాని పనిమిగిలిన పిదపఁ బశ్చాత్తాపము వలన లాభము లేదయ్యెను. కాన నామెజన్మమంతయు ధుఃఖింపు చుండెను.

అని పార్వతమ్మ దుఃఖము నాపుకొనలేక వెక్కి వెక్కి యేడువ సాగెను. నామె కన్నీరు వరదలై పారఁజొచ్చెను. దీనిని విని లలితకు భయము వలన ..హము కంపమెత్త సాగెను. మొగము వెలవెల బాఱెను. తొట్రుపాటుతో ముత్తువనుగని అమ్మమ్మా నీవు చెప్పిన యీ కథ నిజమైనదా యని యడిగెను.

పార్వతమ్మ నిజమయిన సంగతినే నీకుఁజెప్పితిని అట్టి దౌర్భాగ్యరాలగు స్త్రీని నేనే. తత్పూర్వమొక మాడు పిల్ల కలిగి యుండినందున నేడు నిన్ను గనినీకీ సంగతినిఁ జెప్పు భాగ్యమును కంటిని. అప్పటి కలహమును నిట్లే (?) క్షమద్రమయినదియే కాన నీవు నా నిజానుభవమును విని తెలివి తెచ్చుకొని నేడిందులకై యాతనిని వేడుకొని ముందెప్పుడిట్లు చేయనని యొప్పుకొనుము నీవు నీ భర్త చెప్పిన పనినిఁ జేయతత్పరురాలవై యుండినచో నాతడును నీ మాటను విని నిన్ను గౌరవించును మనమితరులను మన్నింపనిచో వారు మాత్రము మననేల మన్నింపనెంతురు.

లలిత భీతిల్లి అమ్మమ్మా! నా భర్త నేటి నుండియే నాకు దర్శనమియ్యకుండునేమో!

పార్వతమ్మ నీవింత భయపడనక్కరలేదు. నీ పెనిమిటి తప్పక వచ్చును. ప్రథమ కలహమునందే సంసారమును విడుచు ముంగోపులకు వారు బహుకొద్దిమంది కాని యిదే ప్రకారము కలహములింకను జరుగుచుండినచో నొక దొనమంత పనికాక మానదు. ఇట్లు కాకుండుటకై కదా నేను నీకింతగా బోధించినది. నా మనుమడింటికి వచ్చిన తోడనే నీవాతనిని క్షమింప వేడుకొనుము. నీవు నాయొద్దకు రాక యతడు చెప్పిన మాట విని యుండిన నెంత బాగుండును.

లలిత 'నీవన్న మాట నిజమే నేడు నేనే తగవునకు మూలమునైతిని ఇక ముందెప్పుడు నేనిట్లు చేయను.

భర్త పరదేశమున కేగునేమోయను భీతి మనము నందుద్భవించిన పిదప లలిత మనసెంత మాత్రము స్థిఇమితము లేకయుండెను. ముత్తువ చెప్పు సమాధానము వలనైనను శాంతి గలుగ లేదు. ఆభయంకర విచారము వలన నామె దుఃఖమును విడిచి కన్నుల నుండి యశ్రురూపముగా వెలువడసాగెను. అంతనామె యాయర్ధరాత్రమునందు బయలుదేరి తన యింటికి వచ్చి భర్త రాకకెదురు చూచుచుండెను. అప్పుడు లలితకు క్షణమొక యేడుగా తోచుచుండెను. ఆమె గడియ గడియకు బైటి ద్వారము తెరచి యిటు నటు చూచి నిరాశజెంది లోనికి బోవుచుండెను.

అచట నారాయణరావు నాటక శాలలో గూర్చుండెను గాని యా నాటకము చూచుట యందాతనికి నుత్సాహము లేక యుండుట వలన నది నీరసముగాఁ దోచెను. అతడు తన మనుమనందిట్లు చింతించెను. నేను నా భార్యపై నింత యధిక ప్రీతి కలవాడనై యుండినను నది నేను జెప్పిన యీ చిన్న మాటనైన వినగూడదా? అని వితర్కించి యచట నుండి లేచి గోదావరి యొడ్డున కరిగెను గాని యచటి చల్లని గాలి వలనను నాతనికిఁ జిత్తశాంతి కలుగలేదు. నేనింక గృహమునకరుగను. అచటికి బోయినందున లాభమేమి?

ప్రతిమాటయుఁ దన యిష్ట ప్రకారమే జరుగ వలెనను భార్యతో గల జగడ మాడనా? నేను నా భార్యను దీసుకొని వచ్చెదను గాన మీరును మీ సతులను గొనిరండని చెప్పినందుకుఁ దప్పక వారు వారి పత్నులను దీసికొని వచ్చిరి. నేను జెప్పినది తప్పక విని నాతోఁగలసి వచ్చునను కొనిన నా భార్యయే నన్నిట్లవమాన పఱచెను. ఇట్టి దానితోఁగలసి కాపురము చేయుట కంటె నిచటనే కొంతదవ్వుండి యెటకైనం బోయెద గాక యని నారాయణరావు విచారింపు చుండెను.

ఇంట నుండి పతిరాక కెదురు చూచుచున్న లలితయు నాతడు వచ్చుట నిశ్చయము కాదని తలచి తాను నాటక గృహమున కరిగి భర్త వాకబు చేయనెంచెను. గాని యిట్టి రాత్రి సమయమునందొంటరిగా నెటకేగుటనుఁ దోచకుండెను. తన పతి తన్ను విడిచి పోవునను విచారము వలన నామె కనుమానము భ్రమలు కలుగు చుండెను. నేడింటికి వచ్చినచో నా యావచ్ఛక్తిని వినియోగించి నా పతి కోపమును శమింపఁజేసి మరల నెన్నడు నిట్టి ప్రసంగము రాకుండ గట్టుదిట్టములు చేసెదనని యామె తలంచెను. ఇంటనున్న పరిచారకులనందఱిని యదివఱకే యజమానుని

వెదుకుటకు పంపినందున తాను బోయి వెదుక వలెనన్నచో దనకు దోడు వచ్చువారు లేరైరి. తుదకు విసిగి యామె కొంచము మంచముపై వ్రాలెను.

అంతలో నామె కొక భయంకరమైన స్వప్నము కానబడెను. అప్పుడు భీతిచే నరచుచు నామె మేలుకొనియెను. ఇంకను నారాయణరావు రాడయ్యెను. ఆయన రాకకు నాలస్యమయిన కొలది లలితకు దుఃఖము విస్తరిల్లు చుండెను. అంతనామె మెల్లగా లేచి దీపము వెలిగించి యాదీపము నెడమ చేతితో బట్టుకొని సేవకులెవరయిన వచ్చి యుందురని తలుపు దెఱచి బైటి పంచపాకలోనికి వచ్చెను. అప్పుడచట నున్న బల్లపై నెవరో పరుండినట్లుల గానుపించినందున నామె దీపము నా బల్ల సమీపమునకు గొనిపోయెను. దాని వెలుతురున నా నిదురించినది తన భర్తయేయని యామె తెలిసికొనెను. అందుపై లలిత మిక్కిలి దీన స్వరముతో నా యపరాధమును క్షమింపుడు నేనిక యెన్నడును నిట్టి యపరాధమును జేయను అని యాతని పాదములకు మ్రొక్కెను. ఆమె పాదములనంటిన వెంటనే నారాయణరావు మేలుకొని యామె నోదార్చెను.

గోదావరి యొడ్డున తిరుగుచుండగా నారాయణరావునకు గలిగిన దుర్విచారము వివేకము వలన సద్విచారమై మరల నింటికిఁ బోవలయునను బుద్ధి పుట్టించెను. అంత రామర గృహమునకు వచ్చి తనకుఁగోపము వచ్చినదని లలితకుఁ జూపవలయునని బైటనున్న బల్లమీదనే పరుండెను. అప్పుడే లలిత వచ్చి ఆయనను గాంచి క్షమాపణ వేడుకొనెను. ఆ దినమునుండి లలిత స్వభావమును మార్చుకొనినందున మరల నెన్నడును వారికిట్టి కలహము జరుగక వారు సుఖముగా నుండిరి ఇందువలన వారి ప్రథమ కలహము యంత్య కలహమయ్యెను.

– హిందూ సుందరి, జూన్, 1902

# సత్పాత్ర దానము

మేడమీద గవాక్షము దగ్గిర కుర్చీపైని కూర్చుండి కేశవుఁడు తన పాఠము చదువుకొనుచుండెను. ఇంతలో నొక గ్రుడ్డివాడు అయ్యా! కండ్లులేని కబోదినయ్యా, ధర్మము సెయ్యరయ్యా, ఆకలి చేత కడుపు మండుకొను పోతున్నదమ్మా. కాసంత బువ్వబెట్టరే తల్లీ. ఇంత పెద్ద పట్టణములో ధర్మమే లేదే నాయనా? అను పదములను నిత్యనియమ ప్రకారముచ్చరింపుచు వీధిని నడుచుచుండెను. వాని దీన వాక్యములను విని కేశవుని మనసు కరిగినందున నా బాలుడు చదువు విడచి మేడదిగి వచ్చి పని తొందరలోనున్న తల్లినిగని అమ్మా! వీధిలో గ్రుడ్డివాడొకఁడు ఆకలిచేత బాధపడుచు ద్రోవతడవుకొనుచుఁ బోవుచున్నాడు. పాపము వాడు చాల బీదవాడు. వానికిచ్చుటకొక పావలాయిచ్చెదవా? అని యడిగెను.

చదువరులారా! పై నుదహరించిన సంగతినిబట్టి కేశవుఁడు మిక్కిలి దయాళు వగు బాలుఁడని మీరు తెలిసికొనియే యుందురు. పాత్రాపాత్ర భేదము తెలియని యా బాలుని మాటలను విన్న మాత్రముననే పావలానతనికి నియ్యఁజాలక లక్ష్మీదేవమ్మ యా గ్రుడ్డివాఁడు పావలానిచ్చుటకర్హుడో కాడో విచారింప నెంచి వానిని మన యింటికిఁ దీసికొనిరమ్మని కేశవుని పంపెను.

ఆమె నోటినుండి మాట వెలువడిన తోడనే కేశవుడు మితిమీఱిన యానందమును బొంది యిఁక అమ్మ గ్రుడ్డివానికి నిచ్చుటకుఁబావులాతీయును' మన చేత గొప్ప ధర్మమగునని యుప్పొంగుచు నొక్క పరుగున వీధిలోనికి నరిగి యా యంధునకుఁ ద్రోవ నెఱిఁగింపుచుఁ దమ వాకిటికిఁ దోడుకొని వచ్చెను. ఇంతలో లక్ష్మీదేవమ్మయు వెలుపలికి వచ్చెను.

లక్ష్మీ– గ్రుడ్డివాఁడా! నీవాకలిగొని యున్నావని మా కేశవుఁడు చెప్పుచున్నాడు. నిజమేనా?

గ్రుడ్డి– అవునమ్మా? నేఁడంతయు నేను పస్తే. ఉదయాన నొక పుణ్యవతి, మీ యట్టి మహారాజు పిడికెడు మెతుకులు పెడితే తిని నీరుత్రాగితిని. అప్పటినుండి

పస్తుండవలసి వచ్చెను.

ల– అట్లైన నీకు నేనింత యన్నము పెట్టెదను. దానిని తిని యాకలి చల్లార్చుకొనుము.

గ్రు– నీకడుపు చల్లగుండి; నీ కొడుకు ముసలోఁడు గాను దేవుఁడు మీకు శుభము లిచ్చును.

అంత లక్ష్మీదేవమ్మ లోపలినుండి మైలలో నున్న యన్నము కూర తెచ్చి యా యంధునకు విస్తరివేసి వడ్డించెను. గ్రుడ్డివాఁడు భోజనము చేయుచుండఁగా లక్ష్మీదేవమ్మ కేశవునిం దన సమీపమునందుంచుకొని యాయంధునితో వాని స్థితిగతులను గూర్చి యిట్లు ప్రసంగింపసాగెను.

ల– ఓ గ్రుడ్డివాఁడా నీ పేరేమి? ఊరేమి?

గ్రు– నాపేరు ఈరప్ప. ఊరు పసలాది పట్ట యావల నుండును.

ల– ఇంటి దగ్గర నీ కెవరెవరు బంధువులు కలరు?

గ్రు– ఆడ నా పెండ్లాము, ఇద్దఱు కొడుకులు, ఇద్దఱు మనమలు గలరు.

ల– నీ పిల్లలు భార్య నిత్యము దేనివలన కడుపు నింపుకొనెదరు? వారేమి చేయుచుందురు?

గ్రు– వాండ్లు ఇతరులు పొలమును కౌలుకుఁ దీసికొని దానిని దున్నుకొని పొట్ట నింపుకొనెదరు.

ల– నీ కిద్దఱు కొమాళ్ళు గలిగియు బిచ్చమెత్తుట యెందుకు?

గ్రు– తల్లీ! నా కొడుకులు దినమంతయు కష్టముచేసి తినుటకు గావలసినంత ధాన్యమును పోగుచేతురు. కాని యుప్పు మెరపకాయకు బట్టాపాతకు కావలెను గదా? ఆ పల్లెలో నివి మాకుఁదొరకవు.

ల– అయితే నీవా వస్తువుల మట్టుకు సంపాదించెదవా?

గ్రు– ఔనమ్మా! నా కడుపు గడువగా మిగిలిన డబ్బులు బట్టలు పిల్లలకుఁ బంపెదను.

ల– అయితే నీవిది యొక వ్యాపారమే చేయుచున్నట్టున్నది. వీరన్న కీ మాటలవలన కొంత భయముగా నుండెనని యాతని ముఖ చర్యవలనఁ దెలియుచుండెను.

ఇంతవఱకు కేశవుఁడూరకుండక మధ్యమధ్య నేదొ యొకటి తల్లినడుగుచునే యుండెను. ఆ యంధుని వార్త విని యా సుకుమారుని హృదయము కరిగిపోయెను.

వాని కొడుకులు పొలము దున్ని బ్రతుకుదురని చెప్పునప్పుడు కేశవుఁడా పొలము దున్నుటలోఁగల కష్టము లసంఖ్యాకములు గదా యనియును, వాని భార్య పిల్లలెన్ని కష్టములు పడుచుందురో యనియును, తల్లి నడిగి విసిగించెను గాని యామె వాని మాటనంత శ్రద్ధగా వినక యీ గ్రుడ్డివాని భోజనమైన పిదపఁ దలుపులు మూసి నీవు నాదగ్గిరకు రమ్మని కేశవునితోఁ జెప్పి తాను దన పనికిఁబోయెను.

ఆదివ్య చక్షుడు భోజనము చేసి సంతసిల్లి తల్లీ! నీకు దేవుఁడు మేలు చేయును. నీ పుత్త్రుడు ముసలోఁడయి మనుమల నెత్తును. అని లక్ష్మీదేవమ్మను దీవించి తనదారినిఁ దాను బోయెను. తల్లి యాయంధునకుఁ బావలానియ్యదని తెలిసికొని యబ్బాలుఁడు మిగుల చిన్నబోయి తల్లి యాజ్ఞ ప్రకారమంతయుఁజేసి మేడపైకిఁబోయెను.

కేశవుఁడు మేడపైకి వచ్చిన వెంటనే, అమ్మా నీవాగ్రుడ్డి వానికిఁబావలా నేలయియ్యలేదని తల్లి నడిగెను. అందుపై నా గ్రుడ్డివానికిఁ బావలా నియ్యనందుకా తల్లి కొడుకులకిట్లు సంవాదమయ్యెను.

ల–వానికిఁ బావలనిచ్చుటకంటెను అన్నము పెట్టుట యధికయావశ్యమైనది.

కేశ– అయినను మనము పావలాను గూడ వానికి యిచ్చి యుండిన దానిని వాఁడు తనయింటికిఁ బంపి యుండును గదా?

ల– పావలాలు రూపాయిలు మొదలైన వెటువంటి వారికియ్యవలయునో నీకింకను దెలియదు.

కేశ–తెలియకేమి బీదలగు గ్రుడ్డివారికిఁ గుంటివారికి నిచ్చుటయుత్తమము.

లక్ష్మి– అదే నిజమైనను వారిలో సహితము తారతమ్యములను విచారించి యేదియిచ్చుట కెవ్వరర్హులో వారి కదియే యిచ్చుట యుత్తమము విశేషయావశ్యకము లేనివారికది యియ్యఁగూడదు.

కేశ–వానికి కొడుకులాగ్రామమున ధనము దొరకక పెక్కిడుముఁబడు చుందురుగదా? దీనిని వారికికేల యియ్యఁగూడదు?

లక్ష్మి– కొడుకుల కష్టములను వారు చిన్న వారయియుండగా పోగొట్టుట తల్లిదండ్రుల కర్తవ్యము వారు పెద్దవారైన పిదప వారే తమ సదుపాయము తాము విచారించుకొనవలెను. ఆ గ్రుడ్డివాని పుత్త్రులిరువురు హైదరాబాదు వంటి పట్నమున కరిగి కూలి పని చేసినను వారు వారి కుటుంబములను రక్షించుకొనగలరు.

కేశ– వారట్లేల చేయరు?

లక్ష్మి– కొన్ని పశువులు గడ్డి లేక నోటికి మన్ను తగులు చుండినను నొక చోటనే గరిక మేయుచుఁబరుండును గాని వానికిఁ కొంచెము దూరములో పచ్చని పసిరికయున్నను నవిలేచి యటకరుగ నొల్లవు ఇట్లే కొందఱు మనుష్యులును తమ తెలివి తక్కువ వలన దమకే కీడు చేసికొనుచుండెదరు ఈ గ్రుడ్డివాని కొడుకులును నీ వర్గములోని వారే యైయుందరు.

కేశ– అయితే మనమేమయిన దానము చేయబలయుననిన నెట్లు చేయబలయును?

లక్ష్మి– మన పొరుగునున్న జగన్నాథరావు గుమాస్తాను నీ వెఱుగుదువుగదా? ఆయనకుఁ బదిరూపాయల వేతనము గలదు. ఆయన కుమారుఁడగు రాముఁడును మన యింట వార భోజనమునకు వచ్చునచ్యుతుఁడును నీ స్నేహితులే అయితే నీకొక పావలా నేనిచ్చినచో నీవీ యిద్దఱిలో దానినెవరికినిచ్చెదవు?

కేశ– నేను దానినచ్యుతునికే యిచ్చెదను. వాఁడు రామునికంటెను బీదవాఁడు.

లక్ష్మి– పావలా లేనందున నచ్యుతునకుఁ గలుగు నష్టము రామునకు గానేరదు. వాని తండ్రి యేలాగైనను వానికి పావలాను దెచ్చి యిచ్చును అచ్యుతునకట్టి వారెవరును లేరు. ఇది గాక మనమిచ్చునది దురుపయోగమునఁ బడక సదుపయోగమున ఖర్చుగుటకై మనము దానమెవరికి నిత్తుమో వారి సుగుణ దుర్గుణములను గూడా గుర్తెఱుగ వలెను. ఈ గ్రుడ్డివానికొడుకు లిరువురును దనసంపాదనకుఁ గావలసిన బట్టలు మొదలైనవి తెచ్చుటకు వారే ప్రయత్నింప వలెను. పిల్లల సంరక్షణకు దల్లిదండ్రుల నీశ్వరుడు నియమించి యుండగా వారకై నమేమల యియ్యవలెను. ఇట్లిచ్చుట న్యాయము కాదు.

కేశ– అమ్మా! ఆ పావలాను నెవర్వికి నియ్యవలెను?

లక్ష్మి– అయితే పావలానెవరికైన నియ్యవలెననియే కదా? నీతలంపట్లయిననే నిప్పుడే దానిని నీకెచ్చెదను. సాయంత్రమచ్యుతఁడు రాగానే వానికిఁ దానినిమ్ము వానికీ నెలబడి జీతమున కది పనికి వచ్చును. దానితో వాఁడొక నెల విద్యనభ్యసించి కొంతజ్ఞానము వడయును.

తల్లి జెప్పిన హితబోధ మనసున నాటి యాచిన్న వాడఁధిక హర్షమును బొందెను. సొంతపొట్టబోసుకొను కొడుకులను సోమరులను జేయు గ్రుడ్డివానికి డబ్బులిచ్చుట కంటెను నచ్యుతునికిచ్చుటయే శ్రేష్ఠమని వానికిఁదోచెను. అంత వాని

యానందమినుమడింప దల్లి యిచ్చిన పావలాను తన పెట్టెలోఁదాచి యధిక యుత్సాహముతో నచ్యుతునిరాక కెదురుచూచుచుండెను. నాటిఁ దినమా బాలకుడు తల్లి చెప్పిన విధమున సత్పాత్రదానము చేయుదునని సంతోషముతో దినము గడిపి సాయంత్రమూ పావలాను నచ్యుతునికెచ్చెను.

దీనిని జదువ గలిగిన స్త్రీలు తమ బిడ్డలకు లక్ష్మీదేవమ్మవలెనే సత్పాత్ర దానము నేర్పురుదురు గాక.

–హిందూ సుందరి, 1902, ఆగసు

# స్త్రీవిద్య

## (భార్యభర్తల సంవాదము)

ఇంతకు ఱేపే మీ ప్రయాణము నిశ్చయపఱచినారా? ఱేపటిదినముండి యెల్లుండి పోవుటకు వీలులేదా?

ఇఁక నీవు నీ పిచ్చి బలవంతములు మాను. నేను ఱేపే వెళ్ళవలసిన యావశ్యము కలదు.

ఇంక నేను మిమ్ముల నుండుమని యననుగాని మీరు పోయినది మొదలు మూడు నాలుగు దినములకొకసారి తప్పక తమ క్షేమముఁ దెలుపుటకైనను మఱవకుండుటకు వేడెదను. తమ కుశల వార్త తెలియకుండిననిట నాకెంత మాత్రమును దోఁచదు.

మంచిది నీ యిష్ట ప్రకారమే వ్రాసెదను. గాని నీవు నీ కుశలమును నాకెటులఁ దెలుపుదువు. నా క్షేమమును దెలిసికొనవలెనన్న నిచ్చ నీ కుండునటులనే నీ స్థితిని దెలిసికొనవలెనన్న కోర్కె నాకును నుండును గదా?

ఇందుకు నేనేమి చేయను? నాకు మీ వలె చదువు వచ్చియుండినను నిత్యమును సంతోషముగా నుత్తరములు వ్రాసియుందును. ఇప్పుడయినను నేనప్పుడప్పుడూ నా తమ్మునిచేత వ్రాయించి పంపెదను.

నీకే చదువు వచ్చి యుండిన నీ తమ్ముని నాశ్రయింపవలసిన యావశ్యకము లేకయే నీవు నీ మనోగతమును నాకు వ్రాయగలిగి యుదువు గదా? నేను నీకు నుత్తరము వ్రాయ దలచినను దానిని జదువుటకు నీవు సమర్థురాలవయి నందువలన నా మనసునందలి సంగతులను బూర్తిగా వ్రాయజాలను. నేను వ్రాసిన జాబులోని సంగతలు నీకుఁ దెలియవలెననిన నీ వితరుల నాశ్రయింప వలసినదానవే కదా? వివాహమైన దినము నుండియు విద్య నేర్చుకొనుమని నీకెన్ని విధముల బోధించినను నీవు వినిన దానవు కావు.మొదట చిన్న పిల్లయని యనుకొంటిని కాని నీవు బుద్ధి తెలిసిన పిదప సహితము బాల్యపు బుద్ధులను విడువవైతివి. ఇకనైనను విద్య నేర్చెదవా? నీ ముష్కరత్వమునే ధృఢపడునటుల జేసెదవా?

మీరిట్లు కోపము తెచ్చుకొనిన నేనేమి చేయుదును? నాకును లోకములోని స్త్రీలవలె విద్యనభ్యసింపవలెనన్న యాస యప్పుడప్పుడు కలుగుచుండును. గాని మా నాయనమ్మ యాడువారు చదువు నేర్చుకొనగూడదనియు జదివిన స్త్రీలు తమ భర్తల ఆయువును హరింతురనియు ఇది శాస్త్రములలో నున్ననదనియు జెప్పుచుండును.

ఇంతేకద వెనుకటి వారి మనసులలో లేనిపోని కల్పనలు పుట్టుచుండును. విద్య నేర్చినచో స్త్రీలు భర్తలను గోలుపోవుదురన్న భయం కలుగుచున్నది. ఈ మాటలు ముసలమ్మల వాక్కులలోనివేకాని శాస్త్రములలోనివి కావు. శాస్త్రములలో నాడవారు చదువుకొనవలెననియే యున్నది. చెన్నపురి కేగిన వెనుక నీకొఱకొక మంచి పుస్తకము పంపెదను. ఇంతలో నీవు నీ తమ్ముని దగ్గిర చదువు నేర్చు చుండుము.

ఈ మాట మరీ బాగున్నది! నాకు జదువుకొనుటకంటేను వేఱే పనిలేదా?

నీవు వేఱుపనులు మానుమని నేననలేదు. గృహకృత్యముల నాడువారు చేయక తప్పదు. నీవు నీపనియైన పిదప నిరుగు పొరుగులతో వ్యర్థ ప్రసంగములు చేయు కాలమునందే విద్యనభ్యసింపుచుండిన నెంత బాగుండును? విద్య నేర్చినందున గలుగు లాభములును నదిరానందువలన గలుగు నష్టములును నీకు గొన్ని దెలియును. అయినను నీకింకను జదువునందాసక్తి కలుగకుండుట వింతగానున్నది.

ఎందులకా చదువు? భర్తకు నుత్తరములు వ్రాయుటకేనా? మేము మీ వలె కచేర్లకు బోయి యుద్యోగములు చేతుమా? చదువు ముక్కలు నాలుగు నేర్చినతోడనే యిరుగు పొరుగు వారలు నవ్వుదురు. నిందింతురు. తిరస్కరించుటకైనను వెనకదీయరు. స్వల్పలాభముల కాశపడి యిన్నికష్టములకేల లోబడవలెను? మనమైనను నెల్లకాలము విడివిడిగా నుందుమా? చాలా దినములుందు మనుకునినను రెండు సంవత్సరముల కంటె నుండము తదనంతరము నాకీ చదువు వలని లాభమేమి?

ఇట్లనుట నీకు సహజమే. విద్యవలని యుపయోగమును, దానివలన గలుగు లాభములును బూర్తిగా నీవెఱుగవు. ఇట్టి నీ యజ్ఞానమునకు విచార పడవలయునే గాని నవ్వరాదు. ఇంచుకయినను విద్యామృతపానము నీకిదివఱకు లభించియుండిన నిట్టి పిచ్చి విచారములకు నీమనసున చోటు కలుగునా విద్య నేర్చినచో కచేర్లకుంబోయి యుద్యోగములు చేయుట, నుత్తరములు వ్రాయుటకు వేఱు ప్రయోజనమేమిగలదని నీకు దోచుటయుక్తమే కాని నీవు.... నాలోచించి చూచిన దీనియందలి దోషము నీకే తెలియును. అక్షరములను వ్రాయను జదువను నేర్చునంతమాత్రమున నరులు విద్యావంతులు కాజాలరు. అనేకులు వ్రాసిన ఉద్గ్రంథములను జదివి వాని

తాత్పర్యమును గ్రహింపగల వారలే విద్యాయుతులనబడదురు. ఇట్టి విద్యవలన బుద్ధి వికసించుట. అనేక సద్గ్రంథములలోని యమూల్యంబులగు నుపదేశ వాక్యంబులు మనసున నాటి మనుజుల నుదాత్తవంతులను గాజేయును. వారి యందలి దుర్గుణపుంజములు పోయి సద్గుణపరంపర లాస్థానమునలంకరించును. లోకానుభవమును గనుటకు వారలు విశేష యోగ్యులగుదురు. అనేక లోకవార్తలు నెఱుగ గలిగిన వారలగుదురు. కొన్ని పుస్తకముల పఠనమువలన మనమునుకాహ్లాదము కలుగును. ఇందువలన సంసారమునందలి యసంఖ్యాతములగు దుఃఖముల నొక్కింత మఱచి జనులానందింపగలరు. విద్యవలన నిట్టి లాభము లింకను బెక్కుకలవు. నీవు పట్టుదలతో జదువు నేర్చి కొంత చదువుకొనిన పిదప భోజన శయనాదులనైన నొల్లక చదువునందే యభిరుచి కలిగియుందువని నేను దృఢముగా జెప్పగలను. అన్ని యానందములలో విద్యానందమే శ్రేష్ఠమనిన వాక్యము నిజమని నీవే తెలిసికొనెదవు. ఇది యిటుండనిమ్ము ప్రపంచమునందెల్లప్పుడును పత్నిపతికి సహాయురాలై యుండవలయును. గాన భర్తకు సహాయురాలగు పత్ని విద్యనేర్చినంగాని తన కర్తవ్యమును బూర్తిగా నిర్వహింపజాలదు. పెనిమిటి దినమంతయు శ్రమపడి యింటికి వచ్చిన పిదప నింటి యందలి యనేక లెక్కలను నాతడు వ్రాయనక్కర లేకయే విద్యావతియగు సతి తానే వ్రాయును. అందువలన భర్తకు గొంతయైనను విశ్రాంతి కలుగును.

"చదువు రాకున్న... లెక్కలను జ్ఞాపకముంచుకొనలేదూ?"

అవును మీరింటి లెక్కలను గొన్నిటిని జ్ఞాపకముంచుకొనెదరు. గాని వాని ననేక పర్యాయములు తప్పుచుందురు. విద్య వచ్చినవారట్లు తప్పుట సంభవించదు. చాకలివాడు బట్టలుతుక దీసికొని పోయినచో మీరు వాని సంఖ్యను రెండు పదులు నాలుగని జ్ఞాపకముంచుకొనెదరు. వాడుతికి తీసికొనివచ్చిన బట్టలను మీ జ్ఞాపక ప్రకారము లెక్కించి తీసికొనెదరు. గాని వాడొకకోటు బదులింకొక తలగడ సంచి నధికముగా దెచ్చినచో తెలుసుకొనజాలరు గదా? ఇట్లే పాలవాడు పాలిచ్చిపోయినచో నిత్యము మీరు గోడమీద నొక గీటు గీయుదురు. ఆ గీతల నడుమ మరెవరయిన నింకను గీతలు గీచిన నాకేమి తెలియగలదు? ఇదే కదా మీ గణితము మీరు విద్యావంతులయినచో నిట్టి యిబ్బందులును వ్యత్యాసములును నేలకలుగును?

ఇదంతయు నిజమే కాని యాడువారలు చదువుకొనగూడదని శాస్త్రములో బూర్వులేల వ్రాసియుంచిరి?

ఇట్లయిన విద్యరానందువలన గలుగు నష్టములనింకను జెప్పెదను విను, నీకే చదువు వచ్చి యుండిన శాస్త్రములో నేమి వ్రాసియున్నది నీవే చదివి తెలిసి కొనజాలి యుందువు. నేనిదివఱకు జదివిన శాస్త్రములలో ఎక్కడను స్త్రీలు చదువగూడదనిన మాట లేదు. బహుశా యే శాస్త్రములోను నిట్టి సంగతి యుండదని నా తాత్పర్యము. మీ నాయనమ్మతోటి కొందఱు పిచ్చి నమ్మకము కలవారలు తాము విన్న మాటలు నితరులకు జెప్పుచుందురు. వీరి మాటలను విను మీవంటి వారలు శాస్త్రములను జూడబోరుగాన నీయంధపరంపర వలననే మన దేశము నందనేక నింద్యములగు నాచారములు శాస్త్ర సమ్మతములను తలపున జేయబడుచున్నవి. కాని మా మాటలు శాస్త్రములలో నున్నవా లేవాయని చూచు దిక్కులేదు. ఈ సంగతుల వాస్తవము నెఱుగదలచువారి సంఖ్యయత్యల్ప మైనదిగానున్నను శాస్త్రములో నున్నదని పామరులను భ్రమియింపజేసి వారిచేననేక దుష్కర్మలను జేయించు పండితోత్తములును మనదేశము నందనేకులు కలరు. ఇందువలన దమరు చేయుకార్యము మంచిదా చెడ్డదాయని విచారించి తమకు పరమేశ్వరుడిచ్చిన సదసద్వివేకముల వలన దాని నెఱిగి దాని ప్రకారమే నడుచు వారిచట నంతగా గానరారు. ఇట్టి స్థితిజ్ఞానులయిన పురుషులయి యుండగా నజ్ఞానాంధకారములో నున్న స్త్రీలు మీరు మూఢత్వమును విడవకుండుట యొక వింతకాదు. అయినను మీరిక ముందు జ్ఞానాంధకూపము నుండి వెలువడి జ్ఞాన ప్రకాశమును సంచరింప బ్రయత్నింపవలెను. ప్రస్తుతము పురుషులకంటెను స్త్రీలు విశేష జ్ఞానసంపన్నులగుట యధిక యావశ్యము ఏలన నికముందు పుట్టబోవు వారి నున్నతపదవికి తెచ్చుట స్త్రీల యధీనములోనిదై యున్నది. తల్లి విద్యాహీనయు దుర్గుణమయినయిన నామె సంతానమంతయు నటులనే యగుటయు తల్లి విద్యావతియు సద్గుణవతియు నైనచో నామె సంతానము మిక్కిలి యోగ్యతను గాంచగల్గుటయు సహజము. తండ్రి గుణములకంటెను దల్లి గుణములే పిల్లలకు విశేషముగా నలవడుట యుక్తి యుక్తము. నీ స్థితియే చూడుము మీ తల్లియు ముత్తవ తల్లియు విద్య నెఱగని వారలయినందువలననే కదా నీవిపుడు వారి పిచ్చి యుపదేశములను విని విద్య నేర్చుకొనుటకు మనసొప్పక యున్నదానవు? ఇక ముందు నీకు బుట్టు పిల్లలును జదువుకొన విసుగు కలవారే యగుదురు. పిల్లలెపుడు నేయే సంగతులను ఉత్తమురాలగు నొక్క తల్లి తన పిల్లలకు కలుగు సద్గుణములు పదిమంది వుత్తమ గురువుల వలన గలుగ లేరని యొకానొక విద్వాంసుడు వ్రాసెను. గాన తమను నుత్తమవారి లీలను జేయుట కైనను దల్లులు విద్యావంతులగుట నావశ్యకము.

"నేను మీ యాశయములకు విరుద్ధముగా న డుతునా? నేను విద్యావతి యగుట మీకిష్టమే యనిన తేపటి నుండియే నేర్చుకొనెదను నాకు విద్య రాకుండి నేను మూర్ఖురాలిగా నుండినను నాకు పతి కంటె నన్య దైవము లేదనియు బతి యాజ్ఞను శిరసావహించి చేయుట నా ముఖ్య కర్తవ్యములలో నిదనియును గట్టిగా దెలియును. నాయనమ్మ కోపగించినను నిరుగు పొరుగు వారలు నన్నాక్షేపించి నవ్వినను నేను భయపడను. తమ యాజ్ఞప్రకారము చదువుకొని తమను సంతసింపజేయును."

"ఈ మాటలు నిజములేనా"

"అందులకు సందేహమేమి? తమ సద్బోధ వినినప్పటి నుండియు నేను పుస్తకముల నెప్పుడు చదువుదునాయని నాకు దొందరగానున్నది. ఇక నేనేనా చేతి యక్షరములతో దమకునుత్తరములు వ్రాసెదను. మీరు చెన్నపురికి బోయిన వెంటనే నాకొక మంచి పుస్తకము మఱచిపోక పంపవలెను. వ్రాసెదను గాని నేను వ్రాసే యుత్తరమును జాచి మీరు నవ్వెదరేమోయని భయముగా నున్నది.

"నీవు చదువు నేర్చుకొన మొదలు పెట్టిన వెంటనే నేననేక పుస్తకముల నధిక యుల్లాసముతో బంపెదను. నీవు మాత్రము పట్టుదల విడువక చదువు నేర్చుకొనుము. చదువుకొని నీవెన్ని దినములకు నుత్తరము వ్రాయ నేర్చెదవు?"

"ఆ మాట గట్టిగా నేడేనేనెట్టు చెప్పగలను? నీవు వ్రాసిన యుత్తరము పోస్టులో నుండి వచ్చి నాకందిన దినమెంత సుదినము! నాటి నాయానందమిట్టిదని నీ వెఱుగ జాలవు. ఇన్ని దినముల నుండి బోధించినబోధకు ఫలముగా జదువు నేర్చుకొనెదవని నీ వన్న మాత్రమున నాకపరిమితానందము కలిగెను. ఈ సమయమునందు నాకొక కల గానుపించుచున్నది.

నీవిచటనే యా యఱలో కాగితము కలము సిరాబుడ్డి తీసికొని నాకుత్తరము వ్రాయుటకు గూర్చుంటివి. నీచేతి కలము భయముచే వణకుచున్నది. నీ ముఖము భయము చేతను సిగ్గు చేతను మిక్కిలి వెలవెల బారి యున్నది. వ్రాయు నక్షరములు చిన్నవిగాను పెద్దవిగాను వచ్చుచున్నవి. వాని మధ్యమధ్య కొన్ని సిరాచుక్కలును గానుపించుచున్నవి. నాకు వ్రాయు నీ మొదటి యుత్తరము మంచిగా నుండవలెనని నీకెంత యుండినను నది వంకరటింకర పంక్తులలో నుండి నీకసహ్యముగానే కనుపించుచుండెను. దీనిని బంపుటకు నీవు సమ్మతింపక రెండవ కాగితముమీద దానినధిక శ్రద్ధతో వ్రాసియు విఫల మనోరథవైతివి. తుదకు విసిగి దాని నే లకోటాలో వేసి నీ తమ్ముని చేత పై చిరునామా వ్రాయించి పోస్టులో వేయించితివి. నీ స్వహస్త

లిఖితముగాని నప్పటి నా సంతోష సూచకమగు ముఖావలోకనమువలన నది నీ యుత్తరమైయుండునని తెలిసికొని చెంతనున్న నా మిత్రులు కొందఱు నన్ను పరియాచకము చేయుచుండిరి. వారి హాస్య వచనములను నేను వారించునటుల మాటలాడినను లోపల నాకు వారి మాటలానందకజనకములైయే యుండెను. నా ప్రియపత్ని చేతి పత్రికను నేను మఱలమఱల జదివియు దనవి చెందక పలుమారు చదువు చుంటిని. నా ప్రియ లేఖ నాకు జదివినప్పుడెల్ల క్రొత్త యానందము కలుగజేయు చుండెను. ఆహా! అది యెట్టియానంద సమయము? ఇదిగాక నేను మఱియొఖ కలను సహితము గనుచున్నాను.

నేను సుమతియను మన కొమారుని దీసికొని పడక గదిలో నొక కుర్చీమీద విశ్రమించితిని. నీ వచటి రెండవ కుర్చీమీద కూర్చుండి యొక మాసపత్రికలోని వ్యాసము చదివినాకు వినుపించుచుంటివి. నీవు మంజుల స్వరముతో జదువు దానాని వినియు, నీ ముఖమునందలి యానందమును గనియు నేను స్వర్గసుఖమునందున్నటుల నుంటిని. యిదికాక కలసహితము గనుచున్నాను.

నీవు సుమతిని సావిత్రిని దగ్గిరనుంచుకుని మిగుల వాత్సల్యతతో సాభిమానముగా వారికి జదువు నేర్పుచుంటివి. ఆహా! మన పిల్లలెంత సుస్వభావులు! వారి నమ్రతను సాజ్ఞాధారకత్వమును గనిన వారందఱును వారిని దగ్గిరకు దీసికొని ముద్దు పెట్టుకొని మాటలాడించి పోవుచుందురు. వారిని గొనియాడని వారు లేనేలేరు. పుత్రపుత్రికల సద్గుణముల నితరులు పొగడగా విని నీకు నాకును గలిగిన యనిర్వచనీయమగు నానందము వేయి జన్మముల యందపరిమితి పుణ్యమును గణించిన వారలకు గాని కలుగనేరదు. అప్పుడు మనసుగనిన వారెల్లరును వీరలు మానవ రూపములు దాల్చిన దేవతలని ప్రశసింపుచుండిరి.

" మీ మాటలన్నియు విచిత్రములే? మెలకువతో నున్నపుడే మీకి కలలన్నియు గానుపించుచున్న వాయేమి?"

"ఇవి నవ్వుమాటలు గావు. ఇప్పుడు నీకు నేనే జెప్పిన యీ స్వప్నములలోని సంగతులెన్నడయిన వాస్తవములగునా? లేక స్వప్నములోగని యానందింప వలసినదేనా?"

"వాస్తవములే యగును. తప్పక నిజములగును."

"నా గృహదేవతయన దగిననీవు నిజముగా సరస్వతివే. ఇట్టి నీ యాశీర్వాదము కలుగుటవలన నా స్వప్నములు నిజములగుట యొకవింత కాదు.

ఆఱు నెలలలోపల నీవు నాకుత్తరము వ్రాసెదవా?"

"ఏమిది! నీయుత్తరమును జూచినేను నవ్వుదునా? నీకింకను దెలియదు. పరస్పరానురాగముగల మనబోటి భార్యభర్తలొండొరులు ప్రేమపూర్వకముగా జేసి యే కార్యమేని నితరుల కదియల్పముగా దోచినను వారిలో వారికది యొక యమూల్యముగా దోచక మానదు."

"అయిదు నెలలయిన పిదప నేనుత్తరము వ్రాయమొదలు పెట్టెదను. మీరు మాత్రము చేరిన దినము మొదలు రెండు దినముల కొక తూరి తమ క్షేమ సమాచారము వ్రాయుట మఱువకుండవలెను. మీరు వ్రాయుత్తరములు గొలుసుకట్టుగా వ్రాయక విడివిడి యక్షరములతో వ్రాసిన నేను వానిని జదువ ప్రయత్నించెదను. సరేగాని మీరు త్వరగా రావలెను."

"పరీక్ష దినములు సమీపించినందున గట్టిగా రవలెనని చెప్పుటకు వీలులేదు."

"తప్పక రాగలను."

"నేను మీరు చెప్పిన మాటలన్నింటిని ఇక మీరు నేను జెప్పునది యొక మాట వినవలెను."

"అదేదో కొంచెము విననిమ్ము."

"దీపావళి పండుగకు దప్పక రావలెను."

"ఇదే కదా? అట్లే వచ్చెదను."

**–హిందూ సుందరి, 1902**

# ధనత్రయోదశి

ధనత్రయోదశి నాటి సాయంత్రం మేడుగంటలవేళ నెటు చూచిన నానందోత్సములతో బొంబాయి పట్టణము నిండియుండెను.

నాడు దీపావళి దినమున నగునంత దీపోత్సవము లేకుండినను ప్రతి గృహము నందును ఆ గృహము యొక్క యాకారమును సౌందర్యము నితరులకు జూపగలిగిన దీప మాలికలు వెలుగుచునే యుండెను. ఎటువిన్నను టపక్కాయల ఫటఫటధ్వనులు వినవచ్చుచుండెను. ఇంటింటను పళ్ళెరములలో స్వర్ణాలంకారముల నుంచి లక్ష్మీపూజలను జేయుచుండిరి. కాని, యొకయింట మాత్రమిట్టి నుత్సవ చిహ్నములేవియు గానవచ్చుట లేదు. దీని ఇల్లనుటకంటె కుటీరమనిన బాగుండును. ఈ కుటీరము గొప్ప సాహుకార్ల రెండుమేడల నడుమనుండే చెల్లెలు లక్ష్మీదేవి యుత్సవములను జూడవచ్చిన జ్యేష్ఠాదేవి మోమును చూచెను. ఈ యింటివలన బజారునకు శృంగారమొక్కింత తగ్గినను దీనియందలి పరిశుభ్రతను వ్యవస్థను గనినవారి మనములకు నుల్లాసము గలుగుచుండెనని మాత్రము చెప్పవచ్చును. ఇట్టి గొప్ప పట్టణమునందీయుత్సవ సమయమునందే ధనికుని వృత్తాంతమను జెప్పక మాకొక దరిద్రకుటుంబ వార్తను జెప్ప మొదలు పెట్టినదని నా ప్రియ సోదరీమణులు నాపై గోపగించెదరేమో? అక్కలారా! మీరట్లు వినువక నేను జెప్పబోవు కథను సావధానులరై వినినచో మీకీ గృహవార్తయే విశేష యుత్తమమయినదని తోచకపోదు.

నేను జెప్పిన కుటీరము యొక్క రెండు ప్రక్కలను గొప్ప మేడలుండినటులనే నిదివరకే చెప్పితిని. వానియందనేక దీపములు వెలిగింపబడియుండెను. అయితే మధ్యగల కుటీరము నందొక్క దీపమే వెలుగుచుండెను. దాని సమీపమునందు విజయలక్ష్మమ్మ కూలికి గుడ్డదెచ్చి పరుల రెవికలను గుట్టుచు గూరుచుండెను. ఆమె సమీపమున నాలుగు సంవత్సరముల బాలికయు, మూడు సంవత్సరముల ముద్దు బాలుడును గూర్చుండి తమ బాలికల జూపుచు దెలిసియు దెలియని ప్రశ్నలచే దమ తల్లి మనమున కానందము కలుగజేయుచుండిరి. విజయలక్ష్మమ్మ సాయంత్రపు వంట

చేసి పెనిమిటి రాక కెదురు చూచుచుండెను. ఆమె భర్త వెంకట సెట్టియను నొక సాహుకారునింట గుమాస్తాగా యుండెను. నేడు ధనత్రయోదశిగాన, సెట్టిగారి యింట లక్ష్మీపూజ కానిదే భర్తరాడని యెఱిగినదగుటవలన నామె పిల్లలకు భోజనములు పెట్టి (నిలబడి) రెవిక కుట్టుకొనుచు భర్త యాగమనమున కెదురు చూచుచుండెను. ఆహా! గ్రామమునందల జరుగుచుండిన యుత్సవమున నెంతమాత్రము జిత్తము లేక పడే కాయత్త చిత్తయై పెనిమిటి రాకను చూచుచున్న యా వనిత మొగమెంత మనోహరముగా నుండెనో? అట్టి సుగన్నులారంగనుం గొన్నవారలకే కాని యితరులకు దెలియజేసిన ఇట్లామె తన బాహ్య చక్షువులను మాత్రము కుట్టుచున్న రెవికపై నుంచి యంతశ్చక్షువులతో బెనిమిటి రాకను జూచుచుంగూర్చుండెను. ఇంతలో ముద్దుల బాలుండగు నామె కొమారుడామెను సమీపించి మెడను గట్టిగా గౌగిలించుకొని నందువలన నామె తన మనసును వానివైపునకుంద్రిప్పవలసినదయ్యెను. ఇంతవఱకామె వాడడిగిన ప్రశ్నలకెల్ల హూ, యనుచు నేదో యొక జవాబు చెప్పుచు దనపనిని జేసికొనుచుండెను. గాని బాలుడు తన ముద్దు హస్తములతో మెడకు బంధము నేయంగా నామె వెంటనే కుట్టుపనిని నవతలనుంచి పిల్లవానిని దగ్గిర నుంచుకొని బుజ్జగించి ముద్దు పెట్టుకుని నన్ను గన్న నాయనా! నీకేమి కావలెను? నీవక్కతో నింతవఱకాడుకొనుచుంటివే అట్లే యింక కొంచెమాడుకొనుము. నేను పరుల రెవికను గుట్టుచున్నాను. ఇది త్వరగా గుట్టవలెను అనెను. తల్లి నోటి నుండి మాటవచ్చిన వెంటనే యా సుగుణవంతుడగు బాలుడు లేచి యావలి కరిగెను. ఇంతలో బొరుగింట గాల్చిన చిచ్చుబుడ్డి వెలుగు వాని కగుపడినందున వాడు మిక్కిలి సంతోషముతో జేతులతో వెలుతురు జూపుచు గంతులు వేయుచు అమ్మా! అత్తల తమాసాగా యున్నది అక్కడతో జూలపోతానని తన ముద్దుమాటలతో దల్లినడిగెను. వాడు పోదునన్న స్థలము సమీపమైనందున విజయలక్ష్మమ్మ వెంటనే బిడ్డను బిలిచి రుక్మిణీ! నీవీ రాముడిని దీసికొని పొరుగింటనడుచుండిన వేడుక చూపి తీసికొనిరా. భద్రము సుమా దీపము వద్దకు దీసికొనిపోకు. అచట నెవరితోనేని తగువులాడకు అని చెప్పి పంపెను. వెంటనే యా బాలకులు పొరిగింటి వాకిటికి బోయిరి. ఇట్లు పిల్లలు బోవుచుండగా వారి తల్లి దుఃఖము కలిగి యామె యస్తమాను సత్రములవారిని జూచుచుండెను. పాపమామెకు దొలిదినము సంగతి జ్ఞాపకము వచ్చినది కాబోలు తొలిదినము వారు టపాకాయల పండుగకు గానెటులనో యామె వారిని సమాధాన పఱచెను. అప్పటి నుండి యా పిల్లలును మరల తల్లిని నడుగలేదు. తుదకు పొరుగింట టపక్కాయలు పిల్లలు

కాల్చుచున్నను నడుగక, యూరక చూచి వచ్చెదమా యనియడిగిన వారి సద్గుణమును గని యిట్టి మంచి బాలుర కోర్కెలు తీర్చుటకు తగినంత యైశ్వర్యము మనకు లేకపోయెను దగాయని తల్లికి మరింత దుఃఖము హెచ్చెను. ఉండుటకిల్లు మంచిదిలేదనిగాని, కట్టుటకు గొప్ప వస్త్రములేదని గాని పండుగనాడు పిండివంటలు చేసికొనుటకు వీలులేదనిగాని, యెన్నడును నామెకు చింత కలుగలేదు. ప్రతిదినము నష్టకష్టములతో గడుపుచున్నను నామె సద్గుణవంతుడగు భర్త సహవాసము వలన సంతోషముగానే కాలము గడుపుచుండెను. గాని, కడుపున గన్న బిడ్డల కష్టములను దలచుకొనినంతమాత్రమున నామెకపరిమిత దుఃఖము కలుగుచుండెను. ఆమె తాను విశేషవైభవము ననుభవించినదగుటవలన దన సంతానమున కిట్టి కష్టములు వచ్చెనని పొక్కుచుండెను. నిజముగా విజయలక్ష్మమ్మయు వెంకటరత్నమును జిన్నతనమున చాలా యైశ్వర్యమనుభవించిరి. కలకలూరు మల్లయ్యయను నొక యగ్రహారికునకు వెంకటరత్నమొక్కడే కొడుకు. అందువలన నాతని వివాహము పదవయేటనే విశేష యుత్సవముతో జరిగెను. తన కొక్క పుత్రుడైనందునను తాను గ్రామమునందతికంటె నధిక ధనవంతుడని మల్లయ్యగారీ వివాహమునకు విశేష ధనమును వారి వివాహమునకు బదుహేను వేల రూపాయలు ఖర్చయ్యెను. అయ్యెయ్యో వివాహమునకు బదుహేను వేల రూపాయిలు ఖర్చయిన దంపతులకిప్పుడు పదుహేను రూపాయలు కండ్లకగుపడుట బంగారమైనది. విచిత్రముగా నుండెను. మల్లయ్యగారి యగ్రహారమదివఱకే కొంత తాకట్టు పెట్టబడి యుండెను. అయినను వారియింట జరుగు కార్యములు పూర్వమువలెనే జరుగుచుండి నందున దినదినమునకప్పులు హెచ్చుచుండెను. ఇట్టి సమయమున నొక్కగానియొక్క కొమారుని వివాహము చేయవలసిన సమయము మించిపోవునని తలచి యతడింకను గొంత ఋణము చేసి వివాహము చేసెను.

ఈ ఋణమువలననే వెంకటరత్నము కిప్పుడన్నము దొరుకుట సహితము దుస్తరమై చిన్న పిల్లలు కష్టములకు వారు విచారపడవలసినంత దుర్దినము వచ్చినది. మల్లయ్యగారి జీవితమునందు మాత్రము ఋణస్తులెవ్వరును విశేష తొందర చేయలేదు. కాని ఆయన ప్రాణము పోయిన వెంటనే యందఱు నొక్కసారిగా వచ్చి కలదానిలో రూపాయికి నర్ధరూపాయి చొప్పున దమతమ బాకీలను దీర్చికొనిరి. పాపము, యుక్తవయస్సు రాకమునుపే వెంకటరత్నము గారికి దమ పెద్దల చాతుర్యమువలననో తెలివి తక్కువవలననో గలిగిన ఫలము ననుభవించవలసి వచ్చెను. వెంకటరత్నము

మిక్కిలి సద్గుణుండు. ఆయన పసితనము నందగ్రహారీకుల వైభవము ననుభవించినను వారి యందుండు దురభిమానము, ఉన్మాదము సోమరితనము మొదలైన వాయ్ని నంటినవి కావు. ఆయ్నకుందగినటుల భార్యయు సద్గుణవతియే దొరికింద్ను దన దరిద్రత కైయొకప్పుడాయనకు జింతగలిగిన భార్య యనుకూలతను జూచి దుఃఖము నొచ్చుచుండెను. తండ్రి చచ్చువఱకాయన ప్రవేశపరీక్షయందు మాత్రము కృతార్థుడయ్యెను. ఇంకను చదువుకొని విద్యాభివృద్ధి చేసికొనుటకు వయసున్నను ధనము లేనందున్న నాతడు వెంటనే యుద్యోగములో బ్రవేశించెను. ఉద్యోగము లాకాలములో దొరుకుటయే మిగుల దుర్ఘటము. ఇట్టి స్థితిలో నెటులనో వెంకట సెట్టి యనునొక గొప్ప సాహుకారు దగ్గర పదిరూపాయల వేత్నముగల గుమాస్తాగిరి దొరికెను. ఆ పదిరూపాయలతో వారెటులనో దినములు గడుపుచుండిరి. ఇట్టి స్థితిలో వారికి దమ బిడ్డలను గూర్చి విచారము కలుగుట సహజమే.

విజయలక్ష్మమ్మకు దన బిడ్డల స్థితిని గూర్చి విశేష దుఃఖము కలిగిందని పైన జెప్పితిని. అప్పుడామె కన్నుల యెదుట పూర్వపు వైభవమును అది నాశనమైన విధమును బ్రస్తుతస్థితివల్ల బిల్లలనుభవించుచున్న కష్టములు గానుపించెను. ఈ సంగతులన్నియు దలపునకు వచ్చినందుకామె దుఃఖము పొరలి పొరలి యాపుకొనశక్యముకాక వచ్చుచుండెను. ఇంతలో రాముని యేడుపామెకు వినపడినందున నామెదిగ్గున లేచి పొరుగింటివద్దకి బోయెను. అచటికీమె పోవునంత కచట నొక స్త్రీ రామునింగొట్టుచుండెను! ఆ చిన్నవాని తప్పిదము విచారింపగా నచటనొత్తిలేని టపకాయ నొకదానిని వాడెత్తుకొని విరిచి యటనున్న నొక దీపము దగ్గిర పెట్టెను. అందువలన నా దీపమారిపోగా నాయింటి పిల్లవాడు రామునిగొట్టి వాడి యేడుపు వినబడిన దల్లితనను గొట్టునను భయముచే వాడేతనను గొట్టెనని పెద్దపెట్టున నేడువసాగెను. వాని యేడుపు విని వాని తల్లి పరుగెత్తి వచ్చి తన పిల్లవానిని రాముడే కొట్టెనని తలచి వాని సుకుమారతనైనను జూడక గొడ్డును బాదినటుల బాదసాగెను. తమ పిల్లలను తామధికముగా గొట్టు తల్లులయినను వారినితరులు కొట్టుచుండగా జూచి సహింపజాలరు. ఇంక తానెన్నడు బిల్లలనొక దెబ్బయినను వెయ్యని విజయలక్ష్మమ్మ వంటి మాతకు దన పిల్లలనితరులు గొట్టుచుండగా జూచుట యెంతకష్టముగా నుండునో యట్టి తల్లులకే తప్ప యితరులకు దెలియుట కష్టము. ఆ సమయమునందామెకు బట్టరాని కోపము వచ్చెను. గాని వివేకవతియగుటచే నా సాధ్వి కోపమునంతను దిగమ్రింగి రుక్మిణిని రామునిని దీసుకొని యింటికి వచ్చెను.

ఆమె గృహమునకు వచ్చి పిల్లలను బుజ్జగించి సముదాయించెను. గాని యామె తన దుఃఖము నాపుకొనశక్తురాలు కాదయ్యెను. నోరెఱుగని తన పాపని నితరులు నిష్కారణముగా దండించుటకు దమ దరిద్రదేవతయే కారణముగదాయని తోచి యామె దుఃఖము కలిగెను. ఆమె తన ముద్దు పాపను శరీరమునందలి దద్దులను దడచి చూచి కన్నుల నుండి భాష్పధారలు గార్పంజొచ్చెను. అప్పుడామెకు సమాధానము చెప్పువారచట నెవ్వరును లేక యుండిరి. వెంకటరత్నముగారచట నుండినచో నామెకు సమాధానము చెప్పియుండును. చూడుడు! ప్రస్తుతము సహితము నామె దుఃఖము నాయనయే తగ్గించుటకు కారకుడయ్యెను. ఆమె భర్త యలికిడి వినిన వెంటనే తన దుఃఖమునంతను ననచుకొని సంతోషము ముఖమునందోపజేసెను. ఆహా! విజయలక్ష్మి! నీ సుగుణములిన్నియని వర్ణింప నాతరమా? పనిచేసి యలసి వచ్చిన ప తికి నీ దుఃఖము తెలిసినచో విశేష వ్యసనము కలుగునను తలంపుచేతగదా నీవు నీ దుఃఖమును మ్రింగి సంతోషమును ముఖమునందు దెచ్చుకొని ముద్దుపాపని నెత్తుకొని భర్త నెదురుకొంటివి? ఇట్టి సత్ప్రవర్తనమును స్త్రీలందఱు నవలంభించినచో మా దేశమున కెంత మేలు కలుగును. వెంకటరత్నము గృహమునకు వచ్చెనుగాని నిత్యము వలె నేడాయన ముఖము సంతోషముగా లేక మిగుల చిన్నవోయి యుండెను. ఆయన శరీరము నిండను చెమ్మట పట్టి యుండెను. నిత్యము నాతడు తనకెదురుగా వచ్చిన భార్యను నవ్వుచు బలకరించిగాని, కొమారుని ముద్దిడుకొనిగాని లోపలికి బోవుచుండును. నేడా గృహస్థుడెదురైన సతిసుతుల మాడక జూచుచు మౌనముగా లోపలికి వచ్చెను. భర్తను గాంచిన వెంటనే విజయలక్ష్మి నేడధికముగా పనియుండినందున నలసెనని తలచి యీ వేళ నిత్యముకంటెను శ్రమవిశేషమైనది గాబోలు ఏమీ యీ చెమట! యని తన పమిట చెఱుగుతో నాతని చెమటను దుడిచెను. ఇంతలో జంకనున్న పిల్లదానికి నిదుర వచ్చినందున వానింబరుండ బెట్ట వచ్చి యామె భర్తకు దుస్తులు విడచుటలో దోడుపడెను. దుస్తులు విడిచి పత్ని చేతికినిచ్చి యాయన మిక్కిలి చింతాక్రాంతుడై యచటనున్న పక్కచుట్టనానుకొని కూర్చుండెను. విజయలక్ష్మియు నాదుస్తులను నియమిత స్థలములనుంచి వచ్చి పతి చెంత గూర్చుండెను. కొంతసేపటి వఱకు భర్త మాటలాడనందున వింతపడి విజయలక్ష్మి యాయనకు దలనొచ్చుచున్నదని తలచి యిదేమి? నేడు మాటలాడరు? తలనొప్పిగా నున్నదా? యని సమీపమ్ము కరిగి తలపట్టి చూచెను. తలనొప్పి లేదని వెంకటరత్నమనెను. దాని యంతతో నా సాధ్వికి సమాధానము రానందున, తలనొప్పి

లేనిచో నేడిట్లుదాసీనముగా నుండుటకు గారణమేమి? ఈ ముఖమింత చిన్నబోయి యుండుటకు హేతువేమి యని భర్తనడిగెను. పత్ని నోటి నుండి వచ్చుమాట వినినతోడనే వెంకటరత్నముగారికి మిగుల విచారము కలిగి, నీకు మన యాదుస్థితిని దలచుకొనిన విచారముగా నుండదా? యని యడిగెను. బర్త వాక్యము చెవిన బడిన వెంటనే విజయలక్ష్మి గడియ క్రిందటి దుఃఖము జ్ఞాపకము వచ్చి విశేష విచారము కలిగి భర్తకు నట్టి దుఃఖమే యేదయిన గలిగి యుండునని యూహించి తన దుఃఖమునకంతను మహా ప్రయత్నమున నాపుకొని ముఖమునందు సంతోషమంకురింపజేసికొని ఇదే కద! ఇంత మాత్రమ్మునకు విచారమేల? నాకిందున్నగూర్చి విచారమేమాత్రమును లేదు. ఆహా నీవిట్టి దానవే. కాని మున్నపటి వైభవమును బ్రస్తుతపు స్థితియు తలచుకొనినచో నాకు జాల విచారముగా నుండును. దివ్యమందిరమున అష్టైశ్వర్యములనుభవించ్ని వారికి గుడిసెలో అష్ట దరిద్రముల ననుభవింపవలసి వచ్చెను గదా! నేడు లోకులందఱనేక యమూల్యములగు నలంకారముల నొకచోట నుంచి పూజింపుచుండగా రత్నాభరణములనేకములు దాల్చిన నీశరీరమున నొక్క బంగారపు గుండయినను బూజించుటకు లేకుండుట చూచి నీకెంత మాత్రము విచారముగా నుండదా?

విజ: నాకెంత మాత్రమును విచారముగా నుండదు. మనకు సంపద లేదని గదా మీరు విచారపడుట. సంపన్నులగు కొందఱికి గల గర్వమును, విచార శూన్యతయు జూచినపుడెల్ల మనస్థితియే నాకుత్తమమైనదిగా గానుపించుచుండును. సత్యమార్గమును విడువక నడుచుచుండుట వలన మనకగునమితానందము ధనవంతులమైనచో గలుగ నేరదు. నేనన్నచో తమ ప్రేమ యొక్కటి కలిగిన నితర సంపదలేమియు నొక లెక్కగాగొనను.

పత్ని పలుకులాలకించి వేంకటరత్నము కొంత యులికిపడెను. ఆయన చిత్తము బెదరినట్లు ముఖచర్య కానుపించెను. సత్యప్రవర్తకుండగు నాతని ముఖమునందొక విదమైన భయము కనుపించెను. అప్పుడాతడు ఱిచ్చవడి భార్యకేమి సమాధానము చెప్పవలయునో తోచక యుండి తుదకెటులనో ధయిర్యమవలంభించి ప్రియే! పొడి ప్రీతిని దీసికొని నీవేమి చేసెదవు? విజయలక్ష్మి కాయన సముఖమునందు గలిగిన భేదమేమియు దెలియలేదు గాని పతిమాటలవలన నామెకు దుఃఖము మాత్రము కలిగెను. అప్పుడామె మీరిట్టి మాటల వలన నామనసునకు దుఃఖమే గలుగ జేయుచున్నారు అనెను.

వేంకట: అట్టయిన నేను మాటలాడనులే. నీవు మనపిల్ల మనస్థితిని గూర్చి యెన్నడును విచారముగాను ఏదీపాప పండుగకు మంచి దుస్తులను ధరించుకొని నృష్టాన్నములను దిని సాయంకాల మానందముగా టపాక్కాయలను కాల్చుచుండగా వారిని జూచి మన బిడ్డలు దీన ముఖులై యుండగా జూచి యైనను నీకు దుఃఖముగా నుండదా?

విజ: ఇందుకు దుఃఖమేమి? నాకెంత మాత్రము విచారము లేదు సరేగాని నేడీ లేనిపోని ప్రసంగములు చేసి విచారించుచు లేనే దుఃఖము నేల కల్పించుకొన మొదలు పెట్టితిరి. మన పిల్లలేమయిన వస్తు వాహనములు తెమ్మని యడిగిరా?

వేంక. ఇందవులననే కద నా దుఃఖము విస్తరిల్లుట ఈ మాటయని యతడొకింత యూరకుండి గద్గద ధ్వనితో నేను నీకొకమాట చెప్పినట్టైన నీవు.... ఏమి లేదు. అని యాయన నాలుక గరచుకొని యేదో భంగకరమగు సంగతిని చెప్పబోయి శంకించువానివలె ముఖచర్యను జేసెను. విజయలక్ష్మి పాపమాయన చేష్టలను గని చేష్టలు దక్కియుండెను. కొంతవడికామె తెలివి తెచ్చుకొని మీరు నాకేమి చెప్పవచ్చితిరి యని యడిగెను.

వేంకటరత్నము చర్యను సిద్ధపఱచుకొని ఏమియు లేదు. పోనివ్వు నీవన్నదే సత్యము. లేనిపోని సంగతులు ముందిడుకొని వ్యసనమేల పడవలెను. అనెను. గాని యీ వాక్యముల నుచ్చరించునపుడాయన చెప్పబోవు నొక గుప్తమైన సంగతిని దాచుచుండి నట్లాయన ముఖచర్య వలన దెలియుచుండెను. గాని, కపటమేమియు దెలియని విజయలక్ష్మి కాతని కపటమేమియు దెలియలేదు. ఆమె తన భర్త వాక్యములనే నమ్మెను. ఇంతలో నాయననే నాకాకలియైనది నేడు విశేష శ్రమ చేయుటవలన విసుకు గానున్నది. త్వరగా భోజనము చేసి పరుండుదము! భర్త నోటి యీ వాక్యములు బయలు వెడలిన తోడనే విజయలక్ష్మి మడి కట్టుకొని భర్తకు వడ్డించి యాతడు తినిన పిమ్మట తాను భోజనము చేసి యింటి పని దీర్చి వెనుక పరుండబోయెను. అంతకుమునుపే వేంకటరత్నము నిదుర పోవుచుండెను. విజయలక్ష్మియు ప్రొద్దు పోయినందున కుట్టుపనిని చేయుచు గూరుచుండక తాను పరుండెను.

విజయలక్ష్మి కపటహీన యగుటవలన పక్కకి జేరిన వెంటనే నిదురపట్టెను. గాని, విచారగ్రస్థుడగు వేంకటరత్నము పైకి నిదురపట్టిన వాని వలె నభినయించినను నిజముగా నాటి రాత్రి యాతనికి నిదుర పట్టనే లేదు. నాటి సాయంకాలమున వేంకట సెట్టి గారింట జరిగిన సంగతియే రాత్రి యాతనికి సుఖనిద్రకు భంగము

కలిగించెను.

నాటి సాయంకాలము సెట్టి గారింట లక్ష్మీపూజగుటవలన వేంకటరత్న మచటనే యుండి యందుకు గావలసిన వస్తువులన్నియు జతపర్చుచుండెను. ఇంతలో నచటి పెద్ద గుమాస్తా వేంకటరత్నము నేకాంతముగా నొక చోటికి దీసికొనిపోయి రహస్యముగా వేంకటరత్నమా! నీవధిక బుద్ధివంతుడవని నేను నిన్ను నాకు సహాయకునిగా గోరెద. నేను నీకు జెప్పుసంగతిని నీ వితరులతో జెప్పనని ప్రతినచేయము? అని ముసలి గుమాస్తా మిక్కిలి మంచివాడును నమ్మదగిన వాడును ఆయననిది వఱకెఱిగినవాడు గాన, నీవు చెప్పునది యొరుల కెఱిగింపనని వేంకటరత్నము నమ్మబలికెను. అప్పుడా ముసలి గుమాస్తా వేంకటరత్నమా నేడు లక్ష్మీ పూజ దినమునకై తీసిన యనేకములైన యమూల్యాభరణములను జూచితివా? ఇవి యొక లెక్కలోనివి కావు. వీనికంటె వెయిరెట్లెక్కువ విలువగలవి వీరి దుకాణమునందున్నవి. ఇది నీ వెఱుగనే యెఱుగుదువు గదా? ఈ మాటల ధోరణియేమియు దెలియక వేంకటరత్నము అవును నాకు దెలియుననియెను.

పెద్ద గుమాస్తా: ఇది తెలిసినటులనే యీ ధనమంతయు నానమ్మకముననే యున్నదనియును నీకు దెలిసియే యుండును.

వేంకటరత్నము: అవును. సెట్టిగారికి మీ యందధిఖముగా నమ్మకముండినందున వారు తమ పెట్టెల తాళపు చేవులన్నియు మీకే యిచ్చిరి.

పెద్ద గుమాస్తా: ఇట్టి విశ్వాసము నాయందుండుట వలననే కదా నేను తలచిన కార్యము నిర్విఘ్నముగా నెరవేరునని నేను బూనినది.

గుమాస్తా మాటలను విని వేంకటత్నమునకు కొంచెమనుమానము కలిగెను. గాని యాతడింకను నేమి చెప్పునో యని తలచి వినుటకు నూరకుండెను.

పెద్ద గుమాస్తా: ఇంత సంపత్తిలోనిది మనమొక కొంత తీసికొనినది యొక తప్పిదము కాదు. అందువలన సెట్టిగారికిని నష్టము రాదు. మనకన్ననో దాని వలన మన దరిద్ర దేవత తొలగిపోవును ఇంత పెద్ద గుమాస్తాను నా కేబది రూపాయిలే గద జీతము నీకన్న వోపదియే ఇంత స్వల్ప జీతములో మన కుటుంబములను భరించుట మనకు దుస్తరము గదా? ఈ సంగతి వెలికి వచ్చునన్న భయము నీకక్కరలేదు. ఆ పూచీ నాది నేను జెప్పిన యీ సంగతి సంవత్సరాంతము లెక్కలకులోగా కావలెను. సాలాకరింక ఈ రెండే దినములున్నది. నీవే కనియెదవు? పెద్ద గుమాస్తా యీ మాటలు చెప్పునప్పుడు వేంకటరత్నమునకు గోపము వలన గన్ను

లెఖ్ఖవగుచుండెను. అందువల్లన నాతడు మాటల మధ్యనే గుమాస్తా నోరు మూయింపవలెనని చూచెను గాని యాయన పయధికారియు వృద్ధుడును నగుట వలన కోపమును మింగి యూరకుండెను. ఆ వృద్ధుని మాటయిన వెంటనే వేంకటరత్నము మొగమాటముగా అయ్యా కృష్ణమూర్తిగారూ? మీరు నన్నిట్లు వేళాకోళముల కడిగారు కాదు. కాని యిది వాస్తవమేయైనచో తమ నిశ్చయము నాకెంత మాత్రము సమ్మతము కానేరదు. మీకు మాట యిచ్చినందున గావలసిన నేనీ సంగతి నితరుల కెఱిగింపను అనెను. ఈ ధృఢవాక్యములను విని కృష్ణమూర్తిగారికి గల యుత్సాహమంతయు దగ్గినటులాతని చర్య వలనం దెలియుచుండెను. అయినను ధైర్యము విడువక ముసలి గుమాస్తా తియ్యని మాటల వలన వేంకటరత్నముగారి దరిద్రము నాతనికి గానుపించునటుల వర్ణించి యాతని భార్య పిల్లల కందువలన గలుగుచున్న కష్టములను వక్కాణించెను. సదా వాణిజ్యములో మెలగి నిపుణుడైన వృద్ధుడు తన దరిద్రస్థితిని హృదయద్రావకముగా నడుపునప్పుడు వేంకటరత్నము కన్నుల నుండి నీరు కారజొచ్చెను. ఆ కన్నీటిగని గుమాస్తా ఏమి? వేంకటరత్నమా! నేనన్నటులనే నీకుటుంబ స్థితి యున్నదా లేదా?

వేంకటరత్నము: కన్నులు దుడుచుకొనుచు అవును అటులనే యున్నది.

పెద్ద గుమాస్తా: అయితే నీ యిష్టము నేనన్న మాటకు సమ్మతించవు?

వేంకటరత్నము: ఛీ. కృష్ణమూర్తిగారూ! నాతో మీరిక మాటలాడకుడు మీ మాటలవలన నా మనసేమయిన జెడనేమో.

ఆ వృద్ధునకు మనుష్య స్వభావ లక్షణములు చక్కగా దెలిసి యుండినందున మనుష్యులను ఒకపారి యించుక దుర్మార్గపు వైపునకు దిరిగినచో మరల సన్మార్గమునకు జరుగుట మస్తరముగాన నీతని సంగతిని గూర్చి కొంత విచారణ చేయుటకు వ్యవధి కలిగించినచో మన కార్యము సఫలీకృతమగునని తలచి యాతడు మంచిది అటులనే కానిమ్ము నేనిప్పుడు నీతో మాటలాడను నీవే యీ రాత్రియంతయు నాలోచించుకొని ఱేపు ప్రొద్దున నాయింటికి వచ్చి నీ నిశ్చయమును దెలుపుము. ఈ దినములు దీపావళి దినములు మీ యింట పండుగకేమియు లేకుండెను. గాన నీ నూఱు రూపాయల నోటు నీకిచ్చెదను. వీటినివక్కఱలేదనక తీసికొనుము యని యాతడొక నోటును వేంకటరత్నము జేబులో నుంచెను.

దుకాణము నుండి యింటికి వచ్చు త్రోవలో నా గృహస్థుని మనమునందనేక విధముల విచార తరంగములుద్భవింపు చుండెను. వృద్ధుడగు నా గుమాస్తా చెప్పిన

చొప్పున జేయవలెనా చేయగూడదా? యన్న ప్రశ్నయాతని మనమును తొందరపెట్ట సాగెను. అట్లు చేయుటవలన దనవంశము యొక్క కీర్తికి భంగము కలుగునని యా మానవుని యంతరాత్మ తెలుపుచుండెను. ఇంతలో జతురుడగు కృష్ణమూర్తి బోధ జ్ఞప్తికి వచ్చి యాతడనినటుల జేయుటకు బరికొల్పుచుండెను. ఈ సంగతినే భార్యకు జెప్పబోయి యతడు తడబడి చెప్పకుండెనని బుద్ధిమంతులగు చదువరులిదివఱకు గ్రహించి యుండెదరు.

ప్రస్తుమాయన పరుండి కన్నుల మూసికొని నిదురబోయినవానివలె నభినయించినను నిదురపట్టక వెనుక నుదహరించినటులాతని మనస్సునందనేక విధములయాలోచనలు వచ్చుచు బోవుచుండెను. గానినేమి చేయుటకును నింకను ధృడనిశ్చయము కానందున నిదుర రాకుండెను. తుదకు వేంకటరత్నము భార్యకు నిదుర పట్టినదని తెలిసికొని యాగదిలో నిటునటు తిరుగుచుండెను. ఆ సమయమునందదాటున నాతనికి గుమాస్తా యిచ్చిన నోటు సంగతి తలంపునకు రాగా వెంటనే దానిని దీసి దీపము వెలుతురున నొక జాము చూచి యాలోచింపుచుండెను. అంత నాతని చిత్తమనందేదో యొక దృఢ నిశ్చయమయినటుల ముఖమునందగుపడెను. వెంటనే యాయన 'అవును యటులనే చేయవలెను. క్రిష్ణమూర్తి గారన్నది మన లాభమునకేకదా?' ఇంతలో నాతని దృష్టి నిదురించియున్న భార్య ముఖమువైపునకు బాఱెను. గానగడియ ఇకంద నాసాధ్వి పలికిన పలుకులాతనికి దలంపునకు వచ్చిన తొడవే యదివఱకైన నిశ్చయమంతయు మఱచి యా పురుషుడు 'నేనట్టి చెడు కార్యము జేసినచో సద్గుణరాశియగు నీమెకు మొగమెట్లు చూపగలను? ఛీ. ఇట్టి కార్యమె చెయ్యను' వెంటనే యాతనికామె వెనుకు ముందఱ పరుండి నిదిరించుచున్న బిడ్డలగుపడి యదివఱకు వచ్చినవివేకము బాఱదోలగా నతడు, ఈ చిన్ని పాలప కష్టములను జూడనోపనియును గాక నేను జేయదలచిన కార్యమితరులకు దెలియుట సంభవింపను? అని మరల నాతడు నోటును జూచుచు గూర్చుండెను. ఈ సమయమునందే కారణమువలననో విజయలక్ష్మికి మెలకువ వచ్చి లేచినందున నామెనుగని వేంకటరత్నము నిశ్చేష్టితిడై గోడకొరిగెను. ఆయన చేతిలో వున్న నోటు క్రిందపడెను.

విజయలక్షి నిదురనుండి లేచువఱకామె కీసంగతులగు పడుటవలన నా సాధ్వి మిగుల నాశ్చర్యమును విచారమును గలదియై పతిని సమీపించి ఇదేమిటి? అర్ధరాత్రిలేచి నేమి చేయుచున్నారు. సాయంకాలము నుంచి యేమిటో నాకు

జెప్పగూడదా? అనునంతలోనా కచటబడి వున్న నోటు కానుపించెను. దానింగనిన వెంటనే యామె హృదయము మెల్లగ రోదనస్వరముతో, అయ్యా! ఈ నోటెచటిది? దీనినెచటనుండి తెచ్చితిరో నాకు జెప్పగూడదా? నేడన్నియు దుశ్శకునములుగా యున్నవి. మీకు నమస్కరించెదను నాకీ సంగతి నించుక వినిపించుము.

వేంకటరత్నము ముదుసలి గుమాస్తా మాటలవలనం గొంత తెలివికలవాడయి నందున నాతడు తన భార్య మనసును ద్రిప్పయత్నించెను. గాని, యాతని ప్రయత్నమువలన లేశమైనను లాభము కలుగలేదు. మీదు మిక్కిలి యాతని మాటలను వినినప్పటి నుండియు విజయలక్ష్మి మనమున దిగులొందినందున నామె శరీరము వణకసాగెను. కోపాతిశయమువలన గన్ను లెఱ్ఱబాఱి వానిలో నుండి జలము రాదొడగెను. ఇట్టి కోపావేశమునందును నామె యితడు నాపతి యితనిని దండించు యుక్తము కాదను సంగతి మఱచినది కాదు. కాని యిట్టి సమయమున మనముపేక్ష చేసినచో నీతడు దుర్నడవడిలో బ్రవేశించి చెడిపోవనిగాననట్లు కాకుండ జేయుట కర్తవ్యమని తెలిసినది గాన నామె యూరకుండక కొంచెమావేశము తెచ్చుకొని ఈ నోటు తమరు న్యాయముగా సంపాదించి యుండరని నేనిదివఱకే యనుమానపడితిని. మీరిట్లు చేయుటకు హేతువేమి? నేనెన్నడైన నగలకనిగాని బట్టలకనిగాని మిమ్మల్నిబ్బంది పెట్టితినా? పిల్లలయిన దుబారా నేదేని తెచ్చుటకై కచ్చే చేసిరా అందువలన మీకీ దుర్బుద్ధి పుట్టెనా? అందువలననే మీకీ బుద్ధి పుట్టి యున్న నేను మీ పాదాల సాక్షిగా జెప్పదను. నేనెన్నడిక యడగను. పిల్లలనయిన నడుగనివ్వను. మాయందనుగ్రహించి మీరిట్లు చేయవలదు. సంగతి యొరులెఱుగజాలరని మీరనెదరు. గాని సర్వసాక్షియగు పరమేశ్వరుని మోసపుచ్చి మీరీ కార్యము చేయగలరా? ఇట్లు చేసిన పిదప మనస్సుపైనను బూర్వమువలె స్వస్థముగా నుండునా? కష్టపడి సంపాదించుకొనిన పది రూపాయిలను సుఖముగాదినినటుల నీ దొంగసొమ్మును దినగలమా’ దానిని మనము ముట్టినపుడెల్లనిది మీరు విశ్వాసదోషమువలనే సంపాదించి తినుమన్ననదేవ మనసు దెప్పుచుండదా? పరమేశ్వరా! తండ్రీ ఈ కార్యమును ఖానుపుటకు నేను శక్తురాలనుగాకున్నాను. నాకీ దరిద్రములో గలుగుచున్న పరమానందమిక దొరుక జాలదుగదా! యని యామె దుఃఖము నాపుకొనలేక యేడువసాగెను. దానింగని తెలివి తెచ్చుకొని వేంకటరత్నము దుఃఖింపుచున్న తన సతిని దగ్గఱకు దీసికొని యక్కున జేర్చుకొని సతీ తిలకమా! నీ సద్బోధవలన నామనము నందలి యజ్ఞానాంధకారము తొలగెను. నేనింక దుష్కార్యమెన్నటికిని జేయను. మనము

దరిద్రములో నుండియు సద్గుణము చేత గలుగానందము ననుభవించెదను. ఆహా! నాకిట్టి సచ్చరిత్రయగు కాంత లభించినందునే కదా నేనొక గొప్ప పాపము నుండి విడుదల గంటిని మత్ప్రాణ సమానమా! నీకు విజయలక్ష్మి యనిన నామమెంతయు దగియున్నది. నీవు నిజముగా నేడు విజయముబొందితివి. లోకులందఱు లక్ష్మీపూజ చేయుచుండగా నా దగ్గిర పూజించుటకు లక్ష్మి లేదని గడియక్రింద నేను జింతింపుచుంటిని. నా దగ్గిర నీ రూపముతో బ్రత్యక్షలక్ష్మియే యుండగా నాకా లోహమయ లక్ష్మితో బ్రయోజనమేమి? నేడు నేనీలక్ష్మినే పూజించెదను. అని వెపంకటరత్న మాస్వర్ణాలంకారహీనమైన సద్గుణాలంకారయగు విజయలక్ష్మి నిదమాలింగము చేత బూజించెను' ఆ సమయము నందు విజయలక్ష్మి కత్యానందము కలిగినందున నామె దేహము తెలియక భర్త భుజముపై నొరిగెను. తాను తనపతిని నిష్కారణముగా తూలనాడితినని యామెకధిక దుఃఖము కలిగెను. కొంతవడికా సాధ్వీమణి తెలివి తెచ్చుకొని మీరట్లు చెయ్యరుకదా? ఇది నిజమేనా? యని యడిగెను. వేంకటరత్నము వెంటనే నిజముగా జెయ్యనని మరల యామెను గౌగిలించుకొని నమ్మబలికెను. అప్పుడామె లేచి యాతని పాదములను గట్టిగా బట్టుకొనియెను. తన భర్త యేదో యొక గొప్ప సంకటము నుండి విడువబడిన తనకు లభించినట్లామెకుందోచెను. వేంకటరత్న మామెను లేవనెత్తగా సిద్ధాంత కరణులగు నాదంపతులు మిగతారాత్రిని సుఖనిద్రలో గడిపిరి.

రెండవ దినము నరక శతుర్దశి యగుటవలన నా కుటుంబీకులు తెల్లవారుజాముననే లేవవలసినవారలైరి. అప్పుడు విజయలక్ష్మి రుక్మిణిచేత బర్తకును గుమారునకు మంగళ హారతులిప్పించి మంగళస్నానములు చేయించెను. ఇంతలో దెల్లవారినందున వేంకటరత్నము భార్య ప్రేమతో తన చేతనుంచిన బెల్లపు ముక్కను దిని దుస్తులను ధరించుకొని మొదట కృష్ణమూర్తిగారింటికరిగెను. అచటికిబోయిన వెంటనే వేంకటరత్నము నోటు నాతని ముందర వేసి మీ యాలోచనకు నేను సమ్మతింపను దయచేయుడని తన పనికిబోవుచుండెను. గాని కృష్ణమూర్తి యాతనిని బోవనియ్యక కూర్చుండబెట్టి నేను లోపలినుండి వచ్చువఱకిచటనే యుండుమని చెప్పి యతడు లోపలికి బోయెను. ఆయన యట్లు చేయుటకు హేతువేమొ తెలియక వేంకటరత్నము విచారించుచుండెను. ఇదియును గాక, తొలిదినము వేంకటరత్నమిందులో ప్రవేశించనని చెప్పినప్పటివలె కృష్ణమూర్తి నిరుత్సాహుడుగాక ప్రస్తుతమధిక హర్షమును బొందినటుల గానుపించెను. దీనినన్నిటిగూర్చి విచారింపుచు

వేంకటరత్నమామా గుమాస్తా రాక కెదురుచూచు చుండునంతలో దన యజమానుడగు వేంకట సెట్టియు కృష్ణమూర్తియు దన దగ్గిరకు వచ్చుచున్నటులాతనికి గనుపించెను. వెంటనే యజమానునకు నెదురుపోవుట కాతడు లేవగా నింతలో సెట్టిగారే యాయనను సమీపించి వేంకటరత్నమా! శాబాసని వీపు తట్టెను. అందుపై సెట్టి వేంకటరత్నమును గని నీవు మిక్కిలి తెలివికలవాడవు. పాటువడు స్వభావముగలవాడవని తెలిసికొని యట్లే నీవు సత్యప్రవర్తకుడవవుదువో కావో పరీక్షింప నెంచి నేనీ కృష్ణమూర్తిగారికి చెప్పి యిటుల జేయించితిని. నీవు నా పరీక్షలో నుండియు దుర్ఘటమగు దరిద్రమునుండియు దేరితివి. నిన్న నీ మనసొకింత మెత్తనయినటుల గానుపించెను. గాని యది నీదోషం కాదు. నీ దరిద్రదేవత దోషమే యగును. చెడు కార్యమెన్నడును జేయనివాని కంటెను జెడుకార్యము వైపుల కొకింత మనసు తిరిగి వివేకియైన వాడే యుత్తముడు. మొదటివానిచేత తప్పిదము జరుగును. గాని రెండవవానిచేత బొత్తిగా తప్పిద మగుటయే సంభవింపదు. నిన్న నీకిచ్చిన నూఱు రూపాయిలు నీవే వానిని నీవు నీయుదాత్త గుణముల వలన బడిసితివి. రెండవది నిన్ను నేటి నుండియు నిఱవది రూపాయిల వేతనము నిచ్చి కృష్ణమూర్తిగారికి సహాయునిగా నుంచెదను. అది యంతయు విని వేంకటరత్నమూరకుండ జాలడయ్యెను. ఆయనకు దనస్తుతి వినుటయు నిష్టము లేక తొలిరాత్రి జరిగిన దంతయు నచట సవిస్తరముగా వినిపించెను. దానిని విని వేంకటసెట్టి పరమానంద భరితుడయ్యెను. ఆయన వెంటనే తన భార్యకు జెప్పి విజయలక్ష్మిని బిలిపించి అమ్మా! నీవు నిజముగా విజయలక్ష్మివే. ఇట్టి నీవు నాధర్మకన్యకవని మన్నించెను.

నాటి నుండి నిజముగా వేంకటసెట్టి విజయలక్ష్మిని స్వకన్యకగా భావింపుచుండెను. వేంకటరత్నమామె నొక దేవతను గానెంచి ప్రేమించుచుండెను. ఆ దంపతులట్లు తమ ధైర్యము చేతవడసిన సంపద నధికారముగా ననుభవింపుచున్నవారు.

(హిందూ సుందరి, నవంబరు, 1902)

# భార్యాభర్తల సంవాదము

**(నగలనుగూర్చి)**

"మంచిది కాని నేను బంపిన పుస్తుకములు నీకు మట్టినవి గదా? వానిలోని నీతి కధామంజరిఁ జదువ నారంభించితివా? నేడు నీకొఱకు నేను సత్యవతీ చరిత్రయను నొక యుత్తమ గ్రంథమును దెచ్చితిని"

ఇదిగో ఇక్కడనే యున్నది నిన్ననే నేనీ నీతికథా మంజరిలోని "కాకి యిరుకు మూతి చెంబు" అను కథ చదివితని.

"ఓహెూ! చెప్పకనే పోతివి! ఈ మూడు నెలలలో మొదటి పాఠ పుస్తుకమును ముగించి రెండవ పాఠ పుస్తకము జదువుచునే నీవిదిన్నీ చదువగలిగితివా! ఇంతలో నీవింత విద్యనేర్చెదవని నేననుకొనలేదు"

ఇందులో వింత యేమిమి? కాకి స్వప్రయత్నము వలన దనదాహము నార్చుకొన జాలినదనగా మానవ జన్మమెత్తిననేను మీ యుపదేశముబొంది పట్టుదలతో నీ ప్రయత్నము చేసిన నింతలోఁజదువుటకు రాకుండునా? ఇది పోనిండు మీరీతడవ నాకొఱకుఁ జెన్నపురి నుండి యేమేమి తెచ్చితిరి?

చెప్పున కేమున్నది నీవు కోరిన సరిగంచు చీరె తెచ్చుటకు నాకు వీలుపడలేదు. ఈ తేప వచ్చునపుడు తెల్లజరీ చీరెయుఁబట్టు రవికయుఁ దప్పక తెచ్చెదను.

నా కవి యక్కరలేదు. ఉత్త తెల్ల చీరెయుఁ బట్టు రెవికయు మాత్రమెందుకు? మీకు నాయందపేక్ష కలదేని యీ తేప చెన్నపురినుండి వచ్చునప్పుడు మంచి రవల దుద్దులను దప్పక తేవలెను. నేను మొన్న మా యూరి మునసబుగారి కోడలు చెవుల జూచితిని. అప్పటి నుండియు నాకా దుద్దులు తెప్పించుకొనవలెనని బుద్ధిపుట్టినది దానిఁదెచ్చెదరా?

"రవల దుద్దులా? దానిని నేనెటుల తేగలను"

అదంతయు నాకేమి తెలియును నాకొఱకు దుద్దులను మాతమ్రు మీరు తప్పకుండా తేవలెను.

ఇదేనా నీ చాతుర్యము? ఇంతే నా నీ పతిభక్తి భర్త రవల దుద్దులను

దేగలడో లేడో యన్న విచారమే నీకు లేదు దుద్దులను ధరియించు సరదా మాత్రము నీకున్నది.

నాకు తామేమో బంగారు తొడుగు తొడిగినట్టును అందుతో తృప్తి నొందక నేను రవల దుద్దులనడుగగా వానిని మాత్రము తాము తేజాలనటులను మాటలాడుచున్నారు. ఆ మునసబు గారి కోడలికి నత్తవారును బుట్టినింటివారును జేయించిన నగలను మీరెన్నడైన జూచినఁదెలియును.

ఆవిడ నగలను నేను జూచినందున గలుగు లాభమేమి? అలంకారములను దాల్చి విశేష సౌందర్యము గలిగి నన్నానందింప జేయువాని యాభరణములనే నేను జూడగోరెదను.

దానికి మీరు నగలే చేయించకుండిన నది వేనిని ధరియించి మిమ్మానందింప జేయును.

ధరియింపకేమి? నీకు గల సొంత నగలెన్నియో కలవు. నీవు వాని నీవలకు దీసి శుభ్రపఱచుకొని దరియించినచో నీ స్వరూపమెంత మనోహరముగా నుండును.

అయ్యో ఎంత బడాయి. పెట్టెలకొలది నాకేమో నగలున్నటుల నేను వానిని మెఱుగు పెట్టి యొంట నుంచుకొననటులను జెప్పుచున్నారు, ఆ నగల పెట్టె లెక్కడున్నవో నాకెఱిఁగింపుడు.

నీకు నగలు లేవనియేనా నీ తాత్పర్యము? ఇతర స్త్రీలకు గల నగలన్నియు నీకును గలవు. నీవు వానిఁదోమి మెఱుగిడి వాడుకలోనికి దేకుండిన నా నేరమేమి?

ఉన్న నగలను మీరు ముందుగా దెల్పుడు.

చెప్పెదవిను. వినయము, నమ్రత, లజ్జా, సుశీలత, శాంతము, సత్యము, దయాళుత్వము, పరోపకార చింత మొదలయినవింకను ననేకాలంకారములను బరమేశ్వరుడు నీకు దయతో నొసంగియే యున్నాడు. నీవు వీనిని గడయ మెఱుగిడి ధరియించుటకు స్వతంత్రురాలవై యున్నావు కాని నీవీ యాభరణములను ధరియింపకుండిన నేనేమి చేయను.

అయ్యో నాదశ ఇవేనా నగలు. ఇంకేమో చెప్పుదురని యట్టె వినుచుంటిని.

ఈ నగల సంగతి నీవు బొత్తిగా మఱచితివా?

సరె. ఈ మాటలకేమి లెండి.

ఇది నవ్వులాటల మాటకాదు. స్త్రీలకు వీనిని మించిన యమూల్యాభారణములుండగలవా? బంగారు మొదలగు వాని నగలన్నియు ...ములు

కావు. వాని వలను గలిగెడి సౌందర్యమును క్షణికమైనదే. స్వర్ణ, రత్నాభరణములను ధరించుట వలన నీ రూపమును లోకులెన్నిదినములు పొగడెదరు. స్వల్పకాలములో నష్టమగు నీతారుణ్యము గడచి ముది..చ్చినచో ముసలమ్మ కందము కావలసి వచ్చినదని లోకులపహాస్యములు చేయుదురు. సద్గుణాలంకారములున్నచో నీ యావజ్జన్మమును సౌందర్య యుతము గావించుటయే గాక నీ మరణానంతరమునందును దమ కాంతివలన ననేక యుగముల వఱకు నీ కీర్తిని జనులకెఱిగింపగలవు. పరమ పతివ్రతయగు సీతాదేవి యీ లోకమును విడిచి యనంతకాలమైనను నామె కీర్తి లోకమునందిప్పుడును బ్రసిద్ధియే. సావిత్రీ దేవియుఁ బరలోకమున కేగి బహుకాలమైనను బ్రజలామెకీర్తిని వేనోళ్ళ గొనియాడుచునే యున్నారు. ఇందునకు గారణములు నేనే జెప్పిన సుగుణ భూషణములే.

' మీముందు నోరెత్త భయము! వెంటనే నానోరు మూయింతురు' నేనంటినని ననుకొనక నీవేవిచారించుకొమ్ము. నశాశ్వతమగు నీ ప్రపంచమునందీ బాహ్య సౌందర్యమెన్ని దినములుండగలదు. చూచుచుండగానె సుందరముగా గానుపించుచుండు ఈ దేహము క్షణములో భస్మమయిపోవును. నేడొక క్షణికమగు సౌందర్యమును జూచి మోహింపఁజేయరూపము రేపటి దినముండదు. అట్టి వారి యందెంత ప్రేమయుండినను మనమనేక కష్టములకోర్చియు వారినింబదయ నేరము. ఇంద స్వర్ణ రత్నాభరణముల వలనను, దివ్యాభరణంబుల వలనను గలిగెడి లాభమేమి? ఏ స్త్రీ, పాతివ్రత్యమును నమూల్యాంబరమును గట్టి దయా, క్షమా, వినయము మొదలగు కాంతిమంతములను నలంకారముల నెల్లప్పుడు ధరియించియుండునో, ఆ స్త్రీ సౌందర్యమెన్నటికిని దరగదు. ఇంతియకాదు. ఈ సౌందర్యము చిరకాలము నుండి యనుదినమును నభివృద్ధి బొందుచుండును. ఈ నగలే నలంకృతులైన కాంతలీలోకమును విడిచినను వారి దివ్యాలంకార కాంతి దీర్ఘకాలము వఱకును జనులను వశపర్చుకొనుచుండును.

ఇట్లయిన నేనిక రెండవసారి మిమ్ములను నగలు చేయింపడనియడుగను లెండి సరేనా?

నీవు నన్ను నగలడిగినందువలననే నీ యుపన్యాసముఁ బ్రారంభించితినని నీవనుకొనకుము. నేను జెప్పబోవునది యేదన స్త్రీలైనను బురుషులైనను బాహ్య సౌందర్యమును లెక్కగా గొనక యంతః సౌందర్యమునే వడయుటకు బ్రయత్నములు చేయుచుండవలెను. స్త్రీలు, వినయవతులును, దయాళువులుగను, సదాచారనలును,

సద్వర్తనగలవారుగను నుండవలెను. సువర్ణ రజిత, రత్న, మౌక్తి కాభరణముల కంటెను నివి వారి యందమును హెచ్చించును.

"ఇట్లయినచో నిదివఱకు నగలను జేయించిన వరందఱు మూర్ఖులేనా"

నీకింకను నామటలకర్థమే స్పష్టముగా దెలియులేదు. యువతులు రత్నాభరణములను బొత్తిగా ధరియింపగూడదని నా తాత్పర్యము కాదు. పరమేశ్వరుడధిక ధనవంతులనుగా బుట్టించినచో వారు తమ యిష్ట ప్రకారము స్వర్ణరత్నాభరణములు చేయించినందున దోషము లేదు. కాని నిజమైన సౌందర్యమున గలలో నిమిడి యున్నదని యనుకొనుట మాత్రము తెలివి తక్కువయే గనుక నగలు లేనివారు వానికై వృధాగా జింతించుటయు వానినపేక్షించుటయు, మూర్ఖతయేయని మాత్రమందఱును చెప్పగలరు. నీకు శకుంతల కథ తెలియునా?

" ఈ కథను నేను మొన్న మా నాన్నగారు చదువగా వింటిని"

తపోవనములో శకుంతల యుండగా జూచి యామెను దుష్యంతునంతటి చక్రవర్తి వరించి నప్పుడామె శరీరమున మణిమౌక్తికాభరణములుండెనా?

వనములోనుండువారి కాభరణము లెటుల లభించును.

అట్లామె స్వర్ణాభరణ విహీనయయియుండినను దుష్యంతునకామె యందనురాగము కలుగుటకు నామె కప్పుడుండిన సుగుణ భూషణములే కారణములని నీవనుకొనలేదా? ఈ సద్గుణాభరణములను ధనవంతులు దరిద్రులు, వనవాసులు, గ్రామవాసులు, ననుబేధము లేకందఱును సమానముగా నలకంరించుకొనుటకు స్వతంత్రయు ధనమును గలిగియే యుందురు. వీని ముందు స్వర్ణరత్నాభరణములు తుచ్ఛములని చెప్పుటకేమి సందియము?

అటులైన నేనిక ముందు మీరు చెప్పిన సద్గుణాలంకారములనే సంపాదించి ధరించుకొన బ్రయత్నించెదను. మీ యుపదేశమును విని నేనిక నెన్నటికిని స్వర్ణరత్నాభారణములలోపంబు నొక లెక్కగా గొనను.

సద్గుణాలంకారములవలన నలంకృతలైన వారిని వర్ణించుటకే భాషయందును దగిన శబ్దములు లేవనియే చెప్పవచ్చును. ఇకనైనను మనదేశపు స్త్రీలు ఈ మాయా నగలకై పరితపించక స్వప్రయత్నమున దొరకు సుగుణాలంకారములనే వడయ నపేక్షించినచో మనదేశమన్ని దేశములలో నెన్నిక కెక్కుట కెంత మాత్రము సందియము లేదు.

–హిందూ సుందరి, జూలై?, 1903

# అద్దమును సత్యవతియును

మూడెడ్లు వెళ్లని సత్యవతి తల్లితోఁగలసి నాలుగు దినముల క్రిందనే మానమామ గారిటింకి వచ్చియుండెను. ఆచిన్నది యొక దినమింట నందఱును దమ తమ పనులలో నుండగా మేడమీదనున్న మేనమామ గదిలో దానొక్కర్తయు నాడుకొనుచుండెను. అంతనొక కొంత సేపటికా బాలిక దృష్టి యచట నున్న టేబిలు వైపునకు దిరిగెను. కాని దానిపై నున్నవస్తువులను జూచుటకు వీలు లేకుండెను. అందునకొకింత చింతించిన సత్యవతి తన బుద్ధిబలమువలన నొక యుక్తిఁబన్ని తన కోరికను కొనసాగించు కొనదలచెను. ఆమెకు దోచిన యుపాయమన్ననో బల్లకు సమీపముగానున్న కుర్చీ నెక్కి బల్ల మీదనుండు వానిని జూచుటయేగాని వెంటనే మాయెతానా కుర్చీ నెక్కి నిలువబడెను. అట్టి చమత్కారమును దానెన్నడును జూడ లేదు గాన నాచిన్నది సమస్తమును మఱిచి దానిని చూచుచుండెను. అప్పుడామెకెదుట తనను బోలిన బాలిక యొకర్తె యగుపడి విశేషాశ్చర్యమును గలుగ జేసెను. సత్యవతియా బాలికను జూచుచు గొంతసేపూరక నిలుచుండగా నాబాలయు కదలకున్నటుల సత్యవతికగుపడెను. రెండవ చిన్నది యిట్లు తనను జూచుట కిష్టపడక సత్యవతి మూతి వంకర చేయగా రెండవ పిల్లయు నటులనే చేసెను. అప్పుడు సత్యవతి నాలుక బైటికి, దీసి వెక్కిరింపగానదియు వెక్కిరించెను. అందుకలిగిన సత్యవతి ముఖము ముడుచుకొనగా నా శిశువు సహితమటులనే ముడుచుకొనెను.

ఉండు పిల్ల నీ పని పట్టించెదనని సత్యవతి కన్నుల చేతను మూతితోడను, చేతులతోను ననేక విధముల వెక్కిరించెను. గాని రెండవ చిన్నది వెనుకంజవేయక సత్యవతి చేష్టలన్నిటిని తానున్ను చేసి యా బాలిక కోపమును హెచ్చించుచుండెను. ఇట్లు కొంతసేపు జరిగిన వెనుక సత్యవతి కదిక కోపము వచ్చుట వలన నా పిల్లను వెక్కిరించుట మానవలసినదాయెను!సత్యవతి తానేమి చేసినను రెండవ పిల్లతననేమియు చేయకుండ వలెనని యెంచుచుండును. గాని యటులగుట మాత్రము సంభవించలేదు. అందుకు  మనంబధిక కోపాయ్తుంబు కాగా, సత్యవతి, మంచిది నన్ను నీవింత వెక్కిరించెదవా నీ పని పట్టించక పోనులే ఇప్పుడే నేనుబోయి మా అమ్మమ్మను

బిలుచుకొనివచ్చి నిన్ను కొట్టించెదను, భయపడి పారిపోకుమా, అని కుర్చీదిగి యతివేగముగా ముత్తువ తల్లిదగ్గరికి పరుగెత్తెను. కోపాటోపముతో నురుకునపుడు పడి కాలికి దగిలి మన సత్యవతి మెట్ల నుండి పడెను. గాని యాపడుట వలన కలిగిన బాధ సహితము సత్యవతి కాసమయమున దెలియలేదు. రెండవ సమయమునందా పాటునకామె గంట సేపు ఏడిచి తల్లికి విసుగు పుట్టించి యండును. సత్యవతి క్రిందికి వచ్చిన వెంటనే పనిచేయుచున్న ముత్తువ దగ్గరికి బోయి అమ్మమ్మా, ఓ అమ్మమ్మఅ! ఎవరో చెడ్డపిల్ల మన మేడమీదికి వచ్చి నన్నూరికే వెక్కిరించుచున్నది చూడవే. నీవు రానాతో చూపించెదను. నాపిల్లని కోపపడి యూరకుండక బాగా కొట్టు?

"పిచ్చి పిల్ల లేనిపోని కబురులు చెప్పకు" మన ఇంటికీ సమయమునందే పిల్ల వచ్చును.

'కాదే నిజముగానే వచ్చినది. నీవు చూడు' నేనబద్ధమాడను' అబద్ధము కూడదని మా యమ్మ చెప్పినది. దబ్బునరా. ఆ పిల్ల పారిపోతుంది.

ఇట్లు కొంతసేపు తొందరపెట్టి పిలచినందున సత్యవతి ముత్తువ తను జేయుచున్న పనిని విడచి మనుమరాలితో మేడపైకి బోదలచినదాయె. అచటికి బోయిన పిమ్మట నట నేదిని గానక ఆమె ఏదే పిల్ల? లేని పోనీ మాటలు చెప్పి క్రిందనుండి నన్ను దీసుకొని వస్తివి. పని చెరుపుల పిల్ల. అట్లామె యనుచుండగానే సత్యవతి తిన్నగా కుర్చీ నెక్కి నిలువబడి బిగ్గరగా ఇదిగో చూడు ఇక్కడ దాగున్నది. యనెను. ఆ మాటలు విని పై వైపు చూచి నామె నవ్వాపు కొనలేక కొలది సేపు నవ్విన పిమ్మట మనుమరాలితో "సత్యా యిది అద్దము నీవు దీని నెఱుగవా" నీవు దీని యెదుట నిలుచుండి నందున నీ రూపమందు లోననగుపడుచున్నది. మంచిది మొట్టమొదట నీవు వెక్కిరించితివో లేక యీ చెడ్డపిల్ల వెకింరించెనో చెప్పుము.

నా కేమి జ్ఞాపకము లేదు కాని నేనే మొదలట్లు చేస్తిననుకొందును.

నీ వే చేస్తివి గాని యా పిల్ల చెయ్యలేదు. తెలిసినిదా ఇప్పుడు నా మాట విను. నీ వాపిల్లను జూచినవ్వుము. ఆ పిల్ల నవ్వునో లేదో చూతము. సత్యవతి ముత్తవ చెప్పిన చొప్పున నవ్వగా ఆ పిల్లయు నవ్వెను. అది చూచి సత్యవతి యాశ్చర్యమును సంతోషమును గలిగెను.

సత్యవతి యిప్పుడొక గృహిణియైయున్నది. ఆమె తల్లి తల్లి యీ లోకమును విడిచి పోయి బహుదినములయినది. కాని సత్యవతికి చిన్ననాటి అద్దపు మాట

మాత్రము మఱుపునకు రాదు. ఆమె తనయనుభవముల వలన ముసలమ్మ తనకు జెప్పిన మాటల వలనను ఈ జగమంతయు నొక యద్దమనియు మనము దాని పైనున కోపముగా చూచిన బ్రతిబింబము కోపముగా, సంతోషముగా దానింగనిన బ్రతిబింబము సంతోషముగాను కనిపించును. .....ట్టి ప్రవర్తించుచుండును ఇంతే కాక ఆమె యీ మాటల నితరులకును బోధించుచుండును.

–హిందూ సుందరి, సెప్టెంబరు, అక్టోబరు, 1903

# బీద కుటుంబము

(ఈ క్రింద నుదహరించబోవు కథ నిజముగా జరిగినదే. ఒకానొక ప్రసంగవశమున నా స్నేహితురాలగు శ్యామలాంబ నాకీ సాధ్వీ వృత్తాంతము నిట్లు చెప్పెను)

"కొన్ని సంవత్సరముల క్రింద మా పొరుగునగల యొక కుటీరములో నొక వితంతు కాంత తన యాఱుగురు పిల్లల తోడఁ గాపురముండుటకై వచ్చెను. ఆమె స్థితి యప్పుడధిక గోచనీయముగా నుండెను. ఆమె పేరు వెంకమ్మ. ఆ వెంకటమ్మ భర్తకు బదిరూపాయల వేతనముగల నుద్యోగముండెను. ఆ పది రూపాయలు కుటుంబ సంరక్షణకు జాలనందున వెంకమ్మ తానును గష్టపడి విసరి దంచి కొంచెము ధనము సంపాదించి సంసారము గుట్టుగా గడుపుచుండెను. కాని భయంకరమగు మృత్యుదేవత మిగుల నిర్దయురాలై యామె భర్తను తనకడుపున కాహారముగా గొనిపోయెను. ఇందువలన నామెకు గలిగిన దుఃఖమిట్టిదని చెప్పనెవ్వరి శక్యము! ధనవంతులకు పదిరూపాయిలనిన నొక గొప్పగా గానుపించకుండినను బీదవారికవి పదివేలవలె నుండును. ప్రియ భర్త వియోగమును దరిద్ర దేవతాగమనమును జూచి యత్యంత యుద్వేగము కలిగినను వివేకము కలదికాన నీ వెంకమ్మ ధైర్యమవలంభించి భర్త దినవారాది కర్మలు తీరిన వెంటనే రూపాయి యద్దెగల మునుపటి గృహమును విడచి పావలా బాగిగగల మా యింటి పొరుగు కుటీరమునకు పిల్లలతో వచ్చి ప్రవేశించెను. పాప మా వెంకటమ్మకు ఁగొంచెమైనను సహాయము చేయుట కత్తింటఁగాని, పుట్టినింటఁగాని బంధువులెవ్వరును లేకుండిరి. ఆమెకు పొరుగున నుండి వచ్చిన నాటినుండి మేమామె వర్తనమును జక్కగాజూచు చుంటిమి. ఆమె యహెూరాత్రములు కష్టపడి యితరుల గోధుమలు మొదలగునవి విసరియు, బియ్యము మొదలగునవి దంచియు నందునకు వారిచ్చు కూలితోఁ దనబిడ్డలను గాపాడు కొనుచుండెను. మేమే రాత్రివేళ మేలుకొనినను వెంకమ్మ యింటి దిరుగలి చప్పుడు వినవచ్చుచుండెడిది. ఆమె నిద్ర యెప్పుడు పోవునో మాకు దెలిసెడిదే కాదు. మా

యింటి పిండియు నామెయే విసరుచుండెను గాన గోధుమలు తీసికొని పోవుటకును, బిండియుచ్చుటకును నామె మా యింటికి వచ్చుచుండెను. అప్పుడామె మా యింట వ్యర్థ ప్రసంగములాడక తన పని నతిత్వరితముగా నెరవేర్చుకొని పోయెడిది. కారము, పసుపు, అటుకులు మొదలయినవి దంచుటకు నేను బిలిచినచో నామె వచ్చి సంతోషముగా నా పనిచేసి యందుకై నేనిచ్చిన కూలీని తీసికొని వెంటనే యింటికి బోవునుగానీ, పనిలేనిది యొక గడియైనను మా యింట నిలిచెడిదికాదు. ఇంతియకాక పనిలేని సమయమునందు నేనొకదినమామెను బిలువనంపగా " పనిగల సమయమందు వస్తునుగాని పనిలేనప్పుడు నేను రాజాలనని" యామె నాకు మొగమాటము లేక బదులు చెప్పి పంపెను. అది విని వెంకమ్మ మిగుల గర్విష్ఠి యని నేనెంచి యామెపై గోపించితిని. అంతటితో నూరకుండక నేను నా భర్తను సాయంత్రమింటికి వచ్చిన వెనుక వెంకమ్మ గర్విష్ఠియని చెప్పి యందున కుదాహరణముగా నా పిలుపున కామె రాకుండుటను చెప్పితిని. అది విని నా భర్త కొంచెము యోచించి నన్ను జూచి " నీవు బొత్తిగా వివేక హీనవుగా నున్నావు. నీవలెనే బీద వెంకమ్మదిఁగాడ వ్యర్థముగా గాలము గడుచపుటకు దీరునని తలచెదవు. నీకు నీ భోజన నిమిత్తమయినను శ్రమబడనక్కరలేదు. వెంకమ్మయన్ననో తన పొట్టతోఁగూడ నింక నాలుగురు బాలురను రక్షించవలసి యున్నది. అట్టితో నామె నీవలె కాలము వ్యర్థబుచ్చినచో నెట్లు వారినందఱిని గాపాడును! ఈ ప్రకారము నడుచుట వలన నామె తన కర్తవ్యమును జక్కగా నెఱుగునని నాకుఁదెలియుచున్నది. ఆమె గర్విష్ఠియని తలచి నీవామెను ద్వేషించుట మిగుల యవివేకము" అనెను. అప్పుడు మావారు చెప్పిన మాటలు వలన వెంకమ్మ యందు నాకు గల వైరభావము పోయి యామె యందెంతయు గౌరవము గలిగెను. అయినను నేనది వెలిబుచ్చక యెంతపనియున్న నొక గడియయైనను దీరకుండునాయని నాలో నేను సణుగుకొని యూరకుంటిని. అ మఱు నాటి నుండియు నేను వెంకమ్మకు జేతనగు సహాయము చేయుచుంటిని. తదనంతరమెన్నడును నేనామెను పనిలేనిది పిలిచి యెఱుగను. వెంకమ్మ యెన్నడును పనిచెయ్యనిది నావలన నిసుమంతయు సహాయము పొందినది కాదు. తనకు పరమేశ్వరుడిచ్చిన అవయవములు బాగుండగా నితరుల వల్ల నిష్కారణము సహాయము పొందుట దోషమని యామె చెప్పుచుండెను. ఆ సాధ్వీమణి తనలేమి నెప్పుడుగాని యితరులకు దెలుపలేదు. వెంకమ్మ కుమాళ్ళప్పుడు నాలుగు, తొమ్మిది, పదునొకండు సంవత్సరముల ప్రాయమువారయి యుండిరి. కొమార్తెలు ఏడు, ఐదు, రెండు

సంవత్సరములవారుగా నుండిరి. ఈ పిల్లలెప్పుడును నితరుల నొక వస్తువు యడిగి యెఱుగరు. దీని నిదర్శనము నేననేక పర్యాయములు చూచితిని. వారి మాటలును మిగుల సౌమ్యములైనవిగానే యుండెను. మా పిల్లలు పగలు మూడుగంటలకు గొంచెము ఫలహారములు చేసి బడికి పోవుచుండిరి. మా పిల్లల ఫలహార సమయమైన వెంటనే వారితో నాడుకొనుచున్న వెంకమ్మ బిడ్డలు తమయింటికిఁ బోవుచుండిరి. వారెన్నడును మా పిల్లల భోఝన సమయమున మా యింట నుండుటగాని, ఇతరులిచ్చిన పదార్థము నెన్నడైన దీసికొని కాని యెఱుంగరు. ఒక యాదివారము న భార్త యింట నుండగా వెంకమ్మ బిడ్డ లిద్దరును, నాలుగు సంవత్సరముల బాలుడును మా యింట నాడుకొను చుండిరి. అప్పుడు మూడు జాములైనందున నేను మా కుటుంబీకుల నిమిత్తమై అరిసెలు, ద్రాక్షలు మొదలైనవి తీసికొనిపోయి మావారి ముందుంచితిని. అది చూచిన వెంటనే మా పిల్లలాట విడిచి తండ్రి సమీపమునకు వచ్చిరి. కాని వెంకమ్మ పిల్లలు దూరముననే యుండిరి. వానిఁగని మేమిరువురము వింతపడి యొక అరిసెయు, కొన్ని పండ్లును జేతపట్టుకొని వారిలో జిన్నవాడగు బాలునింబిలిచితిమి. వాడును మిగుల నాసక్తితో చేయి జాచెను. నేనా పదార్థములను వాని చేతిలో వెయ్యనుంకించగా నా బిడ్డడు తేలకుట్టినవాని వలె తటుక్కున చెయి వెనుకకు దీసికొని 'నాకదియక్కరలే'దని చెప్పెను. అది చూచి నాకు వారి తల్లి యొక్క శిశు పోషణత్వమున కధిక విస్మయము కలిగెను. అప్పుడా పిల్లవాని చర్య చూచి వేసిన పదార్థములు దీసికొనుమని బలవంతము చేసి యంతకును వాఁడు దానిని తీసికొనకపోగా వానిని బట్టుకొని నోటిలోఁబెట్ట నుంకించితిని. కాని వాడది చూచి యొక వేటున నా పట్టు వదలించుకొని తన యింటికి పోవుటకు ఁబయలుదేరెను. అందుపై నేనే వాని యక్కను బిలిచి దీనిని నీ వైనను దీసికొనుమంటిని. అందు కాపిల్ల యిది నాకక్కరలేదు పరుల యింట నెప్పుడును దినకూడదని మాయమ్మ నాకుఁజెప్పినదియని తానును బోవనుంకించెను. అప్పుడు నేనా పిల్లను గట్టిగా పట్టుకొని నీ విది తీసికొనుము మీయమ్మ నిన్నేమియు ననకుండ నేనామెతోఁ జెప్పెదనంటిని. అందు కాచిన్నది 'నేనిది తీసుకొనుట మా యమ్మకు దెలిసెనా ఆమె నాతో మాటలాడదు' అని చెప్పెను. అందుపై నేనా చిన్నదాని మనసు కనగొనవలెనని మీ యమ్మకీ సంగతి నెవరు చెప్పుదురు అనగా నా బాల యిరులేల చెప్పవలెను? నేనే చెప్పెదను అని చెప్పెను. దాని మాటలు వినిన పిదప మంచిదని యాబిడ్డనింటికిఁ బోవిడిచితిని. దాని తమ్ముడును, అక్కయు నంతకు పూర్వమే తమ యింటికిఁ బోయిరి. నేను

విడిచిన వెంటనే యా కుఱ్ఱది వలలో నుండి విడువంబడిన లేడివలె నొక్క పరుగున నింటికిఁ బోయెను. ఆరు సంవత్సరముల నిండని చిన్నదాని యీ గుణములను జూచి నాకు గలిగిన సంతోషము మింతఅని చెప్పనలవి కాదు. ఈ సంగతి మరియొకరు నాకు, జెప్పినచో నది యసత్యమని నేనని యుందును. గాని నేను ప్రత్యక్షముగా జూచిన యీ వార్తను నేనెంత వివరించినను నాకుఁ దనివి తీరదు.

ఆ పిల్లలు కట్టుగొను బట్టలు ప్రాతవియు, ముతకవియు నైనను వారి బట్టలు మురికిగా నెన్నడు యుండగా మేము చూడలేదు. పై నుదహరించిన సంగతి జరిగిన నాటి నుండియు నేనును నా భర్తయు నాకుటుంబీకులపై విశేష దృష్టియుంచి వారి ప్రవర్తనల జూచుచుంటిమి. ఒక దినము పెద్ద పిల్లను వాద్దికిఁ బిలిచి ప్రసంగ వశమున వారింటి సంగతి నంతయు దెలిసికొంటిని. అది యెట్లనిన పిల్లల బట్టలన్నియు నా పిల్లయే నిత్యము చక్కగా నుతికి యారవేయుచుండెను. అదికాక యా కుఱ్ఱది నాలుగు దినముల కొకసారి యింటి గుడ్డలన్నియు జవిటి మట్టితో నుతుకుటలోఁదల్లికి సహాయ పడుచుండెను. వారెన్నడును దమ బట్టలుతుకుకుగాని కుట్టుటకుగాని ద్రవ్యము వ్యయపెట్టినవారు కారు. వారి కత్యావశ్యకములైన పిల్లల యంగీలు మొదలైనవి యెంకమ్మయే కుట్టుచుండెను. ఆమె పిల్లల యంగీల బొందెలూడినటుల మేమెన్నడును జూడలేదు. పిల్లల వలన నొకానొకప్పుడేదేని యపరాధము జరిగినచో వారితోఁ దల్లి కొద్దిసేపు మాటలాడకుండుటయే వారికి గొప్ప శిక్షగా విధింపబడుచుండెను. ఈ శాసన మాలకులకు మిక్కిలి యసహ్యకరముగా నుండెను. ఆ చిన్నదాని మాటలవలన వారి తల్లియన నొక దేవతయే యని నాకు దోచెను. ఆమె దేవతయే కాకుండిన నట్టి దరిద్ర స్థితిలో సహితమిట్టు తన సంతానము నెట్లు పెంచగలదు? ఆమె వలె నీవును బ్రవర్తించి నీ సంతానమున కట్టి మర్యాద, నీతి, జ్ఞానములను నేర్పుమని నా భర్త నన్నెప్పుడు అనుచుండిరి. అందువలన నేనును జేతనగునంతవఱకు వెంకమ్మయనుసరణమునే జేయ యత్నింపుచుంటిని.

ఇట్లు మేము కొంతకాలము గడచినవెనుక నొక దినము రాత్రి నాకాకస్మికముగా గడుపునొప్పి ప్రారంభమైనది. నేనపుడు గర్భవతిగా నుండి నెలలు నిండకుండినందున ..డినీతిని. రాత్రి సమయమగుట వలన మా పిల్లలందఱును నిద్రపోయిరి. నాదగ్గర నెవరైన లేనిది నా భర్త మంత్రసానిని బిలుచుటకు పోవీలులేక నా దగ్గర వెంకమ్మ నుంచి తాము వెళ్ళుటకుగాను వెంకమ్మను బిలువ వెళ్లిరి. అప్పుడు వాకిలి మూసిలేనందున నిరాంతకముగా లోనికి బోయిరి అప్పుడు చిన్నపిల్లలు

సమీపమున నిదురింపు చుండగాఁ బెద్దపిల్లలు తన సమీపమున గూరు&ండి బడిపాఠము చదువుచుండ నా సాధ్వీ తానొక సద్గ్రంథమును జదువు చుండెనట. అట్టి సమయమున నా భర్త వెళ్లి పిలువగా నామె పుస్తకమును మూసి మాయింటికి వచ్చెను. ఆమె వచ్చు వఱకే నా నొప్పి కొంత తగ్గెను. వెంకమ్మ వచ్చి కొంచెము చికిత్స చేయగా నా నొప్పి బొత్తిగా పోయెను. వెంకమ్మను బిలువబోయినప్పుడు మనసునందొక విచారము కలిగియుండినందున నాభర్తకామె యింటి స్థితి యప్పుడంత వింతగా నుండలేదుగాని నాకు స్వస్థత కలిగిన పిదప నంతకు బూర్వము తాము చూచిన దానినిఁ దలుచుకొని వారశ్చర్య పడాసాగిరి. నాటి వఱకు వెంకమ్మకు జదువు వచ్చుననిన సంగతియే మాకుఁ దెలియదు. ఆమె తన పిల్లలు చదువునపుడు వారి పాఠములను శ్రద్ధతో నినుచుండుటను జూచినది మొదలు నాభర్త యంతకుఁబూర్వ మెన్నడు లేకుండినను పిల్లలు చదువు సమయమునందొక గడియ యచటఁగూర్చుండి వారికిఁబాఠము చెప్ప నారంభించిరి.

సాధ్వీమతల్లియగు వెంకమ్మ గూర్చిన సంగతులెన్నియో గలవు. కాని యవన్నియు చెప్పజూచినచో నీ దినమంతయు జాలదు. నాకును నది చెప్పుట కవకాశము లేదు. నేను ముఖ్యముగా చెప్పవలసినదానిని చెప్పి ముగించెదను. అట్లు కష్టపడి యామె పెంచిన పిల్లలు విద్యయందును, బుద్ధియందును గొప్ప వారై తల్లి ఋణమును దీర్చిరి. ఆ యింట బెద్దవాడు ప్రవేశ పరీక్షయందు గృతార్థుడై యొక యుద్యోగములో ప్రవేశించెను. వెంకమ్మ కూతురు వివాహ యోగ్యమయ్యెను. ధన హీనయైనందున నామె తన బిడ్డ వివాహ మెట్లగునా యని విచారపడుచుండెను. కాని వెంకమ్మ విచారము చాలా దినము లుండినది కాదు. ఆ పిల్లదాని రూప గుణ సంపదఁజూచి మేమే మా పిల్లవానికిఁజేసికొంటిమి. మొదట బీద పిల్లయని నేనెంత యసమధాన పడినను నా భర్త యూరకుండక నా కనేక విధముల సమాధానములు చెప్పి యా ప ఇల్లను నాకు గోడలిగా జేసిరి. నా కోడలిపుడు తన సద్గుణముల వలన మా యింట నందఱకును నధిక ప్రియమైనది. అది నా కోడలైనందున నేను దానిని బొగడిన మీ కంతగా నా మాలయందు నమ్మకముండదు. మనవారిఇ లోకము నుతియింపగా వినవలయునేగాని మనము నితియింపరాదు.

వెంకమ్మ జ్యేష్ఠపుత్రునకాతని తెలివితేటల వలన నారంభముననే ముప్పది రూపాయల వేతనము గల నుద్యోగము దొరికెను. క్రమక్రమముగా నభివృద్ధినొంది యతడిపుడు నూరు రూపాయల వేతనములో నున్నాడు. ఆయన సహాయము వలన

విశేష విద్య నభ్యసించి యాతని తమ్ములిరువురు నొకరు హైకోర్డు ప్లీడరుగాను, మఱియొకడింజనీయరుగా నున్నారు. వెంకమ్మగారి కిప్పుడు సద్గ్రంథ పఠనము, పరోపకారము చేయుటయు దప్ప వేరు పని యేమియు లేదు. ఇప్పుడెప్పుడైన మాటల వశమున మా కిరువురకును పూర్వపు మాటలు జ్ఞాపకము వచ్చుచుండును. అప్పుడిది యంతయు మీ స్వ ప్రయత్నఫలమేయని నేనామెతోఁ బలుమారనుచుందును.

(మహారాష్ట్ర దేశమున గోధుమలు, జొన్నలు, సజ్జలు మొదలగునవి విసరి రొట్టెలు చేయుదురు గాన నచట నవి విసరించూ కూలీతో జీవించువారనేకులు కలరు. ఒకరింట పనికత్తె గా నుండని బీదవారీ పనిలోఁ దమ జీవనమును గడుపు కొనెదరు.

–సావిత్రి, ఫిబ్రవరి, 1904